

డబ్ల్యుపిఎల్ టైటిల్ కొట్టేదెవరో..?

- నేడు ముంబయి, ఢిల్లీ మహిళల మధ్య ఫైనల్ పోరు
- రాత్రి 7.30గం॥లకు

8

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 222 | విజయవాడ, శనివారం 15 మార్చి 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Saturday 15 March 2025 | Rs

యుకె పార్లమెంట్‌లో చిరంజీవికి సత్కారం



చిరంజీవికి మరో అరుదైన గౌరవం దక్కింది. నాలుగు దశాబ్దాలకు పైగా సినీ రంగానికి ఆయన అందిస్తోన్న విశేష సేవలను యూకే ప్రభుత్వం గుర్తించింది. హౌస్ ఆఫ్ కామన్స్ - యు.కె పార్లమెంట్‌లో ఈ గౌరవ సత్కారం చేయనున్నది. నాలుగున్నర దశాబ్దాలుగా సినిమాల ద్వారా కళారంగానికి, సమాజానికి చేసిన సేవలకుగానూ, యుకె కి చెందిన అధికార లేబర్ పార్టీ పార్లమెంట్ మెంబర్ నవేందు మిశ్రా చిరంజీవిని మార్చి 19న సన్మానించనున్నారు. బ్రిడ్జ్ ఇండియా సంస్థ, సినిమా, ప్రజాసేవ.. దాతృత్వానికి చిరంజీవి చేసిన కృషిని గుర్తించి కల్చరల్ లీడర్‌షిప్ ద్వారా ప్రజాసేవలో ఎక్సలెన్స్ కోసం 'జీవిత సాఫల్య పురస్కారం' ప్రదానం చేయనున్నారు.

ఈ ఏడాది 'మత్స్యకార భరోసా'

ప్రశ్నార్థకం

గతేడాది వేట నిషేధ కాలానికే ప్రస్తుత బడ్జెట్లో నిధులు

1,22,968 మందికి రూ.245.94 కోట్లు కేటాయింపు



ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

చేపల వేట నిషేధ పరిహారం చెల్లింపులపై రకరకాల సాకులతో వాయిదా వేస్తూ వచ్చిన టిడిపి కూటమి ప్రభుత్వం ఎట్టకేలకు మేలో చెల్లించనున్నట్లు ప్రకటించింది. అదీ గతేడాది బ్యాన్ పీరియడ్‌కు సంబంధించిన డబ్బులు మాత్రమే ఇచ్చేందుకు సిద్ధమవుతున్నట్లుగా తెలుస్తోంది. ఒక్క ఏడాదికి సరిపోయేలా మాత్రమే బడ్జెట్లో నిధులు కేటాయించింది. ప్రభుత్వం గతేడాది డబ్బులను ఈ ఏడాది మేలో చెల్లించనుంది. ఈ సంవత్సరం ఇవ్వాల్సిన పరిహారం డబ్బులపై సందిగ్ధత నెలకొంది. రెండు సంవత్సరాల పరిహారం అందుకుంటామని ఇప్పటివరకు ఆశించిన మత్స్యకారులకు ప్రభుత్వం షాక్ ఇచ్చినట్లయింది. ప్రభుత్వం ఏటా ఏప్రిల్ 15 నుంచి జూన్ 14వ తేదీ వరకు చేపల వేటపై నిషేధం అమలు చేస్తోంది. ఆ సమయంలో చేపల వేటకు దూరంగా ఉంటున్న మత్స్యకారులకు 61 రోజుల కాలానికి రూ.పది వేలు చొప్పున ఏటా క్రమం తప్పకుండా అందిస్తోంది. గత ప్రభుత్వ హయాంలో మేలోనే చెల్లింపులు జరిగాయి. 2024 సంవత్సరానికి సంబంధించి ఇప్పటివరకు మత్స్య కారులకు వేటనిషేధ పరిహారం డబ్బులు అందలేదు. పాలనాపరమైనా ఇబ్బందులతోపాటు టిడిపి కూటమి ప్రభుత్వం ఉద్దేశపూర్వక కాలయాపనతో మత్స్యకారులు గతేడాది సాయానికి నోచుకోలేకపోయారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో, లబ్ధిదారుల సర్వే ఆలస్యంగా చేపట్టడంతో గతేడాది జూన్ రెండో తేదీన అధికారులు జాబితాను పంపారు. రాష్ట్రంలో గతేడాది కొలువుదీరిన టిడిపి కూటమి ప్రభుత్వం ఈ జాబితాపై రీ సర్వే చేయాలని సెప్టెంబరులో అధికారులను ఆదేశించడంతో చెల్లింపులు వాయిదా పడ్డాయి. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి జాబితాలో తప్పిపోయిన మత్స్యకారుల వివరాలను నవంబరులో పంపారు. ఆ జాబితా ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా 1,30,128 మంది మత్స్యకారులను సర్వే చేశారు. వారిలో ప్రాథమికంగా 1,05,387 మందిని అర్హులుగా గుర్తించారు. నవంబరులో మళ్లీ రీ సర్వే చేసిన తర్వాత అదనంగా 17,581 మందికిపైగా మత్స్యకారులకు జాబితాలో చోటు దక్కింది. దీంతో, మొత్తం 1,22,968 మంది మత్స్యకారులు అర్హులుగా ప్రభుత్వం మిగతా 7లో

రానున్నది భారాల కాలం!



రూ.13 వేల కోట్లు లక్ష్యంగా పన్నులు, సెస్‌ల ప్రతిపాదన

తెరపైకి లాటరీలు, ఆన్‌లైన్ గేమింగ్

భారీగా వృత్తి పన్ను పెంపు

మద్యంపై మూడో సేల్స్ పాయింట్ వ్యాట్ దరువు

వినోదం కూడా మోతే! • జోరుగా ప్రభుత్వ కసరత్తు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ప్రజలపై భారం ఉండదు... సంక్షేమమే మా విధానం అని ఒక వైపు చెబుతూనే మరోవైపు ప్రజలపై భారీగా పన్నులు, సెస్‌లతో ఆర్థిక భారం మోపడానికి రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఆర్థికశాఖ కూడా ఈ దిశగా ప్రతిపాదనలు ఇప్పటికే సిద్ధం చేసినట్లు సమాచారం. దీంతో రానున్నది పన్నుల కాలమేనన్న అభిప్రాయం అధికారవర్గాల్లో వినిపిస్తోంది. ఇప్పటి వరకు వస్తున్న ఆదాయాన్ని మరింతగా పెంచుకునేందుకు కొత్త మార్గాలను అన్వేషించాలని కొంతకాలంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఆర్థికశాఖతోపాటు, ఇతర ఆదాయ వనరుల శాఖలను పదేపదే ఆదేశిస్తున్న సంగతి తెలిసిందే. దీంతో ఏటా అదనంగా రూ.13 వేల కోట్ల మేర ఆదాయం రాబట్టేందుకు ఆర్థికశాఖ ప్రతిపాదనలు చేసినట్లు సమాచారం. ఇంత భారీస్థాయిలో అదనపు ఆదాయం లక్ష్యంగా ప్రతిపాదనలను రూపొందించడం సచివాలయ వర్గాల్లో చర్చనీయాశంగా మారింది. రాష్ట్రంలో నిషేధించిన లాటరీల నిర్వహణ కూడా ఈ ప్రతిపాదనల్లో ఉంది. దీంతో ఏదో రూపంలో లాటరీలను మళ్లీ తీసుకురానున్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఎపి లాటరీస్ విధానం ద్వారా మూడు వేల కోట్లు ఆదాయాన్ని సమకూర్చుకోవాలని భావిస్తున్నారు. దీనిద్వారా ఆదాయాన్ని సమకూర్చు కోవాలంటే నిబంధనలు మార్పు చేయాల్సి ఉంటుందని అధికారులు అంటున్నారు. త్వరలోనే ఈ అంశంపై తుది నిర్ణయం తీసుకునే అవకాశాలున్నా యని వారు చెబుతున్నారు. ఆన్‌లైన్ గేమింగ్ ద్వారా మరో రూ.1,400 కోట్లు రాబట్టాలని యోచిస్తున్నారు. దీనికి సంబంధించిన అంశం ప్రస్తుతం హైకోర్టులో విచారణ దశలో ఉంది. ఈ నెల 26న మరోసారి హైకోర్టులో విచారణ జరగనుంది. హైకోర్టు తీర్పు తరువాత ఈ దిశలో అడుగులు పడే అవకాశం ఉందని సమాచారం. రాష్ట్రానికి ఎస్‌జిఎస్‌టిగా వస్తున్న ఆదాయంలో వినియోగదారుపై ఒక శాతాన్ని సెస్‌గా వసూలు చేయాలని కూడా ఆర్థికశాఖ అధికారులు ప్రతిపాదించారు. దీనివల్లే రూ.4,700 కోట్లు సమకూర్చుకోవాలని భావిస్తున్నారు. ఇటీవల కేంద్రం నేతృత్వంలో జరిగిన జిఎస్‌టి కౌన్సిల్ సమావేశంలో కూడా దీనిపై చర్చ జరిగింది. దీనిపై మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటుచేయాలని కూడా కేంద్రం నిర్ణయించడం విశేషం.

ప్రభుత్వానికి కొత్త ఆదాయ మార్గాలు ఇవే

అంశం	మొత్తం (రూ.కోట్లలో)
ఎస్‌జిఎస్‌టిపై 1శాతం సెస్	4,700
ఆంధ్రప్రదేశ్ లాటరీ	3,000
ఆన్‌లైన్ గేమింగ్	1,400
వినోదపు పన్ను పెంపు	2,300
మద్యంపై 2, 3 పాయింట్లలో వ్యాట్	1,300
వృత్తి పన్ను పెంపు	400
మొత్తం	13,100

పేదలపై వినోదం భారం

స్థానిక సంస్థల పరిధిలో నివాసం ఉంటున్న జనంపై వినోదపు పన్ను భారం పడనుంది. దీనిద్వారా ఏకంగా రూ.2,300 కోట్లు వరకు ఆర్జించాలని ప్రభుత్వం యోచిస్తోంది. సినిమా హాళ్లు, పార్కులు, పర్యాటక రంగాలు, వినోదాన్ని అందించే ఇతర రంగాల్లో భారీగా పన్నులు, రుసుములు పెంచే యోచన ఉన్నట్లు ఈ ప్రతిపాదనల ద్వారా తెలుస్తోంది. ఇప్పటికే దీనిపై నమూనా నియమావళిని కూడా సిద్ధం చేసేసారు. ప్రస్తుతం ఇది న్యాయ శాఖ పరిశీలనలో ఉన్నట్లు తెలిసింది.

మద్యంపై మరింతగా...

ఇప్పటికే అదనపు రిటైల్ వ్యాట్‌ను ప్రయోగిస్తున్న ప్రభుత్వం కొత్తగా మద్యం అమ్మకాలపై రెండు, మూడో పాయింట్ల వద్ద కూడా వ్యాట్‌ను వేయాలని నిర్ణయించింది. ఈ అంశంపై ఇప్పటికే ఎక్సయిజ్ శాఖ అధికారులతో ఉన్నతస్థాయి సమావేశం కూడా జరిగినట్లు తెలిసింది. దీనిని అమలు చేసేందుకు ఉన్న అవకాశాలపై నివేదిక ఇవ్వాలని కూడా ప్రభుత్వం ఆదేశించడం విశేషం. రూ.1300 కోట్లను ఈ విధంగా ఖజానాకు జమచేయాలని ప్రతిపాదించారు.

భారీగా వృత్తి పన్ను పెంపు

వృత్తి పన్ను చెల్లింపుదారులపై భారీగా భారం మోపతున్నారని సమాచారం. వివిధ వృత్తులను నిర్వహించుకుంటున్న వారినుంచి ఇప్పటివరకు రూ.2,500 వరకు వసూలు చేస్తుండగా, ఇప్పుడు దానిని ఏకంగా రూ.12 వేల నుంచి రూ.18 వేలకు పెంచేలా చూడాలని భావిస్తున్నారు. దీనిపై రెవెన్యూ శాఖకు ఇప్పటికే ప్రభుత్వం నుంచి లేఖ వెళ్లినట్లు తెలిసింది. ఉన్న వృత్తి పన్నును పెంచేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కూడా మిగతా 7లో



సభలో మాట్లాడుతున్న పవన్



హాజరైన జనం

నిలదొక్కుకున్నాం... టిడిపిని నిలబెట్టాం

మార్పు కోసమే రాజకీయాల్లోకి వచ్చాను

'జనసేన జయకేతనం' ఆవిర్భావ సభలో పవన్ కల్యాణ్

ప్రజాశక్తి- కాకినాడ ప్రతినిధి, పిఠాపురం

ఓడినా అడుగులు ముందుకు వేశామని, అధికారం కోసం కాకుండా మార్పు కోసం రాజకీయాల్లోకి వచ్చానని జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. కాకినాడ జిల్లా పిఠాపురం శివారు చిత్రాడలో శుక్రవారం జరిగిన జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం సభలో ఆయన మాట్లాడారు. అన్నీ ఒక్కడినే అయి 2014లో జనసేన పార్టీని స్థాపించానన్నారు. 2018 పోరాట యాత్ర చేశానని తెలిపారు. ఓటమి భయం లేదు కాబట్టే 2019లో పోటీ చేశామన్నారు. ఓడినా అడుగు ముందుకే వేశామని, మనం నిలదొక్కుకోవడమే కాకుండా నాలుగు దశాబ్దాల టిడిపి పార్టీని కూడా నిలబెట్టామని అన్నారు. 2019లో ఓడినప్పుడు ఎన్నో అవమానాలను చూశామని పేర్కొన్నారు. వీర మహిళలను సైతం హింసించారన్నారు. ఇదేం న్యాయమని అడిగితే కేసులు పెట్టారని వివరించారు. నాలుగు దశాబ్దాల సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న నాయకుడిని అక్రమ కేసుల్లో బంధించారని విమర్శించారు. అసెంబ్లీ గేటును కూడా తాకలేవు అని ఛాలెంజ్ చేసిన వారి తొడలను బద్దలుగొట్టామన్నారు. దేశమంతా చూసేలా వంద శాతం స్ట్రైక్ రేట్‌తో విజయం సాధించి ఎన్‌డిఎ ప్రభుత్వాన్ని నిలబెట్టామని తెలిపారు. వంద శాతం స్ట్రైక్ రేట్‌కు జనసేన సిద్ధాంతాలే కారణమన్నారు. హర్యానాలో ఎన్‌డిఎ కోసం ప్రచారం చేశానని, 95 శాతం సీట్లు గెలిచామని తెలిపారు. దేశంలో తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి వచ్చిన జనసైనికులకు అభిమానులకు వారివారి ప్రాంతీయ భాషలో నమస్కారాలు తెలిపారు. బహుభాషా విధానమే దేశానికి మంచిదన్నారు. తాను సినిమాలను దృష్టిలో పెట్టుకుని ఎదగలేదని, సమాజాన్ని దేశాన్ని దృష్టిలో పెట్టుకొని ఎదిగానని తెలిపారు. 2006లో బహుజన సిద్ధాంతాల కోసం అంబేద్కర్ ఆశయాల కోసం ఆలోచించే ప్రస్తుత హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ శ్రీపతిరాముడు రాజకీయాల్లోకి రావాలని కోరారని, తనకు ఇంకా అంత మెచ్యూరిటీ రాలేదని ఆనాడు తెలిపానన్నారు. 450 మంది జనసైనికులు సినిమాలను కాకుండా పార్టీ సిద్ధాంతాలను నమ్మి వివిధ కారణాలతో చనిపోయారని, వారందరి కుటుంబాలను పార్టీ తరఫున ఆదుకున్నామని తెలిపారు. గద్దర్‌తో తనకున్న అనుబంధాన్ని పంచుకున్నారు. సగటు మధ్యతరగతి మనిషిగా బతకాలన్నదే తన కోరికని తెలిపారు. రాజకీయాల్లోకి వస్తాననిగానీ, సినిమాల్లోకి వస్తానని తానూ కూడా ఊహించలేదన్నారు. ప్రజా సమస్యలపై నిలబడేలా చేసింది తనలో భావ తీవ్రత అని తెలిపారు. చేగువేరాలో మానవత్వాన్ని చూసి ఇష్టపడ్డానన్నారు. భిన్నత్వంలో ఏకత్వాన్ని చూడగలగడం తన ఆదర్శమని తెలిపారు. చిన్నతనం నుంచి ఈ క్షణం వరకు ప్రతి అంశాన్ని నేర్చుకుంటూనే ఉన్నానన్నారు. మనం 11 సంవత్సరాలు పూర్తి చేసుకున్నామని, వారిని 11 సీట్లకు పరిమితం చేశామని పేర్కొన్నారు. ఈ సభ మిగతా 7లో

సెకీ ఒప్పందాన్ని రద్దు చేయాల్సిందే!

- కొనసాగిస్తామన్న సిఎం ప్రకటన గర్హనీయం
- సిపిఎం రాష్ట్ర కమిటీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

లక్షా పదివేల కోట్ల రూపాయల విద్యుత్ భారం మోపే అవినీతికర సెకీ ఒప్పందాన్ని రద్దు చేయాలని సిపిఎం రాష్ట్ర కమిటీ మరోసారి డిమాండ్ చేసింది. అసెంబ్లీలో దాన్ని రద్దు చేయబోమని, కొనసాగిస్తామని ముఖ్యమంత్రి అసెంబ్లీ సాక్షిగా ప్రకటించడం గర్హనీయమని, ఆ ప్రకటనను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని పేర్కొంది. ఈ మేరకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్ర ప్రభుత్వ ఒత్తిడి మేరకు గతంలో వైసిపి ప్రభుత్వం సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సెకీ) ద్వారా అదానీ సంస్థల నుండి ఏడు వేల మెగావాట్ల విద్యుత్ కొనుగోలు ఒప్పందాన్ని చేసుకున్నదని తెలిపారు. ఆనాటి ప్రభుత్వ పెద్దలకు రు.1,750 కోట్ల రూపాయల ముడుపులిచ్చి ఈ ఒప్పందం చేసుకున్నట్లు అమెరికా కోర్టులో సాక్ష్యాధారాలతో విచారణ జరుగుతోందని పేర్కొన్నారు. దీనికి సంబంధించి అనేక ఆధారాలు బట్టబయలయ్యా యని, పెద్దఎత్తున అవినీతికి పాల్పడి కేంద్రం అండతో రాష్ట్ర ప్రజలకు తీరని నష్టం కలిగించన గత ప్రభుత్వం ఒప్పందాన్ని రద్దు చేయాల్సిన కూటమి ప్రభుత్వం ఆ పని చేయకపోగా కొనసాగించడం ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడమే అవుతుం దని తెలిపారు. కొద్ది నెలలుగా ఆలోచిస్తున్నామని, న్యాయ నిపుణులతో మాట్లాడుతున్నామని సన్నాయి నొక్కులు నొక్కిన ముఖ్యమంత్రి నేడు బహిరంగంగా ఒప్పందం కొనసాగిస్తామని ప్రకటించడం శోచనీయమని తెలిపారు. ఒప్పందం రద్దు చేస్తే పెనాల్టీలు కట్టాల్సి వస్తుందని ముఖ్యమంత్రి చెప్పడం వాస్తవ విరుద్ధమని, ప్రపంచంలో శ్రీలంక, బంగ్లాదేశ్‌తో సహా అనేక దేశాలు అదానీ సంస్థలతో ఒప్పందాలు రద్దు చేసుకున్నాయని తెలిపారు. కూటమి ప్రభుత్వం కూడా అనేక కాంట్రాక్టులను తిరగ దోడిందని, కానీ కేంద్రానికి, అదానీకి లొంగిపోయి ఈ ఒప్పందాన్ని కొనసాగించడం రాష్ట్ర ప్రజలకు, విద్యుత్ రంగానికి తీరని హాని కలిగి స్తోందని తెలిపారు. ఒప్పందాన్ని రద్దుచేసి ప్రజల్లో విశ్వాసం కల్పించాల్సింది పోయి మిగతా 2లో

పారదర్శకతకు పాతర

'స్పెక్ట్రం' వేలానికి ఫుల్‌స్టాప్ • 'నిర్వహణ కేటాయింపు'తో స్టార్‌లింక్‌కు లైన్ క్లియర్

రెండు దేశీయ కంపెనీలతో కలిసి భారత్‌లోకి ప్రవేశం

ప్రధాని మోడీ యుఎస్ పర్యటనతో మారిన పరిస్థితి

7

బంగారం ఆల్‌టైం రికార్డ్ ధర

- ఔన్స్ ధర 3000 డాలర్లు

న్యూఢిల్లీ : అంతర్జాతీయంగా, దేశీయంగా బంగారం ధరలు భగ్గుమంటున్నాయి. డొనాల్డ్ ట్రంప్ ఆర్థిక అనిశ్చితి నిర్ణయాలు, అమెరికాలో ఆర్థిక మాంద్యం ఏర్పడొచ్చనే ఆందోళనల నేపథ్యంలో ఇన్వెస్టర్లు సురక్షిత పెట్టుబడిగా బంగారాన్ని ఎంచుకుంటు న్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో శుక్రవారం ఒక్క ఔన్స్ (31.10 గ్రాముల) బంగారం ధర 3000 డాలర్లకు చేరి.. నూతన రికార్డ్ స్థాయికి ఎగిసింది. స్పాట్ గోల్డ్ ధర 0.4 శాతం పెరిగి 3,000.87 డాలర్లుగా పలకడం ఇదే తొలిసారి. ఔన్స్ వెండి ధర 0.4 శాతం పెరిగి 33.94 డాలర్లుగా, ప్లాటినం ధర 0.5 శాతం తగ్గి 989.04 డాలర్లుగా పలికింది. హైదరాబాద్ మార్కెట్‌లో 24 క్యారెట్ల స్వచ్ఛత కలిగిన 10 గ్రాముల బంగారంపై రూ.1200 పెరిగి రూ.89,780గా, 22 క్యారెట్లపై రూ.1100 ఎగిసి రూ.82,300గా నమోదైంది. కిలో వెండిపై రూ.2000 ఎగిసి రూ.1,12,000కు చేరింది.

నేటి నుంచి ఎపిఇఎపిసెట్ దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - కాకినాడ

ఎపి ఇఎపిసెట్-2025 (ఎపి ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్) దరఖాస్తులను శనివారం నుంచి స్వీకరించనున్నట్లు సెట్ చైర్మన్, జెఎన్‌టియుకె విసి ప్రొఫెసర్ సిఎస్ఆర్‌కె.ప్రసాద్, సెట్ కన్వీనర్ వి.సుబ్బారావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి నేతృత్వంలో జెఎన్‌టియుకె ఆధ్వర్యంలో ఈ పరీక్షను నిర్వహించనున్నారు. https://cets.apsche.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఏప్రిల్ 24 వరకు అపరాధ రుసుం లేకుండా విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. మే 19 నుంచి 27 వరకూ ఆన్‌లైన్‌లో పరీక్షలు నిర్వహిస్తామని, రాష్ట్ర వ్యాప్తంగా 46, హైదరాబాద్‌లోని రెండు సెంటర్లు కలిపి మొత్తం 48 కేంద్రాల్లో పరీక్షను నిర్వహించనున్నామని పేర్కొన్నారు. మే 19, 20న అగ్రికల్చర్, ఫార్మసీ విభాగాలకు రోజుకు రెండు సెషన్‌లు, ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి మే 21 నుంచి మే 27 వరకు పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. ఉదయం తొమ్మిది గంటల నుండి 12 గంటల వరకు, మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఐదు గంటల వరకు రెండు సెషన్లలో పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మే 25న పరీక్ష నిర్వహించబోమని, 24న ఒక సెషన్‌లో మాత్రమే పరీక్ష నిర్వహిస్తున్నామని తెలిపారు. సెట్ కౌన్సెలింగ్ సమయానికి ఇంటర్మీడియట్ కళాశాల ద్వారా అపార్ ఐడి పొందాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, రిజర్వేషన్ పొందేందుకు అర్హత ఉన్న విద్యార్థులు తమ దరఖాస్తులను పూరించేటప్పుడు ప్రస్తుత ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రం నెంబర్ నమోదు చేయాలని సూచించారు. విద్యార్థులు తప్పనిసరిగా తమకు సమీపంలోని ఐదు పరీక్షా కేంద్రాలను ఎంపిక చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. మే 12 నుంచి విద్యార్థులు తమ హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని పేర్కొన్నారు.

వెల్లువెత్తిన 'ఉక్కు' నిరసనలు



విశాఖలో ఉక్కు జెఎసి ఆధ్వర్యాన చేపట్టిన నిరసన ప్రదర్శన

సొంత గనులు కేటాయించాలని, సెయిల్‌లో విలీనం చేయాలని డిమాండ్

ప్లాంట్ అభివృద్ధికి ఉపయోగపడని విధంగా ప్యాకేజీ

కాంట్రాక్టు కార్మికులను తొలగిస్తే ఊరుకునేది లేదని హెచ్చరిక

2

వెల్లువెత్తిన 'ఉక్కు' నిరసనలు

- సొంత గనులు కేటాయించాలని, సెయిల్‌లో విలీనం చేయాలని డిమాండ్
- ప్లాంట్ అభివృద్ధికి ఉపయోగపడని ప్యాకేజీ
- కాంట్రాక్టు కార్మికులను తొలగిస్తే ఊరుకునేది లేదని హెచ్చరిక



విజయవాడలో జరిగిన నిరసనలో వడ్డే శోభనాద్రీశ్వరరావు, విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట ఐక్య వేదిక నేతలు

ప్రజాశక్తి- విలేకరుల యంత్రాంగం

విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయానికి వ్యతిరేకంగా శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించి పూర్తి ఉత్పత్తి సామర్థ్యంతో నడపాలని, కర్మాగారాన్ని సెయిల్‌లో విలీనం చేయాలని, కాంట్రాక్టు కార్మికుల తొలగింపులు ఆపాలని, కార్మిక నేతలకు ఇచ్చిన షోకాజ్ నోటీసులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట సమితి పిలుపు మేరకు ఆందోళనలు నిర్వహించారు. సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు, ఎఐసిసిటియు తదితర కార్మిక సంఘాలు, ఎస్‌ఎఫ్‌ఐ, డివైఎఫ్‌ఐ, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు. సిపిఎం, సిపిఐ, సిపిఐ ఎంఎల్ నాయకుల హాజరై మద్దతు తెలిపారు.

విశాఖలో నిరసనలు హోరెత్తాయి. ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెం కూడలిలోని దీక్షా శిబిరానికి పెద్ద ఎత్తున కార్మికులు తరలివచ్చి నిరసన తెలిపారు. కార్మికులనుద్దేశించి ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, జె.అయోధ్యరామ్, రామస్వామి, రమణమూర్తి, ఎన్.రామారావు, నీరుకొండ రామచంద్రరావు, దొమ్మేటి అప్పారావు, డి.సురేష్‌బాబు, సిహెచ్.సన్యాసిరావు, పరంధామయ్య, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు నమ్మి రమణ, మంత్రి రవి, వంశీ, అప్పారావు మాట్లాడుతూ ప్లాంట్ ప్రైవేటీకరణ కుట్రలను ఐక్య పోరాటాలతో తిప్పికొడతామన్నారు. కాంట్రాక్టు కార్మికులను తొలగిస్తే ఊరుకొనేది లేదని హెచ్చరించారు. సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ ఉక్కు ఉద్యమాన్ని నిర్బంధాలతో అణచలేరన్నారు. స్టీల్ కార్మికులు, తెలుగు రాష్ట్ర ప్రజల ఉమ్మడి పోరాటంతో మోడీ సర్కారు ప్యాకేజీని ప్రకటించినప్పటికీ దానిలో ఒక్క రూపాయి కూడా స్టీల్‌ప్లాంట్ అభివృద్ధికిగానీ, ఉపాధి కల్పనకుగానీ, ఉత్పత్తి వ్యయానికిగానీ, కార్మికుల వేతనాలకుగానీ వినియోగించకుండా కేంద్ర ప్రభుత్వం ఆంక్షలు విధించడం శోచనీయమన్నారు. కార్మికుల సంఖ్య తగ్గించాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించడం, దానిని స్టీల్ యాజమాన్యం గుడ్డిగా అమలు చేయడం తగదన్నారు.

విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో జివిఎంసి గాంధీ విగ్రహం నుంచి ఆర్‌టిసి కాంప్లెక్స్ సమీపంలోని గురజాడ విగ్రహం వరకూ నిరసన ప్రదర్శన, అక్కడి కూడలిలో మానవహారం నిర్వహించారు. సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ అధ్యక్షతన జరిగిన సభలో జెఎసి ఛైర్మన్ ఎం.జగ్గునాయుడు, ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ, ఐఎన్‌టియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బి.నాగభూషణం, సిఎఫ్‌టియుఐ జాతీయ అధ్యక్షులు ఎన్.కనకారావు మాట్లాడుతూ ఉక్కు కార్మిక నేతలపై గురువారం రాత్రి నుంచీ నిర్బంధాన్ని ప్రయోగించడాన్ని ఖండించారు.

విజయవాడ ధర్నా చౌక్‌లో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో మాజీ మంత్రి, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ సమితి రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట ఐక్య వేదిక రాష్ట్ర చైర్మన్ సిహెచ్.నర్సింగరావు, ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు ఆర్.రవీంద్రనాథ్ మాట్లాడుతూ రాష్ట్రంలోని టిడిపి కూటమి నాయకులు విశాఖ ఉక్కు పరిరక్షణకు గత ఎన్నికల ముందు, ఆ తర్వాత ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. 32 మంది ప్రాణాల బలిదానంతో తెలుగు ప్రజలు విశాఖ స్టీల్ ప్లాంట్‌ను సాధించుకున్నారని తెలిపారు. ఎన్‌డిఎ కూటమి నేతృత్వంలోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పార్లమెంట్, అసెంబ్లీ తీర్మానాల ద్వారా తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగంలోని విశాఖ ఉక్కు పరిరక్షణకు ప్రజలు, ట్రేడ్ యూనియన్లు దీర్ఘకాలంగా పోరాడుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదన్నారు. పైగా, అనకాపల్లిలో మిట్టల్ కంపెనీ ఆధ్వర్యాన ప్రైవేట్ స్టీల్ ప్లాంట్‌కు రాష్ట్ర ప్రభుత్వం మౌలిక వసతులు కల్పిస్తోందని, విశాఖ స్టీల్ ప్లాంట్‌కు పరోక్షంగా నష్టం కలిగిస్తోందని తెలిపారు. విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు రాజకీయలకు అతీతంగా అన్ని తరగతుల ప్రజానీకం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ 'ఉక్కు' ఉద్యమానికి మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రామకృష్ణ, టియుసిఐ రాష్ట్ర అధ్యక్షులు మరీదు ప్రసాద్‌బాబు తదితరులు ప్రసంగించారు. సిఐటియు ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్షులు ఎ.వెంకటేశ్వరరావు, ఎఐటియుసి నగర అధ్యక్షులు సాంబశివరావు అధ్యక్షత వహించారు. కృష్ణా జిల్లా గుడివాడ ఆటో నగర్‌లో కార్మిక సంఘాల ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు.

అనకాపల్లి, శ్రీకాకుళం, విజయనగరం, కాకినాడ. ఏలూరు, తిరుపతి, కర్నూలు, అనంతపురం, బాపట్ల, ప్రకాశం జిల్లా ఒంగోలు, వైఎస్ఆర్ జిల్లా కడప, తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం, పల్నాడు జిల్లా నరసరావుపేట, పశ్చిమగోదావరి జిల్లా భీమవరం తదితర ప్రాంతాల్లో నిరసనలు తెలిపారు.


మార్క్స్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.సుబ్బరావమ్మ, సిపిఐ ఎంఎల్ రాష్ట్ర నాయకులు పద్మ తదితరులు

మార్క్సిజమే రక్ష

- నివాళులర్పించిన వామపక్ష నేతలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కారల్‌మార్క్స్ సిద్ధాంతమే దేశానికి రక్ష అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. విజయవాడ హనుమాన్‌పేటలోని కారల్ మార్క్స్ విగ్రహం వద్ద శుక్రవారం మార్క్స్ 142వ వర్థంతి సందర్భంగా వామపక్ష పార్టీల నేతలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రామకృష్ణ మాట్లాడుతూ ప్రపంచ చరిత్రలో జీవ పరిణామ సిద్ధాంతకర్త డార్విన్, మానవ పరిణామ సిద్ధాంతకర్త కారల్ మార్క్స్ వీరిద్దరికీ ఉన్న ప్రత్యేక స్థానాన్ని అంగీకరించాలన్నారు. మత ప్రాతిపదికన సమాజాన్ని విభజించి, మెజారిటీ మతోన్మాదాన్ని రెచ్చగొట్టడం ద్వారా కార్పొరేట్ శక్తులకు ప్రయోజనం కలిగించేలా కేంద్రంలోని మోడీ ప్రభుత్వం పనిచేస్తోందని ఆయన విమర్శించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కారుసాల సుబ్బారావమ్మ మాట్లాడుతూ దోపిడీ రహిత సమాజ నిర్మాణానికి వర్గ పోరాటం అనివార్యమన్న కారల్ మార్క్స్ స్ఫూర్తితో పనిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ రాష్ట్ర నాయకులు పద్మ, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, పలువురు వామపక్ష పార్టీల నేతలు, యువజన సంఘాల నేతలు, విద్యార్థి సంఘాల నాయకులు, ప్రజానాట్య మండలి కళాకారులు పాల్గొన్నారు.



శ్రీనివాస కల్యాణానికి సిఎంకు ఆహ్వానం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాజధాని ప్రాంతంలోని వెంకటపాలెంలో ఈ నెల 15వ తేదీ సాయంత్రం జరుగనున్న శ్రీనివాస కల్యాణానికి రావాలని కోరుతూ శుక్రవారం సిఎం చంద్రబాబునాయుడు, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌లను టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు, టిటిడి జెఇఓ శ్యామలరావు, అదనపు ఇఓ సిహెచ్ వెంకన్న చౌదరి కలిసి ఆహ్వానపత్రికను అందజేశారు. సిఎం కుటుంబ సభ్యులను ఆహ్వానించిన వారిలో టిటిడి బోర్డు సభ్యులు జ్యోతుల నెహ్రూ, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, ఎంఎస్ రాజు, నన్నపనేని సదాశివరావు, ముని కోటేశ్వరరావు, ఆర్ఎన్ దర్శన్, ఎం.శాంతారామ్, తమ్మిశెట్టి జానకీదేవి, సుచిత్ర ఎల్లా, ఎన్ నరేష్‌కుమార్ ఉన్నారు.

300 బస్సుల ఏర్పాటు : టిటిడి ఇఓ శ్యామలరావు

ఈనెల 15న శ్రీనివాస కల్యాణోత్సవాన్ని 27వేల మంది వీక్షించేలా ఏర్పాట్లు చేయడంతో పాటు, యాత్రికులు ఆలయం వద్దకు చేరుకునేందుకు వీలుగా టిటిడి 300 బస్సులను ఏర్పాటు చేస్తుందని టిటిడి ఇఓ జె.శ్యామలరావు పేర్కొన్నారు. శ్రీనివాస కళ్యాణోత్సవం ఏర్పాట్లపై అధికారులతో శుక్రవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. విజయవాడ నుంచి అమరావతికి విస్తృతంగా బస్సులున్న నేపథ్యంలో మందడం నుంచి ప్రతి 5నిమిషాలకు ఒక బస్సు ఏర్పాటు చేశామన్నారు. శ్రీనివాస కల్యాణోత్సవానికి హాజరయ్యే వారికి శ్రీవారి లడ్డు, పసుపు, కుంకుమ ప్యాకెట్, పసుపు దారం, కంకణాలు, శ్రీవారి పుస్తక ప్రసాదం, కళ్యాణోత్సవం అక్షింతలు కలిపి ఒక బ్యాగ్‌లో పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టిటిడి అదనపు ఇఓ సిహెచ్ వెంకయ్య చౌదరి, గుంటూరు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, జెఇఓ వి.వీరబ్రహ్మం, టిటిడి సివిఎస్‌ఓ హర్షవర్ధన్‌రాజు, ఎస్‌పి సతీష్‌కుమార్, సిఇ సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యులకు డిసిహెచ్‌ఎస్‌లుగా ఉద్యోగోన్నతి

- 85మందిలో 50మంది విముఖత
- పరిస్థితిని చక్కదిద్దే చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

జిల్లాస్థాయిలో ఏర్పడిన జిల్లా ఆరోగ్య సేవల సమన్వయకర్తల (డిసిహెచ్‌ఎస్) పోస్టుల భర్తీ ప్రక్రియ శుక్రవారం వైద్య ఆరోగ్యశాఖ చేపట్టింది. వీరిలో తొమ్మిదిమంది ప్రభుత్వ డాక్టర్లు ఉద్యోగోన్నతి పొందారు. ఉద్యోగోన్నతులను రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆమోదించారు. ఉద్యోగోన్నతులకు సంబంధించిన ప్రతిపాదనలను మంత్రి పరిశీలించారు. అర్హులైన 85 మందిలో 50మంది డిసిహెచ్‌ఎస్‌గా పదోన్నతికి నిరాకరించినట్లు గమనించారు. అర్హత కలిగిన వైద్యుల్లో 59శాతం మంది ఉద్యోగోన్నతికి ఇష్టపడకపోవడం పట్ల మంత్రి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల చేపట్టిన ఉద్యోగోన్నతుల ప్రక్రియలో కూడా 33 శాతమంది అర్హత కలిగిన వైద్యులు ప్రొఫెసర్లుగా ఉద్యోగోన్నతికి నిరాకరించారు. తాజాగా డిసిహెచ్‌ఎస్‌గా పదోన్నతికి నిరాకరించడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ విషయంపై ఉద్యోగోన్నతికి అర్హులైన వైద్యులు తమకు నచ్చిన ప్రదేశంలో పోస్టింగ్ పొందే వరకు అదే విధంగా తిరస్కరిస్తున్నారని ఉన్నతాధికారులు మంత్రికి అందజేసిన నివేదికలో పేర్కొన్నారు. ఈ పరిస్థితిని నిశితంగా పరిశీలించి అవసరమైన పరిష్కార చర్యలు చేపట్టాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ అధికారులను ఆదేశించారు.

జిల్లా స్థాయిలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు (సిహెచ్‌సిలు), జిల్లా, ఏరియా ఆసుపత్రుల పనితీరును జిల్లా ఆరోగ్య సేవల సమన్వయకర్తలు పర్యవేక్షించనున్నారు. సెకండరీ హెల్త్ డైరెక్టర్ కింద పనిచేసే సిహెచ్‌సి, జిల్లా ఏరియా ఆసుపత్రులు 224 ఉన్నాయి. సివిల్ సర్జన్ స్పెషలిస్ట్ (సిఎస్‌ఎస్) హోదాలో మూడేళ్లపాటు సేవలందించి పదవీ విరమణకు ముందు రెండేళ్ల సర్వీస్ మిగిలివున్న వైద్యులు డిసిహెచ్‌ఎస్‌గా ఉద్యోగోన్నతికి అర్హులవుతారు. ప్రస్తుతం శ్రీకాకుళం, విజయనగరం, తూర్పుగోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల డిసిహెచ్‌ఎస్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. నెల్లూరు, చిత్తూరు జిల్లాల్లో త్వరలో ఖాళీలు ఏర్పడతాయని వైద్యారోగ్య శాఖ పేర్కొంది.

సోషల్ మీడియాలో జగన్‌పై పోస్టు

- పోలీసులకు వైసిపి నేతల ఫిర్యాదు

ప్రజాశక్తి- తాడేపల్లి (గుంటూరు జిల్లా)

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై సోషల్ మీడియాలో వచ్చిన అనుచిత పోస్టుపై గుంటూరు తాడేపల్లికి చెందిన వైసిపి నాయకులు అంకంరెడ్డి నాగనారాయణ శుక్రవారం తాడేపల్లి పోలీసు స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశారు. 'ఇది ఒక బాబాయిని లేపేసి మింగినోడి కథ' అంటూ క్యాప్షన్ పెట్టి జగన్‌కు పక్షి రెక్కలు ఉన్నట్లు మార్ఫింగ్ చేసి పోస్ట్ పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు. మంత్రి నారా లోకేష్ పేరు మీద ఉన్న ఐటి విభాగానికి చెందిన సెల్ నుండి ఈ పోస్టు వచ్చినట్టు పేర్కొన్నారు. తాడేపల్లి పోలీసులు కేసు విచారిస్తున్నారు.

సెకీ ఒప్పందాన్ని రద్దు చేయాల్సిందే!


మొదటి పేజీ తరువాయి

కార్పొరేట్లకు విశ్వాసం కల్పించే చర్యలకు ప్రభుత్వం పూనుకోవడం సిగ్గుచేటని వివరించారు. అదానీ ఒప్పందం విషయంలో కేంద్రంలో బిజెపి గతంలో ప్రభుత్వంలో వున్న వైసిపి, నేడున్న టిడిపి, జనసేన కూటమి ఒకే దారిలో నడుస్తున్నాయని పేర్కొన్నారు. అవినీతిని బయటికి తీస్తానన్న ముఖ్యమంత్రి గత ప్రభుత్వ అవినీతిని కాపాడటానికి పూనుకోవడం వారి ద్వంద వైఖరికి నిదర్శనమని పేర్కొన్నారు. ఈ ఒప్పం దాన్ని రద్దు చేయాలని గతంలో ప్రతిపక్షంలో ఉండగా నేటి ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ హైకోర్టులో పిల్ కూడా వేశారని, నేడు కూటమి ప్రభుత్వం మాట మార్చి ఆదానీ, జగన్మోహన్ రెడ్డి అవినీతిని కాపాడుతోందని విమర్శించారు. మరో వైపు నిన్న శాసనసభలో జగన్ అవినీతిని కూకటి వేళ్లతో పెకిలిస్తామనిలోకేష్ గొప్పలు చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి, కూటమి ప్రభుత్వం తమ వైఖరి మార్చుకోవాలని, రాష్ట్రానికి హానిచేసే అదానీ, సెకీ ఒప్పందాన్ని రద్దు చేయాలని, అవినీతి ఒప్పందాలపై విచారణ చేయాలని డిమాండు చేశారు.

కొనసాగుతున్న ప్రజాచైతన్య యాత్రలు

ప్రజాశక్తి-యంత్రాంగం

ప్రజా సమస్యల పరిష్కారం కోసం సిపిఎం చేపట్టిన ప్రజా చైతన్య యాత్రలు శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగాయి. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు ఇంటింటికీ వెళ్లి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. చైతన్య యాత్రలు ప్రజా సమస్యల పరిష్కారానికి మార్గమని తెలిపారు. టిడిపి కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు అనేక హామీలు ఇచ్చిందని, ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలు పూర్తయినప్పటికీ సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. రాబోయే కాలంలో సిపిఎం ఆధ్వర్యంలో సమస్యలను అధ్యయనం చేసి వాటి పరిష్కారం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు ఆందోళనలు చేపట్టనున్నట్లు తెలిపారు. దీనిలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



బాపట్ల జిల్లా చీరాలలో పర్యటిస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రమాదేవి

బాపట్ల జిల్లా చీరాల పట్టణంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రమాదేవి పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ఏళ్ల తరబడి సొంత ఇళ్లు లేక అద్దె ఇళ్లలో మగ్గిపోతున్నామని స్థానికులు తెలిపారు. ప్రభుత్వం అడ్డగోలుగా విద్యుత్ చార్జీలు పెంచడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి పోరాడుతామని తెలిపారు. గుంటూరు జిల్లా ఫిరంగిపురం మండలంలో బేతపూడి, గుండాలపాడు గ్రామాల్లో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఈమని అప్పారావు బృందం పర్యటించింది. మంచినీరు, రోడ్లు, డ్రెయినేజీ సమస్య తీవ్రంగా ఉందని, శ్మశాన సమస్య ఇంతవరకూ పరిష్కారం కాలేదని స్థానికులు నాయకుల దృష్టికి తీసుకొచ్చారు. దుగ్గిరాల చెన్నకేశవ కాలనీలో డ్రెయినేజీ వ్యవస్థ అస్థవ్యస్తంగా ఉందని, నివాసం ఉన్నచోటునే ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని, ఉపాధి పనులు 150 రోజులు కల్పించాలని కోరారు. పెదనందిపాడు మండలం వరగానిలో కోయ సామాజిక తరగతికి చెందిన 60 కుటుంబాలు తమ సమస్యలను నాయకులకు తెలిపారు. కర్నూలు నగరంలోని రోజా వీధిలో ప్రజా చైతన్య యాత్రను సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్ ప్రారంభించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నంద్యాలలో సిపిఎం పట్టణ కార్యదర్శి దర్శనం లక్ష్మణ్, కార్యదర్శి వర్గ సభ్యులు పుల్లా నరసింహ పర్యటించారు. టిడిపి కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం మండలం పూడిమడక, రాంబిల్లి మండలం కొత్తపట్నం తదితర మత్స్యకార గ్రామాల్లోని మత్స్యకారులు మాట్లాడుతూ వేట నిషేధ కాలపు భృతి చెల్లించాలని కోరారు. అల్లూరి జిల్లా డుంబ్రిగుడ మండలం గసభ పంచాయతీ జోడిగూడ గ్రామంలో తాగునీటి సమస్యను నేతల దృష్టికి గ్రామస్తులు తీసుకొచ్చారు. ముంచింగిపుట్టు మండలం లక్ష్మీపురం పంచాయతీ జబడ గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ఆదివాసీల సమస్యలను నాయకులు తెలుసుకున్నారు. విజయనగరంలోని గురజాడ నగర్‌లో తాగునీరు, కరెంట్, రోడ్లు తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలని సిపిఎం నగర కార్యదర్శి రెడ్డి శంకరరావు డిమాండ్ చేశారు. మెంటాడ, పూసపాటిరేగ, కొత్తవలస, వేపాడ మండలాల్లో సిపిఎం నాయకులు పర్యటించి స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో ప్రజా చైతన్య యాత్ర కొనసాగింది. తిరుపతి జిల్లా తొట్టంబేడు మండలం బోనుపల్లి, కంచనపల్లి, చిట్టత్తూరు గ్రామాల్లోని దళితవాడల్లో మురుగునీటి వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని శ్రీకాళహస్తి ప్రాంతీయ కార్యదర్శి గంధం మణి తెలిపారు. బోనుపల్లి దళితులకు శ్మశానానికి దారి లేదన్నారు.

నాయుడుపేటలో గిరిజనులు ఇప్పటికీ గుడిసెల్లోనే కాపురం ఉంటున్నారని తెలిపారు. పేదలకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏలూరు జిల్లా దెందులూరు మండలంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి ఆధ్వర్యంలో సిపిఎం నేతలు పర్యటించారు. పోతునూరులో ఆటో కార్మికులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. దోసపాడు దళితులు తమ భూమి, గ్రామ సమస్యలను వివరించారు. చింతలపూడి పట్టణంలో నిర్మాణంలో ఉన్న వంద పడకల ఆసుపత్రిని నాయకులు సందర్శించారు. పశ్చిమగోదావరి జిల్లా ఉండి, కాళ్ల మండలాల్లో సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ పర్యటించి మాట్లాడారు. పేదోడిపై ప్రతాపం.. పెద్దోళ్లపై ప్రేమ కురిపిస్తున్న ఉండి డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజుకు పారిశ్రామికవేత్త రంగరాజు ఆక్రమణలు కనపడట్లేదా? అని ప్రశ్నించారు. ప్రకాశం, నెల్లూరులో జిల్లాల్లో చైతన్య యాత్రలు కొనసాగాయి.


మహిళ వేషధారణతో పూజలు చేసేందుకు వెళ్తున్న పురుషుడు

మగువల్లా.. మగాళ్లు

- హోలీ రోజున సంతేకుడ్లూరులో వింత ఆచారం
- రతీమన్మథులకు మహిళ వేషధారణతో పూజలు

ప్రజాశక్తి - ఆదోని రూరల్, చింతపల్లి

హోలీ పండుగ సందర్భంగా కర్నూలు జిల్లా ఆదోని మండలంలో ఆంధ్రప్రదేశ్, కర్ణాటక సరిహద్దులో ఉండే సంతేకుడ్లూరు గ్రామంలో హోలీ పండగ రోజున వింత ఆచారం కొనసాగుతోంది. గ్రామంలో కొలువుదీరిన రతీమన్మథులకు కొందరు పురుషులు మహిళల వేషధారణతో పూజలు చేశారు. విచిత్ర ఆచారాన్ని తిలకించేందుకు వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారు కూడా, ఇక్కడికి వచ్చిన తర్వాత మహిళల వేషధారణలో పూజలు చేశారు. పండుగ రెండు రోజులు పురుషులు మహిళల వేషధారణలో పూజలు చేశారు. గ్రామంలో ఎద్దుల సంత, కన్నడ నాటకం ప్రదర్శించారు. రతీమన్మథుల పూజల సందర్భంగా మొక్కులు తీర్చుకోవడంతోపాటు హాస్యాస్పద ప్రదర్శనలు, నవ్వించడం, సన్యాసి వేషం ధరించి శిష్య బృందంతో పాటలు పాడుతూ వీధివీధి తిరుగుతున్నారు. చిన్నారులు, యువకులు ఒకే రకమైన దుస్తులు ధరించి ప్రత్యేక ఆకర్షణతో చెక్క భజనలతో నృత్యాలు చేశారు.

60 అడుగుల హోలీ టవర్ దహనం

అల్లూరి జిల్లా చింతపల్లి మండలం తాజంగి గ్రామంలోని ఆదివాసీలు హోలీ రోజున 60 అడుగుల కర్రల టవర్‌ను పొడవుగా నిర్మించడం, దాన్ని దహనం చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఈ టవర్‌ను హోలీ టవర్ అని పిలుస్తారు. ఒడిశా నుంచి వలస వచ్చిన ఆదివాసీలు ఇలా సంప్రదాయబద్ధంగా హోలీని జరుపుకుంటారు. తొలుత వారంతా శ్రమించి 60 అడుగుల కర్రల టవర్ నిర్మాణం చేపట్టారు. గ్రామంలో కృష్ణుని ఆలయం వద్ద పూజా కార్యక్రమాలు నిర్వహించి, ఆచారం ప్రకారం జెండాను ఊరేగించి, అనంతరం బీటాలైన్ వీధిలో రాధాకృష్ణ ఆలయం వద్ద దహనం చేశారు. టవర్ చివరకు కట్టిన జెండాను పట్టుకున్న వ్యక్తికి గ్రామస్తులు నగదును అందజేసి, ఊరంతా ఊరేగించి సత్కరించారు.

రక్తమోడిన రహదారులు

- వేర్వేరు ప్రమాదాల్లో తొమ్మిది మంది దుర్మరణం
- మృతుల్లో దంపతులు

ప్రజాశక్తి - యంత్రాంగం

రాష్ట్రవ్యాప్తంగా జాతీయ రహదారులు రక్తమోడుతున్నాయి. శుక్రవారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో తొమ్మిది మంది దుర్మరణం చెందారు. వారిలో దంపతులు ఉన్నారు. పోలీసుల కథనం మేరకు.. అన్నమయ్య జిల్లా రాయచోటిలోని పెట్రోల్ బంకు వీధిలో నివాసముంటున్న సయ్యద్ హుస్సేన్ (27) గ్రానైట్ లారీతో బెంగళూరు నుంచి రాజమండ్రికి బయలుదేరారు. కర్ణాటక రాష్ట్రం ఆలేహల్లికి చెందిన భాస్కర్ (35) తన లారీలోని సోలార్ విడి పరికరాలను కడపలో అన్‌లోడ్ చేసి తిరిగి బెంగళూరుకు బయలుదేరారు. రెండు లారీలు కురబలకోట మండలం తానామిట్ట వద్ద ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్లు సయ్యద్ హుస్సేన్, భాస్కర్ ఇద్దరూ అక్కడికక్కడే మరణించారు.

నంద్యాల జిల్లా చాగలమర్రికి చెందిన దంపతులు చలమయ్య (58), లక్ష్మీదేవి (54) వైఎస్ఆర్ జిల్లా మైదుకూరులో నివాసం ఉంటున్నారు. కేశలింగాయపల్లెలోని పొలం పనులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై దంపతులిద్దరూ ఇంటికి పయనమయ్యారు. మార్గమధ్యంలో గొర్రెలు అడ్డురావడంతో ముందు వెళ్తున్న లారీ సడెన్‌గా బ్రేక్ వేసింది. లారీ వెనుక ద్విచక్ర వాహనంపై వస్తున్న వారు కూడా ఆగారు. అయితే వారి వెనుక వస్తున్న లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. రెండు లారీల నడుమ దంపతులిద్దరూ ఇరుక్కుపోయి అక్కడికక్కడే మరణించారు.



పశ్చిమగోదావరి జిల్లా కుంచనపల్లిలో ఆగి ఉన్న వాహనాన్ని ఢీ కొట్టిన కారు

పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం కుంచనపల్లి వద్ద జాతీయ రహదారి నిర్వహణా పనులు జరుగుతున్న నేపథ్యంలో వాహనాలు పక్క నుంచి వెళ్లాలని సూచిస్తూ నిలిపి ఉంచిన లారీని ఏలూరు వైపు నుంచి తణుకు వెళుతున్న కారు వేగంగా వచ్చి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో కారు నుజ్జునుజ్జయింది. కారులో చిక్కుకున్న వారిని అతికష్టం మీద బయటకు తీశారు. కారు నడుపుతున్న భోగిళ్ల వెంకట సత్య సురేన్ (37), ఆయన భార్య నవ్య (34) అక్కడికక్కడే మరణించారు. కుమార్తె భోగిళ్ల వాసవి కృష్ణ (5) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. మృతుల బంధువు ఉప్పులూరి శ్రీరమ్య తీవ్రగాయాలతో చికిత్స పొందుతున్నారు. ఓ పూజా కార్యక్రమం నిమిత్తం హైదరాబాద్ నుంచి తమ స్వస్థలం అంబేద్కర్ కోనసీమ జిల్లా మండపేట వస్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది.

పశ్చిమగోదావరి జిల్లా కాళ్ల మండలం జువ్వలపాలెం గ్రామానికి చెందిన కోట వరప్రసాద్ (50), చీపురుపల్లి శివకష్ణ (29) బొలెరో వాహనంలో చేప పిల్లల లోడ్‌తో చల్లపల్లి నుంచి బందరు వెళ్తున్నారు. అస్సాం నుంచి సరుగు బోదుల లోడుతో చీరాల వెళ్తున్న లారీ... మార్గమధ్యలో కృష్ణా జిల్లా ఘంటసాల మండల పరిధిలోని యందుకుదురు శివారు జీలగలగండి వద్ద లారీని బొలెరో వాహనం ఢీకొట్టింది. బొలెరో వాహనంలోని వరప్రసాద్, శివకృష్ణ అక్కడికక్కడే మతి చెందారు.

విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో కాంట్రాక్టు కార్మికుడు మృతి

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

విధి నిర్వహణలో ఉండగా వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌లో ఓ కాంట్రాక్టు కార్మికుడు శుక్రవారం మృతి చెందారు. పోలీసుల కథనం ప్రకారం.. విశాఖలో కొంతకాలంగా నివాసముంటున్న వి.సూర్య వెంకటరమణ (47) టిపిపి విభాగంలో కాంట్రాక్టు కార్మికునిగా పని చేస్తున్నారు. శుక్రవారం ట్రాక్టర్ నడుపుతూ విధులు నిర్వహిస్తుండగా అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో మృతి చెందినట్టు పోలీసులు చెబుతున్నారు. అది అకస్మాత్తుగా జరిగింది కాదని, సమయానికి చికిత్స అందించకపోవడం వల్లే మృతి చెందారని కుటుంబ సభ్యులు అంటున్నారు. సూర్య వెంకటరమణ మృతదేహాన్ని ప్లాంట్ లోపల నుంచి బయటకు తరలించే క్రమంలో కార్మికులు అడ్డుకున్నారు. ప్రధాన ద్వారం వద్ద ఆయన మృతదేహాన్ని ఉంచి ధర్నా నిర్వహించారు. తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. దీంతో కాసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. అనంతరం మృతదేహాన్ని కెజిహెచ్‌కు పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.


రథోత్సవంలో జనం

ఘనంగా మంగళగిరి లక్ష్మీనరసింహుని బ్రహ్మోత్సవాలు

- హాజరైన కేంద్ర, రాష్ట్ర మంత్రులు పెమ్మసాని, లోకేష్

ప్రజాశక్తి మంగళగిరి (గుంటూరు జిల్లా)

వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళగిరి శ్రీ లక్ష్మీ నరసింహస్వామివారి కల్యాణ మహోత్సవం, రథోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా స్వామి వారికి మంత్రి నారా లోకేష్, బ్రాహ్మణి దంపతులు పట్టు వస్త్రాలు సమర్పించారు. సాయంత్రం నిర్వహించిన రథోత్సవంలో కేంద్ర మంత్రి పెమ్మసాని, మంత్రి లోకేష్ పాల్గొన్నారు. భారీ సంఖ్యలో పాల్గొన్న యాత్రికులతో రథాన్ని లాగారు. పురవీధులు జనప్రవాహంతో కిక్కిరిసి పోయాయి. అంతకుముందు స్వామి వారి రథోత్సవంలో పాల్గొనేందుకు దేవాలయ ప్రాంగణానికి చేరుకున్న లోకేష్, పెమ్మసాని చంద్రశేఖర్‌కు ఆలయ అధికారులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గణపతినగర్‌లోని ఇందిరానగర్ అర్బన్ ప్రైమరీ ఆరోగ్య కేంద్రం వైద్యులు దేవాలయం వద్ద వైద్య శిబిరం నిర్వహించారు. పలు స్వచ్ఛంద సంస్థలు ఉచితంగా మజ్జిగ, పులిహోరా పంపిణీ చేశాయి.

11 మంది మావోయిస్టు మిలీషియా సభ్యుల లొంగుబాటు

ప్రజాశక్తి - పాడేరు టౌన్ (అల్లూరి జిల్లా)

అల్లూరి జిల్లా జికె.వీధి మండలం గాలికొండ ఏరియా కమిటీకి చెందిన 11 మంది మావోయిస్టు మిలీషియా సభ్యులు శుక్రవారం ఎస్‌పి అమిత్ బర్దర్ ఎదుట లొంగిపోయారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ లొంగిపోయిన వారంతా 2021లో పలు నేరాల్లో పాల్గొన్నారని తెలిపారు. లొంగిపోయినందున వారిపై ఏ కేసులూ లేకుండా ఎత్తివేస్తున్నట్లు చెప్పారు. లొంగిపోయిన వారిలో ఒక్కొక్కరిపై ఆరేడు కేసులు ఉన్నట్లు వెల్లడించారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో మారుమూల గ్రామాల్లో చేపడుతున్న అవగాహనా కార్యక్రమాలు, పోలీస్ శాఖ, రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న పలు సంక్షేమ కార్యక్రమాలను చూసి వారంతా ఆకర్షితులై స్వచ్ఛందంగా లొంగిపోయినట్లు తెలిపారు. ఈ సమావేశంలో అదనపు ఎస్‌పి కె.దిరాజ్ పాల్గొన్నారు.

తణుకులో నేడు సిఎం పర్యటన

ప్రజాశక్తి - తణుకు

స్వర్ణాంధ్ర..స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం పశ్చిమగోదావరి జిల్లా తణుకులో సిఎం చంద్రబాబు నాయుడు పర్యటించనున్నారు. ఉదయం 7.30 గంటలకు ఉండవల్లిలోని తన నివాసం నుంచి హెలికాప్టర్‌లో బయల్దేరి 8.05 గంటలకు తణుకు పాలిటెక్నిక్ కాలేజీలోని హెలీప్యాడ్ వద్దకు చేరుకుంటారు. స్వాగత కార్యక్రమం తర్వాత 8.35 గంటలకు రోడ్డుమార్గం గుండా బయలుదేరి 8.40 గంటలకు ఎన్‌టిఆర్ పార్క్‌కు వస్తారు. 9.10 గంటల వరకూ పారిశుధ్య కార్మికులతో మాట్లాడతారు. తర్వాత జడ్‌పి బాలుర హైస్కూల్‌కు చేరుకుని 9.15 నుంచి 10.15 గంటల వరకూ ప్రజావేదిక పేరిట స్థానిక ప్రజలతో మాట్లాడతారు. 10.20 నుంచి 11.20 వరకూ పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులతో సమావేశమవుతారు. 11.20 నుంచి 11.50 వరకూ జిల్లా అధికారులతో సమావేశం నిర్వహిస్తారు. అనంతరం హెలికాప్టర్‌లో బయలుదేరి 12.45 గంటలకు ఉండవల్లిలోని తన నివాసానికి చేరుకుంటారు.


సభలో మాట్లడుతున మంత్రి లోకేష్

మొరపెడుతున్నా పట్టించుకోరా..

- ఏళ్ల తరబడి నిలిచిన టిఎ, డిఎ బకాయిలు
- ఈవెంట్ బిల్లులకు కలగని మోక్షం
- అంగన్‌వాడీల అవస్థలు పట్టని సర్కారు


అంగన్‌వాడీ కేంద్రంలో సామూహిక సీమంతాలు చేస్తున్న అంగన్‌వాడీలు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ అంగన్‌వాడీ టీచర్లకు కష్టతరంగా మారింది. ఆరేళ్లుగా టిఎ, డిఎ బకాయిలు, ఏడాది కాలంగా పిల్లలకు అన్నప్రాసన, గర్భిణులకు సీమాంతాల ఈవెంట్ బిల్లులు నిలిచిపోయాయి. మరోవైపు ఇస్తున్న అరకొర వేతనాలు సమయానికి అందడంలేదు. ప్రభుత్వానికి పలుమార్లు విన్నవిస్తున్నా పట్టించుకోవడం లేదంటూ అంగన్‌వాడీలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో 54,922 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిల్లో 48,204 మంది వర్లర్లు, 47,371 మంది హెల్పర్లు పని చేస్తున్నారు. మరో 6,718 మినీ సెంటర్లున్నాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 5,546 వరకు అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటిల్లో సుమారు ఐదు వేల మందికిపైగా అంగ్‌వాడీ టీచర్లు, 4,818 మంది ఆయాలు పని చేస్తున్నారు.

ప్రాజెక్టు, సెక్టార్ల సమావేశాలు ప్రతి నెలా రెండుసార్లు జరుగుతున్నాయి. వీటికి అంగన్‌వాడీలు సొంత డబ్బులతో వెళ్తున్నారు. నెలకు ఒక్కొక్కరికి రూ.300 వరకూ రెండు టిఎ, డిఎలు ఇవ్వాల్సి ఉంది. 2017 నుంచి టిఎ, డిఎ బిల్లులు ఇవ్వలేదు. నెలకు ఒక్కొక్కరికి సుమారు రూ.600 చొప్పున ఏడాదికి ఒక్కొక్కరికి రూ.7,200 ఇవ్వాల్సి ఉంది. ఆరేళ్లకు సంబంధించి ఒక్కొక్కరికి రూ.43 వేల వరకూ ప్రభుత్వం బకాయి పడింది. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు రూ.400 కోట్లకుపైగా బకాయిలు అంగన్‌వాడీలకు ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది. దీనిపై పలుమార్లు వినతి పత్రాలు ఇచ్చినా ప్రభుత్వం వద్ద బడ్జెట్ లేదని అధికారులు చెప్పుకొస్తున్నారని వర్కర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీటిని చెల్లించకుండా ఎగవేత ధోరణితో ప్రభుత్వం వ్యవహరిస్తోందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పలు సమస్యల పరిష్కారానికి అంగన్‌వాడీలు సమ్మె చేయగా 2023 డిసెంబర్ 20న టిఎ, డిఎ బిల్లులు విడుదల చేస్తామని అప్పటి వైసిపి ప్రభుత్వం జిఒ ఇచ్చింది. 14 నెలలు దాటినా జిఒ మాత్రం అమలు కాలేదు.

ఈవెంట్ బిల్లులు అందేనా..?

ప్రతి నెలా పిల్లలకు అన్నప్రాసన, గర్భిణులకు సీమంతం ఈవెంట్లు బిల్లులు రెండేళ్లగా పెండింగ్‌లో ఉండగా ఇటీవల ఏడాది కాలానికి విడుదల చేశారు. ప్రతి నెలా ఒక్కొక్కరికి రూ.500 ఇవ్వాల్సి ఉంది. మరో ఏడాదికి సంబంధించిన బిల్లుల విషయమై ప్రభుత్వం నోరు మెదపడంలేదు.

ఫేస్ యాప్‌తో అష్టకష్టాలు

గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించాలంటే ప్రభుత్వం ఫేస్ యాప్‌ను తప్పనిసరి చేసింది. లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి ఫొటోలు తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలి.

గతంలో గర్భిణులు, బాలింతలకు మాత్రమే ఫేస్ యాప్ ద్వారా పౌష్టికాహారం అందించేవారు. కొంతకాలంగా ఆరు నెలల నుంచి మూడు సంవత్సరాల పిల్లలకు సైతం ప్రతి నెలా ఫేస్ యాప్ ద్వారా అందించాలని అధికారులు ఒత్తిడి చేస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఫోన్లు నాసిరకం కావడంతో తరచూ సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. ఇంటర్నెట్ సౌకర్యం లేని ప్రాంతాల్లో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఫేస్ యాప్‌లో నమోదు చేసేందుకు లబ్ధిదారులు ఒటిపి చెప్పాల్సి ఉంటుంది. వివిధ సాంకేతిక సమస్యల వలన ఒటిపి సమయానికి రాకపోవడంతో వారికి పౌష్టికాహారం అందించలేని పరిస్థితి ఏర్పడుతోంది. క్షేత్రస్థాయిలో సమస్యలు పరిష్కరించకుండా తమపై ఒత్తిడి తీసుకురావడం సరికాదంటూ ఆవేదన వెలిబుచ్చుతున్నారు.

పెండింగ్ బిల్లులు తక్షణమే విడుదల చేయాలి



అంగన్‌వాడీ వ్యవస్థపై ప్రభుత్వం చిన్నచూపు చూస్తోంది. ఏళ్ల తరబడి టిఎ, డిఎ బిల్లులు విడుదల చేయకపోవడం బాధాకరం. ఈవెంట్ బిల్లులు ఎప్పటికప్పుడు ఇవ్వాల్సి ఉన్నా విడుదల చేయడం లేదు. అంగన్ వాడీలు అప్పులు చేసి ఎంతకాలం పెట్టుబడులు పెడ తారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి పెండింగ్ బిల్లులు విడుదల చేయకపోతే ఆందోళన ఉధృతం చేస్తాం.

- జి.బేబీరాణి, ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు

ఎలా బతకాలి



ప్రభుత్వం న్యాయంగా తమకు ఇవ్వాల్సిన పెండింగ్ బకాయిల విషయంలో తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తోంది. వేతనాలు కూడా సకాలంలో అందడంలేదు. ఒక్కొక్కసారి రెండు నుంచి మూడు నెలలు పెండింగ్‌లో ఉంచుతున్నారు. కనీస వేతనాలు అమలు కావడం లేదు. సమయానికి ఇవ్వకపోతే ఎలా బతకాలి. ఇప్పటికైనా ప్రభుత్వ స్పందించాలి.

- ఇ.చంద్రావతి, ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, కాకినాడ జిల్లా కార్యదర్శి

మొదటివిడతగా ఐదు వేల మందికి ఇళ్ల పట్టాలు

- ఎర్రబాలెంలో గోశాలను ప్రారంభించిన లోకేష్, పెమ్మసాని

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్ (గుంటూరు జిల్లా)

గుంటూరు జిల్లా మంగళగిరి నియోజకవర్గంలో ప్రభుత్వ, కొండ పోరంబోకు, చెరువు, రైల్వే భూముల్లో దశాబ్దాలుగా నివాసముంటున్న వారికి మొదటి విడతలో ఉగాది తరువాత ఐదు వేల మందికి ఇళ్లపట్టాలు ఇస్తామని విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ తెలిపారు. నియోజకవర్గంలో పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రారంభించామని, వంద అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని అన్నారు. మంగళగిరి మండలం యర్రబాలెం గ్రామంలో ఆధునీకరించిన శ్రీ భగవాన్ మహావీర్ గోశాలను, నూతన సముదాయాలను శుక్రవారం మంత్రి నారా లోకేష్, కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ప్రారంభించారు. శ్రీ భగవాన్ మహవీర్ విగ్రహ ప్రతిష్ట, గోపాలమూర్తి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లోకేష్ మీడియాతో మాట్లాడుతూ జైన్ సోదరులు యర్రబాలెం గ్రామంలో 25 ఏళ్లుగా నిర్వహిస్తున్న గోశాలలో ప్రసుత్తం 450 ఆవులు ఉన్నాయన్నారు. గోశాల నిర్వహకులకు అండగా తాను ఉంటానని తెలిపారు. మొదటి విడతలో ఐదు వేల మందికి, రెండు, మూడు విడతల్లో మిగిలిన వారికి ఇళ్ల పట్టాలు ఇస్తామన్నారు. కాలువలు, అటవీ భూముల్లో ఇళ్ల పట్టాలకు కొంత సమయం పడుతుందని దీనికి కేంద్రమంత్రి పెమ్మసాని సహకారంతో రైల్వే మంత్రిని కలిశామని, ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. మంగళగిరిలో ట్రాఫిక్ సమస్య 12 నెలల్లో పరిష్కరిస్తామని, నియోజకవర్గంలో తమ ప్రభుత్వం వంద అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిందన్నారు. కేంద్ర మంత్రి పెమ్మసాని మాట్లాడుతూ దుగ్గిరాల కోల్డ్‌సోరేజ్‌లో అగ్నిప్రమాద బాధిత రైతులకు రెండువారాల్లో నష్టపరిహారం అందజేస్తామన్నారు. అనంతరం లోకేష్‌ను, పెమ్మసానిని నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.

ప్రభుత్వానిదే బాధ్యత

- కాశినాయన ఆశ్రమ ధ్వంసంపై మల్లాది విష్ణు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కాశీనాయన క్షేత్రం ధ్వంసానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ మల్లాది విష్ణు అన్నారు. శుక్రవారం తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 'అటవీశాఖ ఆధ్వర్యాన ధ్వంసం చేస్తే మంత్రి పవన్ కల్యాణ్ మౌనంగా ఉండటం ఏమిటి? సనాతన ధర్మం గురించి మాట్లాడే పవన్ ఇప్పుడు నోరెత్తకపోవడం ఏమిటి? ఆయనకు తెలియకుండానే ఇది జరిగిందా?' అని ప్రశ్నించారు. పది రోజులు సంబంధిత మంత్రి స్పందించలేదని, ఇప్పుడు సంబంధం లేని లోకేష్ క్షమాపణ చెప్పడం ఎందుకో చెప్పాలని అన్నారు. నల్లమల అటవీ ప్రాంతంలో పెద్దసంఖ్యలో యాత్రికులు వస్తున్న ఈ క్షేత్రాన్ని ధ్వంసం చేస్తుంటే పవన్ కల్యాణ్ మాట్లాడకపోవడం అన్యాయమని తెలిపారు.

కూటమి పాలనలో విద్యావ్యవస్థ నిర్వీర్యం

- మాజీ మంత్రి మేరుగ నాగార్జున

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కూటమి పాలనలో విద్యావ్యవస్థ నిర్వీర్యమైందని, మంత్రి లోకేష్ అసమర్థ పాలన చేస్తున్నారని మాజీ మంత్రి, వైసిపి నాయకులు మేరుగ నాగార్జున అన్నారు. శుక్రవారం తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. వైఎస్ జగన్ తీసుకువచ్చిన సంస్కరణలకు తూట్లు పొడుస్తున్నారని అన్నారు. ప్రభుత్వ రంగంలో విద్యా ప్రమాణాలకు తిలోదకాలు ఇచ్చారని, యూనివర్శిటీలను రాజకీయం చేస్తున్నారని చెప్పారు. విసిలను బెదిరించి రాజీనామా చేయించడం సిగ్గుచేటని పేర్కొన్నారు. తల్లికి వందనం, ఫీజు రీయింబర్స్‌మెంట్‌లకు అరకొరగా నిధులు ఇచ్చారని చెప్పారు. పేద, మధ్య తరగతి విద్యార్థుల జీవితాలతో కూటమి ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని వివరించారు. వైసిపి హయాంలో ప్రవేశపెట్టిన ఇంగ్లీషు మీడియం, ఐబి, సిబిఎస్ఇ సిలబస్, బైలింగ్వల్ టెక్స్‌బుక్, డిజిటల్ క్లాస్‌రూముల విధానం, టోఫెల్ శిక్షణ, ట్యాబ్‌ల పంపిణీ, సబ్జెక్టు టీచర్ కాన్సెప్ట్ అన్నిటికీ మంగళం పాడారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు ఉన్న ప్రతిసారీ విద్యావ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నారని అన్నారు.


కాశినాయన క్షేత్రంలో కూల్చివేతలను పరిశీలిస్తున్న నాయకులు

కూల్చిన కట్టడాలను ప్రభుత్వమే పునఃనిర్మించాలి

- కాశినాయన ఆశ్రమ అభివృద్ధికి శాశ్వత రక్షణ
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రాంభూపాల్ డిమాండ్

ప్రజాశక్తి-కాశినాయన

వైఎస్‌ఆర్ జిల్లా కాశినాయన జ్యోతి క్షేత్రంలో కూల్చి వేసిన కట్టడాలను ప్రభుత్వమే నిర్మించాలని సిపిఎం డిమాండ్ చేసింది. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్, వైఎస్ఆర్ జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్, కార్యదర్శి వర్గ సభ్యులు వి.అన్వేష్, జిల్లా కమిటీ సభ్యులు కె.శ్రీనివాసరెడ్డిలతో కూడిన బృందం శుక్రవారం కాశినాయన క్షేత్రంలో పర్యటించింది.

కూల్చివేసిన కట్టడాలను పరిశీలించి, ఆశ్రమ పెద్దలతో మాట్లాడారు. ఈ సందర్భంగా రాంభూపాల్ మాట్లాడుతూ.. గత డిసెంబర్‌లో టిడిపి కూటమి ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలతోనే సత్రాలు కూల్చివేశారని ఆశ్రమ పెద్దలు చెబుతున్నారని, ప్రభుత్వ ఉత్తర్వులతో కూల్చిన కట్టడాలను మంత్రి లోకేష్ తన డబ్బులతో నిర్మిస్తున్నట్లు ప్రచారం చేయడం అభ్యంతరకరమన్నారు. ప్రభుత్వమే కట్టడాలను పునఃనిర్మించి శాశ్వత రక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 12 సంవత్సరాలుగా నిలిపివేసిన గర్భగుడి పనుల ప్రారంభానికి అనుమతులు ఇవ్వాలని కోరారు. వందలాది ఒంటరి మహిళలు ఈ ఆశ్రమంలో ఆశ్రయం పొందుతున్నారని, ఇలాంటి సేవా కార్యక్రమాలను ప్రోత్సహించాల్సిన ప్రభుత్వం ఇలాంటి చర్యలకు పాల్పడడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంతటి దుర్మార్గంపై స్వయం ప్రకటిత హిందూ మత రక్షకుడు పవన్ కల్యాణ్ వారం రోజులుగా స్పందించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. కార్యక్రమంలో పోరుమామిళ్ళ, బ్రహ్మంగారిమఠం సిపిఎం మండల కార్యదర్శులు ఎన్.భైరవ ప్రసాద్, సునీల్ కుమార్ పాల్గొన్నారు.

50 రోజుల్లో టిడిఆర్ బాండ్ల జారీ

- ఆన్‌లైన్లోనే దరఖాస్తు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పట్టణ ప్రాంతాల్లో ఆస్తులకు సంబంధించి జారీచేసే ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్ (టిడిఆర్) బాండ్లను వీలైనంత త్వరగా జారీచేయాలని పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్ ఆదేశాలు జారీ చేశారు. బాండ్లకు సంబంధించిన దరఖాస్తులను నేరుగా తీసుకోవద్దని, ఆన్‌లైన్ పద్ధతిలోనే ఇవ్వాలని పేర్కొన్నారు. బాండ్ల జారీకి సంబంధించి నూతన విధివిధానాలకు సంబంధించిన ప్రక్రియపై ఆదేశాలు జారీచేశారు. దరఖాస్తు వెరిఫికేషన్‌కు 15 రోజులు, అభ్యంతరాలు, ఇతరాలను 15 రోజుల్లో పూర్తి చేయాలని అందులో పేర్కొన్నారు. బాండ్ల జారీకి సంబంధించి నాలుగు రోజుల్లో పేపరు ప్రకటన ఇవ్వాలని, ఏడు రోజుల్లో అభ్యంతరాలు స్వీకరించాలని సూచించారు. ఏడురోజుల పరిశీలన అనంతరం మరో ఆరు రోజుల్లోపు రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసిన అనంతరం వారం రోజుల్లో టిడిఆర్ బాండు జారీ చేయాలని, మొత్తం 50 రోజుల్లో ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలో అన్ని మున్సిపాలిటీలు, నగర పాలక సంస్థలు ఈ నిబంధనలు పాటించాలని అందులో సూచించారు.

మెట్రో నిర్వహణలోకి రైల్ వికాస్ నిగమ్..!

- అంతర్జాతీయ భాగస్వాములతో జట్టు
- బెంగళూరు మెట్రోపై దృష్టి



న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగంలోని రైల్ వికాస్ నిగమ్ లిమిటెడ్ (ఆర్‌విఎన్ఎల్) మెట్రో నిర్వహణ రంగంలోకి ప్రవేశించడానికి కసరత్తు చేస్తోంది. అంతర్జాతీయ భాగస్వాములతో జట్టు కట్టడం ద్వారా మెట్రో కార్యకలాపాలు, నిర్వహణ వ్యాపారాన్ని చేపట్టాలని యోచిస్తోన్నట్లు ఆర్‌విఎన్ఎల్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ (సిఎండి) ప్రదీప్ గౌర్ తెలిపారు. బెంగుళూరు మెట్రో ఆపరేషన్స్ అండ్ మెయింటనెన్స్ (ఒఅండ్ఎం) కాంట్రాక్టులను చేపట్టేందుకు జర్మనీకి చెందిన డ్యుయిష్ బాన్ (డిబి)తో చర్చలు జరుపుతున్నామని గౌర్ ఇటికి ఇచ్చిన ఇంటర్యూలో వెల్లడించారు.

భారత్‌లో మెట్రో ప్రాజెక్టుల కోసం ఒఅండ్ఎం చేపట్టేందుకు డిబి తమ కంపెనీని సంప్రదించిందన్నారు. బెంగళూరు మెట్రో కోసం ఈ భాగస్వామ్యాన్ని అంచనా వేస్తున్నామని చెప్పారు. అదే విధంగా చెన్నయ్ మెట్రో ప్రాజెక్టు కోసం ఒఅండ్ఎం హక్కులను పొందేందుకు ఆసక్తి చూపుతున్నామన్నారు. ఢిల్లీ-మీరట్ ప్రాంతీయ ర్యాపిడ్ రైల్ ప్రాజెక్ట్ కోసం జర్మన్ కంపెనీ ఇప్పటికే 12 సంవత్సరాల ఒఅండ్ఎం కాంట్రాక్టును కలిగి ఉందన్నారు.

"మేము ఇప్పటికే ఢిల్లీలో నమోభారత్ కారిడార్‌ను నిర్వహిస్తున్నాము. దేశంలో మరిన్ని ఒఅండ్ఎం ప్రాజెక్టులు లేదా భాగస్వామ్యాల కోసం చర్చలు జరుపుతున్నాము. మెట్రో రైలు మౌలిక సదుపాయాల అభివృద్ధి ప్రాజెక్టులలో ఆర్‌విఎన్ఎల్ పాల్గొంటుంది." అని గౌర్ తెలిపారు. చెన్నయ్, ఇండోర్, అహ్మదాబాద్, సూరత్, నాగ్‌పూర్, పుణెలలో మెట్రో ప్రాజెక్టులను చేపట్టనున్నామన్నారు. బంగ్లాదేశ్, నేపాల్, శ్రీలంక, యుఎఇ, టర్కీ, పెరూ దేశాల్లోనూ తమ కార్యకలాపాలను విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. తమ మొత్తం రూ.1 లక్ష కోట్ల ఆర్డర్ బుక్‌లో విదేశీ పోర్టుపోలియో వ్యాపారం 5 శాతం వాటాను కలిగి ఉందన్నారు. వీటిని మొత్తం ఆర్డర్‌లో 50 శాతానికి చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. తాము రైల్వేయేతర ప్రాజెక్టులలో ట్రాన్స్‌మిషన్ లైన్లు, సోలార్ ప్రాజెక్ట్‌లు, జాతీయ రహదారులను కూడా కలిగి ఉన్నామన్నారు.

అనురాగ్ యూనివర్శిటీ బ్రాండ్ అంబాసిడర్‌గా విజయ్ దేవరకొండ



ప్రజాశక్తి - హైదరాబాద్ : ప్రయివేటు విద్యా సంస్థ అనురాగ్ యూనివర్శిటీ తన బ్రాండ్ అంబాసీడర్‌గా నటుడు విజయ్ దేవరకొండను నియమించుకున్నట్లు ప్రకటించింది. నగరంలోని వెంకటాపూర్ క్యాంపస్‌లో గురువారం రాత్రి ఆ సంస్థ 'సినర్జీ 2కె25' వార్షికోత్సవాన్ని నిర్వహించింది. దీనికి ముఖ్య అతిథిగా విజయ్ దేవరకొండ హాజరై సందడి చేశారు. యూనివర్శిటీ పనితీరు, విజయాలు తనను ఎంతగానో ఆకట్టుకున్నాయని విజయ్ పేర్కొన్నారు. కాబట్టి తాను ఈ యూనివర్శిటీకి బ్రాండ్అంబాసీడర్‌గా ఉండాలని నిర్ణయించుకున్నానన్నారు.

ఇండస్‌ఇండ్ బ్యాంక్‌లో హెచ్‌డిఎఫ్‌సి ఎంఎఫ్ వాటా పెంపు


న్యూఢిల్లీ : ఇండస్ ఇండ్ బ్యాంక్ స్టాక్ తీవ్ర అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొంటున్న వేళ మరోవైపు హెచ్‌డిఎఫ్‌సి మ్యూచువల్ ఫండ్ సంస్థ ఆ స్టాక్‌లో వాటాలను పెంచుకుంది. 2025 మార్చి 11న మార్కెట్ ముగిసే సమయానికి ఇండస్ ఇండ్ బ్యాంక్‌లో హెచ్‌డిఎఫ్‌సి ఎంఎఫ్ పథకాల మొత్తం హోల్డింగ్‌లు 5.02 శాతంగా ఉన్నాయని బ్యాంకు పేర్కొంది. మార్చి 11కు ముందు ఈ వాటా 4.82 శాతంగా ఉంది. ఇది 3,75,29,368 షేర్లకు సమానం. మార్చి 11న ఓపెన్ మార్కెట్ లావాదేవీ ద్వారా 15,92,410 షేర్లు లేదా 0.20 శాతం అదనపు వాటాను కొనుగోలు చేసింది. దీంతో మొత్తం షేర్ల సంఖ్య 3,91,21,778 లేదా 5.02 శాతం వాటాకు పెరిగింది.

వడ్డీ రేట్లు తగ్గొచ్చు : ఎస్‌బిఐ రీసెర్చ్

ముంబయి : రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) తదుపరి ద్రవ్య పరపతి విధాన సమీక్షల్లో వడ్డీ రేట్లను తగ్గించొచ్చని ఎస్‌బిఐ రీసెర్చ్ ఎకోరాప్ తాజా రిపోర్ట్‌లో అంచనా వేసింది. ఈ ఏడాది ఏప్రిల్, జూన్, అక్టోబర్ నెలల్లో జరిగే విధాన సమీక్షల్లో రెపోరేటును 25 బేసిస్ పాయింట్ల చొప్పున మొత్తం 75 బేసిస్ పాయింట్లు తగ్గించే అవకాశాలున్నాయని విశ్లేషించింది. దాదాపు ఐదేళ్ల తర్వాత ఇటీవల ఆర్‌బిఐ నూతన గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టిన సంజయ్ మల్హోత్రా ఆర్బీఐ గవర్నర్ ఫిబ్రవరి సమీక్షలో వడ్డీ రేట్లను పావు శాతం తగ్గించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో వచ్చే ఏప్రిల్, జూన్ ద్రవ్యసమీక్షల్లోనూ వడ్డీరేట్లు 25 బేసిస్ పాయింట్ల చొప్పున తగ్గవచ్చని, ఆగస్టులో విరామం ఇచ్చి అక్టోబర్ సమీక్షలో మళ్లీ 25 బేసిస్ పాయింట్లు తగ్గించవచ్చని ఎస్‌బిఐ రిసెర్చ్ అంచనా వేసింది.

బీమాపై జిఎస్‌టి తగ్గింపునకు కసరత్తు..!

న్యూఢిల్లీ : బీమా ప్రీమియం వసూళ్లపై విధిస్తున్న వస్తు సేవల పన్ను (జిఎస్‌టి)ను తగ్గించే విషయమై కేంద్ర ప్రభుత్వం తాజాగా బీమా నియంత్రణ మండలి ఐఆర్‌డిఎఐ నుంచి సూచనలు కోరిందని తెలుస్తోంది. ఐఆర్‌డిఎఐ సూచనలను పరిగణలోకి తీసుకుని వచ్చే జిఎస్‌టి కౌన్సిల్ సమావేశంలో రేట్లను సమీక్షించే అవకాశాలున్నాయని సమాచారం. ప్రస్తుతం వైద్య, జీవిత బీమా ప్రీమియంలపై 18 శాతం జిఎస్‌టి అమల్లో ఉంది. అధిక పన్ను రేట్లు వైద్య, జీవిత బీమాకు పాలసీదారులను దూరం చేస్తోందనే విమర్శలు తీవ్రంగా ఉన్నాయి ప్రీమియం వసూళ్లపై జిఎస్‌టిని సున్నా లేదా 5 శాతం లేదా 12 శాతానికి తగ్గించే అవకాశాలున్నాయనే అంచనాలు ఉన్నాయి.



పెరిగిన విదేశీ మారకం నిల్వలు

న్యూఢిల్లీ : భారత విదేశీ మారకం నిల్వల్లో పెరుగుదల నమోదయ్యింది. మార్చి7తో ముగిసిన వారంలో విదేశీ మారక నిల్వలు 15.25 బిలియన్ డాలర్లు పెరిగి 653.97 బిలియన్ డాలర్లకు చేరాయని ఆర్‌బిఐ శుక్రవారం వెల్లడించింది. అంతకుముందు ఫిబ్రవరి 28తో ముగిసిన వారంలో 1.7 బిలియన్ డాలర్లు తగ్గి 638.69 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. ఇంతక్రితం కొన్ని వారాల పాటు భారీగా ఫారెక్స్ నిధులు పడిపోయాయి. గతేడాది సెప్టెంబర్ చివరినాటికి విదేశీ మారక నిల్వలు రికార్డ్ స్థాయిలో 704.88 బిలియన్ డాలర్ల గరిష్ట స్థాయికి పెరిగాయి. అంతర్జాతీయ పరిణామాలకు తోడు దేశీయంగా భారత మార్కెట్లు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కోవడం, ఎఫ్ఐఐలు తరలిపోవడంతో ఇటీవలి కాలంలో భారీగా పతనమయ్యాయి.

సంపాదకీయం

అదానీ అవినీతికి జై

సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సెకీ)–అదానీతో గత వైసిపి ప్రభుత్వం కుదుర్చుకున్న పవర్ సప్లయి అగ్రిమెంట్‌ను కొనసాగించేందుకే టిడిపి కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఒప్పందంపై ఇంత కాలం దోబూచులాడగా గురువారం ఇంధనరంగంపై అసెంబ్లీలో చర్చ సందర్భంగా స్వయాన ముఖ్యమంత్రి చంద్రబాబు ఆ ఒప్పందానికి జైకొట్టడంతో జగన్ ప్రభుత్వ అవినీతికి మద్దతిచ్చినట్లయింది. సెకీ ద్వారా అదానీ సంస్థల నుంచి 7 వేల మెగావాట్ల విద్యుత్ కొనుగోలు ఒప్పందాన్ని గత వైసిపి ప్రభుత్వం కుదుర్చుకోగా, అందుకోసం అదానీ అప్పటి రాష్ట్ర ప్రభుత్వంలోని ముఖ్య వ్యక్తులకు రూ.1,750 కోట్ల లంచం ఇచ్చారని అమెరికా కోర్టుల్లో ఆధారాలతో సహా విచారణ జరుగుతోంది. సెకీ ఒప్పందం వలన రాష్ట్ర ప్రజలపై ఛార్జీల రూపంలో రూ.1.10 లక్షల కోట్ల అదనపు భారం పడుతుంది. ఆ అగ్రిమెంట్ రాష్ట్రానికి, ఇంధన రంగానికి దెబ్బ. అమెరికాలో కేసుల విషయం బయటికి వచ్చిన మరుక్షణం ఒప్పందం కొనసాగింపుపై చర్చ మొదలైంది. జగన్ అవినీతిని తూలనాడుతూ వచ్చిన టిడిపి కూటమి, సదరు అవినీతి అగ్రిమెంట్ రద్దుపై మాత్రం నాన్చుతూ వచ్చింది. ఇప్పుడు ముఖ్యమంత్రి స్పష్టత ఇచ్చారు. ఒకసారి సంతకాలు పెట్టాక వెనక్కి రావడం కుదరదు, అలా వస్తే పెనాల్టీలు చెల్లించాలి, విశ్వసనీయత దెబ్బతింటుంది అని చంద్రబాబు చెప్పినవి సాకులు మాత్రమే. శ్రీలంక, బంగ్లాదేశ్ వంటి దేశాలు అదానీతో చేసుకున్న ఒప్పందాలు రద్దు చేసుకోగా ఇక్కడే కుదరదనడం వాస్తవ విరుద్ధం. రద్దు చేసుకోడానికి అవకాశం ఉందని కేంద్ర మాజీ ఇంధన కార్యదర్శితో సహా నిపుణులు అగ్రిమెంట్‌లోని క్లాజులను ఉటంకిస్తున్నా ఆ సూచనలను కావాలనే విస్మరించారని అర్థమవుతుంది.

నాడు వైసిపి ప్రభుత్వం సెకీ–అదానీతో చేసుకున్న ఒప్పందం వెనుక కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ ఒత్తిడి ఉందన్నది బహిరంగ రహస్యం. అదానీపై ఎన్ని ఆర్థిక ఆరోపణలొచ్చినా మోడీ ప్రభుత్వం చిన్నపాటి విచారణ సైతం లేకుండా వెనకేసుకొచ్చింది. అంతర్జాతీయంగా అదానీపై లంచాల ఆరోపణల కేసు బయట పడినా మోడీ, ఆయన ప్రభుత్వం ఒక్క మాట మాట్లాడలేదంటే అదానీ–బిజెపి మధ్య బంధాన్ని అంచనా వేయొచ్చు. అందుకే సెకీ–అదానీతో జగన్ చేసుకున్న అవినీతికర ఒప్పందాన్ని బిజెపి ఒత్తిడితో కూటమి సర్కారు కొనసాగిస్తోందని తెలుస్తుంది. సెకీ ఒప్పందంపై ప్రతిపక్షంలో ఉండగా పయ్యావుల కేశవ్ హైకోర్టులో కేసు వేశారు. ప్రస్తుతం ఆయన ఆర్థిక మంత్రి. ప్రభుత్వం ఒప్పందాన్ని కొనసాగించేపక్షంలో పిటిషనర్‌గా ఉన్న పయ్యావుల ఏం చేస్తారు? కేసును ఉపసంహరించుకుంటారా లేదంటే ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా అగ్రిమెంట్ రద్దు కోరతారా? వైసిపి అవినీతిని సహించబోమని ప్రతి రోజూ చంద్రబాబు, జనసేనాని పవన్ కల్యాణ్ రంకెలు వేస్తారు. వైసిపి అవినీతిని కూకటివేళ్లతో పెకిలిస్తామని లోకేష్ ఘీంకరిస్తారు. తీరా అవినీతికర సెకీ–అదానీ ఒప్పందం విషయంలో జగన్ అవినీతిని రక్షిస్తారు. అదానీకి మేలు చేసే విషయంలో బిజెపి, టిడిపి, జనసేన, వైసిపిలది ఒకటే దారి.

విద్యుత్ ఒప్పందాల్లో అదానీ అవినీతిపై అంతర్జాతీయంగా చర్చ సాగుతున్న సమయంలోనే ప్రధాని మోడీ అమెరికాలో పర్యటించి కొత్తగా ఆ దేశానికి అధ్యక్షునిగా ఎన్నికైన డోనాల్డ్ ట్రంప్‌ను ఆలింగనం చేసుకున్నారు. లంచాల కేసులో అడ్డంగా దొరికి అమెరికాలో విచారణ ఎదుర్కొంటున్న అదానీని ఎలాగొలా బయట పడేయడానికి ట్రంప్‌తో మోడీ రహస్య ఒప్పందం చేసుకున్నారంటూ లోకం కోడై కూసింది. ఈ ప్రచారంపై అటు కేంద్ర ప్రభుత్వం కానీ ఇటు ప్రధాని కార్యాలయం కానీ వివరణ ఇవ్వకుండా గమ్మునుంది. ఈ వ్యూహాత్మక మౌనాన్నిబట్టి తెర వెనుక ఏదో జరిగిందని శంకించాల్సి వస్తుంది. మరోవైపు జగన్ అవినీతిని వెలికి తీస్తామన్న చంద్రబాబు అమెరికాలో అదానీ కేసుకు సంబంధించిన పత్రాలను సేకరించి నిరూపించే విషయంలో, అందుకోసం కేంద్రంతో సంప్రదించడంలో వెనకడుగు వేయడానికి బిజెపి–అదాని మధ్య సంబంధమే కారణం. ఇటువంటి పరస్పర రాజకీయ స్వప్రయోజనాలు అదానీని కాపాడుతున్నాయి. జనం ముందు జగన్, చంద్రబాబు నిత్యం ఆగర్భ శత్రువుల్లా విమర్శలు చేసుకుంటారు. కార్పొరేట్లకు సేవ చేయడంలో ఒక్కటిగా వ్యవహరిస్తారు. ఇది కార్పొరేట్లతో బిజెపి, టిడిపి, వైసిపిల మధ్య పెనవేసుకున్న బంధాన్ని తెలుపుతోంది. ఈ వైఖరి రాష్ట్ర ప్రజలను మరింతగా వంచిస్తుంది.


మహనీయుల మాట



నిజమే... కావలసినంత సంపద పోగైంది. ఇప్పుడు దాన్ని పంచడమే జరగాలి!
- శామ్ పిజ్జిగాటి, ఆన్‌లైన్ పత్రిక ఎడిటర్.

వ్యాఖ్య

అమెరికా సుంకాల వేటు - మోడీ సర్కారు లొంగుబాటు



> మళ్లీ ఎన్నికైన ట్రంప్‌ను అభినందించడానికి పరిగెత్తిన కొద్దిమంది విదేశీ నాయకులలో ప్రధానమంత్రి మోడీ వున్నారు. అదేదో మోడీ నాయకత్వానికి గుర్తింపు అన్నట్టు బిజెపి, దాని మీడియా మిత్రులూ చిత్రించారు. అయితే ట్రంప్ పొగడ్తల వెనక మన చెయ్యి మెలిపెట్టిన తీరేంటో సంయుక్త పత్రికా గోష్టిలో తెలిసి వచ్చింది. అమెరికా ఉత్పత్తులపై భారత సుంకాలను ట్రంప్ తీవ్రంగా విమర్శించినా మోడీ మాత్రం గమ్మున వుండిపోయారు. సమగ్ర ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం దిశగా పని చేస్తున్నట్లు వచ్చిన సంయుక్త ప్రకటన తోటే భారత ప్రభుత్వం ఊరట పొందింది. అయితే ఆ ప్రతిపాదిత సమగ్ర ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం అసలైన స్వభావం ఏమిటో అమెరికా వాణిజ్య మంత్రి హోవర్డ్ లుత్నిక్ మీడియా గోష్టితో తేలిపోయింది. ఇండియా తన వ్యవసాయ మార్కెట్లలో ప్రవేశం కల్పించాలని ఎలాంటి అస్పష్టత లేకుండా ఆయన తేటతెల్లంగానే చెప్పేశారు.

PEOPLE'S DEMOCRACY
THE WEEKLY PAPER OF THE COMMUNIST PARTY OF INDIA (MARXIST)

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తన ఎన్నిక తర్వాత అమెరికా కాంగ్రెస్ సమావేశాలలో చేసిన ప్రథమ ప్రసంగంలో సుంకాల విధింపు గురించి హెచ్చరిక చేశారు. ఆయన ఉద్దేశంలో అమెరికా వాణిజ్య విధానాలను అవకాశంగా తీసుకుని లాభపడుతున్నాయనుకుంటున్న దేశాలకు ఈ బెదిరింపు వర్తిస్తుందన్నారు. ఆయన జాబితాలో కెనడా, మెక్సికో, చైనా, బ్రెజిల్ ఇతర యూరోపియన్ దేశాలతో పాటు ఇండియా కూడా వుంది. అమెరికా ఉత్పత్తులపై దారుణంగా సుంకాలు విధిస్తున్న దేశాలలో ఇండియా ఒకటని ఇటీవల కాలంలో ట్రంప్ పదే పదే పేరెత్తి చూపించారు. 'ఇండియా సుంకాల సామ్రాట్' అని కూడా ఆయన పేరు పెట్టారు. ఏప్రిల్ 2 నుంచి తాను దెబ్బకు దెబ్బ తరహా సుంకాలు విధిస్తానని బెదిరింపు జారీ చేశారు.

కెనడా నుంచి వచ్చే ఉక్కు, అల్యూమినియం ఉత్పత్తులపై దాంతోపాటే మెక్సికో, చైనాల నుంచి వచ్చే వివిధ రకాల సరుకులపైనా అమెరికా అదనంగా 25 శాతం సుంకం ప్రకటించింది. ఈ ప్రభావానికి గురైన ఆ దేశాలు ఇందుకు తీవ్ర ప్రతికూలత చూపించాయి. ఎందుకంటే అంతకు ముందు కాలంలో అమెరికాతో కుదుర్చుకున్న ఒప్పందాలకూ ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యుటివో) నిబంధనలకు కూడా అమెరికా చర్య వ్యతిరేకంగా వుంది. కనుకనే మెక్సికో, చైనా, అమెరికా ఉత్పత్తులపై ప్రతీకార సుంకాలు విధించాయి. కెనడా కూడా అదే ఆలోచన వున్నట్టు ప్రకటించింది. అయితే ఇండియా మాత్రం ఈ దేశాల వలె గాక పిరికితనం చూపించింది. అమెరికా ఉత్పత్తులపె సుంకాలు గణనీయంగా తగ్గించడానికి ఇండియా ఒప్పుకుందని అధ్యక్షుడు ట్రంప్ చెప్పుకుంటున్నా భారత ప్రభుత్వం ప్రతిస్పందించకుండా వుండిపోయింది. భారత వాణిజ్య ఒప్పందాలలో సుంకాల సరళీకరణ ఒక భాగంగా వుందని విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ పేర్కొన్నారు. దౌత్యపరమైన పరిభాషను పక్కనపెట్టి చూస్తే దీని సారాంశం ఒకటే. అమెరికా ఒత్తిడికి ప్రభుత్వం లొంగిపోయిందన్నమాట. కేంద్ర బడ్జెట్‌లో ఈ లొంగుబాటుకు నిదర్శనం కనిపిస్తుంది. హార్లీ డేవిడ్సన్ మోటారు సైకిళ్ల పైనా, బౌర్బన్ విస్కీ పైన, విద్యుత్ వాహనాలు, మద్యపానీయాలపైన సుంకాలు తగ్గించడమే అందుకో నిదర్శనం.

మౌన ముద్రతో ఆమోదం

మళ్లీ ఎన్నికైన ట్రంప్‌ను అభినందించడానికి పరిగెత్తిన కొద్దిమంది విదేశీ నాయకులలో ప్రధానమంత్రి మోడీ వున్నారు. అదేదో మోడీ నాయకత్వానికి గుర్తింపు అన్నట్టు బిజెపి, దాని మీడియా మిత్రులూ చిత్రించారు. అయితే ట్రంప్ పొగడ్తల వెనక మన చెయ్యి మెలిపెట్టిన తీరేంటో సంయుక్త పత్రికా గోష్టిలో తెలిసి వచ్చింది. అమెరికా ఉత్పత్తులపై భారత సుంకాలను ట్రంప్ తీవ్రంగా విమర్శించినా మోడీ మాత్రం గమ్మున వుండిపోయారు.

సమగ్ర ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం దిశగా పని చేస్తున్నట్లు వచ్చిన సంయుక్త ప్రకటన తోటే భారత ప్రభుత్వం ఊరట పొందింది. సమగ్ర ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై సంప్రదింపులు జరపడం ద్వారా భారత దేశం అమెరికా సుంకాల వేటు తప్పించుకోవచ్చని బిజెపి సర్కారు భావిస్తున్నది.

అయితే ఆ ప్రతిపాదిత సమగ్ర ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం అసలైన స్వభావం ఏమిటో అమెరికా వాణిజ్య మంత్రి హోవర్డ్ లుత్నిక్ మీడియా గోష్టితో తేలిపోయింది. వాణిజ్యంలో పెద్దదేదో సాధించేందుకు అమెరికా, భారత్‌లు లక్ష్యం పెట్టుకోవాలని ఆయన అన్నారు. ఆ ఒప్పందం మొత్తాన్ని దృష్టిలో పెట్టుకుని చూడాలిగాని ఒక్కో సరుకునూ విడివిడిగా చూడకూడదని పేర్కొన్నారు. ఇండియా తన వ్యవసాయ మార్కెట్లలో ప్రవేశం కల్పించాలని ఎలాంటి అస్పష్టత లేకుండా ఆయన తేటతెల్లంగానే చెప్పేశారు. బిటిఎ ద్వారా అమెరికా కోరుకుంటున్నది కేవలం సుంకాలలో రాయితీలు మాత్రమే కాదు. మరింత విస్తృతమైన మార్పులు కోరుతున్నది. వ్యవసాయ సబ్సిడీల తగ్గింపు, ప్రభుత్వ ధాన్య సేకరణలో అమెరికా కంపెనీలకు అవకాశమివ్వడం, అమెరికా ఔషధ కంపెనీలకు మేలు కలిగేలా పేటెంటు చట్టాల సవరణ, సమస్త డేటా బేషరతుగా ఇచ్చిపుచ్చుకోవడాలు...అన్నిటినీ కోరుతున్నది. అమెరికాలో భారత వాణిజ్య మంత్రిని కలుసుకున్న తర్వాతనే లుత్నిక్ ఈ వ్యాఖ్యలు చేశారని గమనంలో వుంచుకోవాలి.

వినాశకర పర్యవసానాలు

బిటిఎ ద్వారా వ్యవసాయ మార్కెట్లలో అమెరికా కంపెనీలకు ప్రవేశం కల్పించడం, సుంకాల తగ్గింపు దేశంపై చాలా వినాశకర ఫలితాలకు దారితీస్తుంది. దేశంలో దాదాపు 70 శాతం మంది ప్రజలు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. భారత మార్కెట్లలో అమెరికా వ్యవసాయ ఉత్పత్తులను రాయితీలతో అనుమతించడమంటే–ఇప్పటికే సుదీర్ఘ వ్యవసాయ సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న అసంఖ్యాకమైన మన ప్రజలను వినాశనం వైపు నెట్టడమే అవుతుంది.

అదే రీతిలో భారతీయ పేటెంటు చట్టాలను సడలించడం, దేశీయ పరిశ్రమలను ప్రత్యేకించి ఔషధ పరిశ్రమను చావు దెబ్బ కొట్టడమే అవుతుంది. ఎందుకంటే అమెరికా కంపెనీల భయానక మార్కెట్ ధరలతో పోలిస్తే మన మందుల పరిశ్రమ అందుబాటు ధరలలో మందులు తయారు చేస్తున్నది. ఇక ట్రంప్ విశ్వసనీయ మిత్రుడైన ఎలాన్ మస్క్ తయారు చేసే టెస్లా ఆటోమొబైళ్ల ప్రవేశాన్ని సుగమం చేయడానికే విద్యుత్ వాహనాలపై సుంకాల తగ్గింపు ఉద్దేశితమైంది.

అమెరికాకూ దాని బలవంతపు ఎత్తుగడలకూ భారత ప్రభుత్వం అంతకంతకూ వత్తాసుదారుగా మారుతున్నదనే వాస్తవం పదే పదే విదితమవుతున్నది. అక్రమ వలసదారులైన భారతీయుల మొదటి బృందాన్ని సంకెళ్లు తగిలించి అవమాన కరంగా అమెరికా సైనిక విమానంలో తరలించినపుడు విదేశాంగ మంత్రి మాత్రం స్త్రీలు, పిల్లల పట్ల అలా వ్యవహరించలేదని కితాబునిచ్చారు. సంకెళ్లు వేయడం, గొలుసులతో కట్టడం మామూలుగా వుండే ప్రామాణిక పద్ధతులేనని సిగ్గు లేకుండా అమెరికా చర్యలకు సమర్థనగా వంత పాడారు. ప్రజల్లో తీవ్ర నిరసన, ఆగ్రహం వ్యక్తమైన తర్వాత మాత్రమే ప్రభుత్వం ఒక్క మొక్కుబడి ప్రకటన జారీ చేసింది. ఈ విషయం అమెరికా అధికారుల దృష్టికి తెస్తామని అధికార ప్రతినిధితో చెప్పించి సరిపెట్టింది. అందరూ ఆశించినట్టు బలమైన ఖండన గానీ, నిరసన తెల్పడం గానీ జరగనే లేదు.

చిన్న దేశాల కన్నా హీనంగా...

బిజెపి ప్రభుత్వం ఇలా లొంగుబాటు ధోరణి ప్రదర్శించగా చిన్న దేశాలైన మెక్సికో, కొలంబియా వంటివి కూడా తమ దేశ పౌరులను ఇలా అవమానకరంగా పంపించడం పట్ల గట్టి నిరసన ప్రకటించాయి. ఉదాహరణకు కొలంబియానే తీసుకుంటే అమెరికా సైనిక విమానాలకు ప్రవేశం నిరాకరించి తన స్వంత సైనిక విమానాలనే పంపించింది.

సుంకాల విషయంలో బిజెపి ప్రభుత్వం మోస పూరితంగా వ్యవహరిస్తున్నది. బహుళ ధృవ ప్రపంచ సమస్యల పట్ల అమెరికా ప్రభుత్వ వైఖరి భారత దేశ ప్రయోజనాలకు అనుగుణంగానే వుందని విదేశాంగ మంత్రి లండన్ పర్యటనలో ప్రవచించారు. సుంకాల విషయం అడుగుతుంటే ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం (బిటిఎ) గురించి ప్రస్తావించడం ద్వారా చర్చ దారి మళ్లించారు.


ట్రంప్ వచ్చేలోగానే...?

అమెరికాను మెప్పించడం కోసం తాము పూర్తిగా వంగిపోతున్నామని బిజెపి మంత్రులు అంతకంతకూ తమ చర్యలు, ప్రకటనల ద్వారా స్పష్టం చేస్తున్నారు. వ్యవసాయం వంటి కీలక రంగాలలో కూడా దేశ ప్రయోజనాలను ఫణంగా పెట్టి ఎంత మూల్యం చెల్లించడానికైనా వారు సిద్ధమవు తున్నట్టు కనిపిస్తుంది. ఈ ఏడాది భారత దేశం నిర్వహిస్తున్న క్వాడ్ శిఖరాగ్ర సమావేశం కోసం ట్రంప్ పర్యటనకు వచ్చే లోగా ఆయన బాగా ఆనంద పరిచేలా వాణిజ్య ఒప్పందం ఖరారు చేయాలని తాపత్రయ పడిపోతున్నారు. క్వాడ్ అనే సంలీన వ్యవస్థలో భాగం కావాలనే ఆతృతలో బిజెపి ప్రభుత్వం భారతదేశ స్వావలంబనను, దేశ సార్వభౌమత్వాన్ని బలి పెడుతున్నది. ఇది ఎట్టి పరిస్థితులలోనూ అనుమతించరాని విషయం.

అమెరికా సామ్రాజ్యవాదానికి మోడీ సర్కారు లొంగుబాటును ఎండగట్టడం దీనిపై ప్రజలను భారీ సంఖ్యలో సమీకరించడం తప్పనిసరి. ఎందుకంటే మన దేశ ప్రగతి, సార్వభౌమత్వాల భవిష్యత్తే వీటితో ముడిపడి వుంది.

(మార్చి 12 'పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)

సెటైర్



నేనూ పిల్లల్ని కంటాను..!

కొత్తగా పెళ్లైన జంట తమకున్న చిన్నపాటి గుడిసెకు ఆనుకుని ఉన్న పెరట్లో కూర్చుని తమ భవిష్యత్ కోసం మాట్లాడుకుంటున్నారు.

భార్య లచ్చిమి భర్త ఎంకన్నతో... మావా..! మనం అరడజను మంది పిల్లల్ని కని... ఇల్లంతా కలకల్లాడుతుంటే సూడాలని ఉంది... ఏటంతావు మావా! అన్నది.

భర్త ఎంకన్న...లచ్చీ పెళ్లయి 6 నెల్లైనా కానేదు. అప్పుడే అరడజను మంది ప్లిల్లల్ని కంటాననంటావేంటే? ముందు మనం బాగా బతకాల, అప్పటిదాకా పిల్లా, జెల్లా ఏటీ నేదే.. అన్నాడు.

నానేమైనా ఒకేసారి అరడజను మంది పిల్లల్నీ కనీయలని అన్నానేటి? గవర్నమెంటోళ్లు కూడా ఎక్కువ మంది పిల్లల్ని కనమని చెప్పడం ఇనలేదా నువ్వు? అని భర్త ఎంకన్నను ఎదురు ప్రశ్న వేసింది లచ్చి.

ఆళ్లకేటే... ఏద్దైనా సెబుతారే..! అంతమంది పిల్లల్ని కని, పెంచి, పోసించే స్తోమత మన దగ్గర లేదే..! ఆళ్లు ఏయో సిద్దాంతాలు సెప్పి పజల్ని ఆల మాటల్ని నమ్మించేత్తారే...! ఆల మాటల్ని పట్టుకొని డజను, అరడజను పిల్లల్ని కంటానని మొండి పట్టుదలకు పోకే... పొద్దల్లా కట్టపడి వచ్చాను నాకు ఓపిక నేదు...! అన్నాడు ఎంకన్న!

అదేటి మావా..! మన తాత, ముత్తాతలు డజనేసి పిల్లల్ని కనలేదా... పెంచనేదా... ఓ పాలి ఆలోసించు మావా..! అన్నది లచ్చి.

ఓసి ఎర్రిదానా..! అప్పుడు పపంచకం వేరు? ఇప్పుడు పపంచకం వేరే? అప్పుడు ఎక్కువమంది పిల్లల్ని కంటే ఆలంతా కష్టపడ్డానికి పనుండేది, అందరూ కట్టబడితే అందరూ బాగా బతకొచ్చని... ఆలోసించేవోరే! ఆనాటి తిండికి ఆళ్ల ఆరోగ్యాలు, శరీరాలు తట్టుకునేవే.. ఇప్పుడు అంతా మారిపోయిందే....! ఇప్పుడు పెబుత్వాలు సెబుతున్న సిద్ధాంతాలు నీలాటి మట్టిబుర్రలకు అర్థంకావు గాని... నోరు మూసుకుని ఉండు అని వారించాడు భర్త ఎంకన్న.

అది కాదు మావా..! మనం ఎంతమందిని కన్నా ఆలందరికీ పెబుత్వం అమ్మ ఒడి దబ్బులేసి సదివిత్తారంట! రేపు ఎపుడైనా నువ్వు మనూళ్లో ఎలచ్చన్లో నిలబడ్డావనుకో పిల్లలు ఎక్కువున్నా..ఎలాటి ఇబ్బంది నేదంట..! నువ్వు గెలిత్తే మనకీ నగా, నట్రా.. కార్లు, బంగ్లాలు వత్తాయి కదా..! ఓ పాలి ఆలోసించు మావా...! అన్నది భార్య లచ్చి.

నీ తెలివి తెల్లారినట్లే ఉందే లచ్చీ...! కూలాడితే గాని కుండాడని మన బతుకులికి ఎలచ్చన్లు ఒకటీ...! నానెప్పుడు డబ్బు సంపాదించాలా..! ఎప్పుడు పోటీ సేయాలా...! ఎప్పుడు పెసిరెంటు అవ్వాలా...! అయన్నీ మనలాటోల్లకి సెల్లవే...! అయినా...అంతమంది పిల్లల్ని కంటే కూలీ.. నాలీ చేసుకుంటూ..బక్కచిక్కిపోయిన నీ శరీరం, ఆరోగ్యం సాకరించదే..! అన్ని కాన్పులకు, ఆ ఆపరేసన్లకి నీ ఒల్లంతా గుల్లైపోయి ఎందుకు పనికిరాకుండా పోతావే..! మన ఎదిరింటి నూకాలమ్మని సూడే... ముగ్గుర్ని కంటేనే మంచం మీద నుండి లెగలేక... ఆసుపత్రుల చుట్టూ తిరుగుతుంటే...నీకు కనబడనేదా? పిల్లల్ని కనీయడమే కాదు కదా..! ఆల్లని ఎలా పోసించాలా..? ఎలా పెంచాలా? ఎలా సదివించాలా? ఆల ఆలనా.. పాలనా.. ఏటి? నువ్వేమైనా ఆలోసించావా..! మనూళ్లో డబ్బు. కార్లు, బంగ్లాలు ఉన్న మన పెసిరెంటు చంద్రం ఒకర్నే ఎందుకు కన్నాడో తెలుసా..! ఆల కొడుకు నూకేసు కూడా ఒకడ్నే ఎందుకు కన్నాడో తెలుసా...! ఆలకు పెంచే సోమత లేదా? కార్లు, బంగ్లాలు, డబ్బూ లేదా..! ఆలు సెప్పేది మన కోసం కాదే...! ఆల ఎనకాలున్న పెద్ద పెద్ద బడా బాబుల కోసమే..! నీకియన్నీ అర్థం కావే...! దేశంలో పరిమితికి మంచి జనాబా ఉంతే ఎవరికి లాభమో ఇప్పుడు నీలాంటోల్లకి తెలీదే..! రేపు మన పిల్లలు పెరిగి పెద్దయ్యాక, చదువు కొనలేక... జబ్బొత్తే వైద్యం చేయించలేక... సరైన విద్యా బుద్దులు సెప్పించక పోతే..! ఆ పైవేటు కంపెనీ గేట్లు ముందు పనికోసం పడిగాపులు కాయాలే..! ఆ కంపెనీలోలు ఆ పోటీని సూసి తక్కువ కూలికి, 15, 16 గంటలు పని సేయించుకుని ఆళ్లని పిండి పిప్పి చేసెత్తారే...! ఆడికొచ్చిన కూలితో కుటుంబాల్ని పోసించుకో లేక నానా అవస్థలు పడుతుంటే ఆ దరిద్రాన్ని సూత్తూ భరిత్తావా...! ఆ పెద్ద పెద్దోళ్ల కంపెనీలోలకి సవగ్గా పనిసేయడానికి ఎక్కువ జనాబా ఉండాలని ఆలు కొత్త కొత్త సిద్ధాంతాలు సెపుతున్నారే..! ఆళ్ల లాభాలు బాగా పెంచుకొని మన కష్టం మీద మరింత పెద్దోళ్లవడానికే ఈ సిద్ధాంతం, పచారం అంతా...! అర్థం సేసుకోవే లచ్చీ..అన్నాడు ఎంకన్న.

అవునా మావా! ఈ పచారం సేత్తున్నోళ్ల మర్మం తెలీక నిన్ను ఇబ్బందెట్టాను మావా! మనం కూడా ఒకర్నో ఇద్దర్నో కని ఆల్ని సక్కగా సూసుకుంటే అదే చాలు మావా..! ఈ సిద్ధాంతాలు వద్దు... ఆ పదకాలూ వద్దు...ఆ కట్టాలూ వద్దు...! రా మావా బువ్వెడతాను. తినేసి పడుకుందాం. పొద్దున్నే పనిలోకెల్లాలి. అని లచ్చి అనగానే గుడిసె లోపలికి వెళ్లాడు ఎంకన్న.

- వి.వి. శ్రీనివాసరావు,
సెల్ : 94900 98799

విశ్లేషణ

పంచాయతీ కార్మికుల శ్రమకు గుర్తింపు ఏదీ?

> కేంద్రంలోని మోడీ ప్రభుత్వం స్వచ్ఛ భారత్ అంటే, రాష్ట్రంలో నిన్నటిదాకా ఉన్న వైసిపి, నేడు టిడిపి కూటమి ప్రభుత్వాలు 'స్వచ్ఛాంధ్ర' నినాదాన్ని మోత మోగిస్తున్నాయి. ప్రస్తుతం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రివర్యులు పవన్ కల్యాణ్ 'పచ్చదనం పరిశుభ్రత' గురించి గొప్పలు చెప్పున్నారు కానీ, వీటన్నింటికీ మూలమైన పంచాయతీ కార్మికుల వెతల గురించి పట్టించుకోవడం లేదు. గత ఏడు నెలలుగా మంత్రిగారు అపాయింట్‌మెంట్ ఇవ్వడంలేదు. గత పదేళ్ళుగా జీతాలు పెరగలేదు. మరోవైపు పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలు, కరెంట్ చార్జీల భారాలతో పంచాయతీ కార్మికుల జీవితాలు కునారిల్లిపోతున్నాయి.





కె. ఉమామహేశ్వరరావు

రాష్ట్రంలో సుమారు 13,700 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటిలో పారిశుధ్యం, మంచినీరు, విద్యుత్, బిల్ కలెక్టర్ తదితర విధులు నిర్వహించేవారు 28 వేల మంది కార్మికులు పని చేస్తున్నారు. 'స్వచ్ఛ భారత్' పథకం పేరుతో తొలుత 32 వేల మందిని నెలకు రూ.6000 వేతనం కింద నియమించారు. ప్రస్తుతం వీరి సంఖ్య సగానికి తగ్గిపోయింది. వీరుకాక మరో 700 మంది ఎన్ఎంఆర్ కార్మికులు పంచాయతీలలో ప్రజలకు సేవలందిస్తున్నారు.

నెలల తరబడి జీతాలు పెండింగ్

పంచాయతీ కార్మికులందరూ ఒకే విధమైన చాకిరి చేస్తున్నారు. కానీ వీరికి జీతాలు మాత్రం ఒకే రీతిగా చెల్లించడంలేదు. నెలకు రూ.5 వేల నుండి రూ.12 వేలు చెల్లిస్తున్నారు. 12 వేల రూపాయలు పొందేవారు నూటికి ముగ్గురు నలుగురు కూడా ఉండరు. అత్యధిక మందికి రూ.7 వేల నుండి రూ.9 వేల మధ్య చెల్లిస్తున్నారు. ఈ జీతాలు కూడా ప్రతి నెలా చెల్లించరు. 4 నుండి 18 నెలలు బకాయిలు పెడుతున్నారు. జీతాలు సకాలంలో రాక, కొత్త అప్పులు పుట్టక... కిరాణా షాపు యజమానుల ఒత్తిళ్లు, వడ్డీ వ్యాపారుల వేధింపులతో పంచాయతీ కార్మికులు అవస్థలు పడుతున్నారు. బకాయి జీతాలు అడిగితే "మేము ఇచ్చినప్పుడు తీసుకో", "అట్లా ఇష్టమైతే పని చెయ్యి. లేకపోతే మానుకో" అంటూ బెదిరింపులు నిత్యకృత్యం.

1999లో జారీ చేసిన జీవో నేటికీ అతీగతీ లేదు

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పంచాయతీ కార్మికుల పోరాట ఫలితంగా 1999లో 551 జీవోను నాటి ప్రభుత్వం జారీ చేసింది. అందులో పంచాయతీ కార్మికులకు గుర్తింపు కార్డులు, కనీస వేతనాలు, ఇపిఎఫ్, ఇఎస్ఐ తోపాటు ప్రతి ఏటా టెండర్ల ద్వారా నియామకాలు జరపాలని వుంది. వీటితో కేవలం టెండర్ల విధానం మాత్రం ఆ నాటి నుండి పక్కాగా అమలు చేస్తున్నారు. మిగిలిన ఏ ఒక్కటీ అమలు చేయలేదు. రాష్ట్ర విభజన తర్వాత 2017, 2018 సంవత్సరాలలో జరిగిన పోరాటాల ఫలితంగా 132 జీవో జారీ చేశారు. దీనికీ అదే గతి పట్టించారు. గ్రీన్ అంబాసిడర్లకు 2020 జనవరి నుండి నెలకు రూ.10,000 చెల్లిస్తామంటూ 2019 అక్టోబర్‌లో 680 జీవో జారీ చేశారు. ప్రస్తుతం ఆ జీవో వెబ్‌సైట్‌లో కనిపించడంలేదు. ఎన్ఎంఆర్ లకు టైంస్కేల్, జీతం చెల్లిస్తామంటూ 142 జీవో జారీచేశారు. కానీ ప్రభుత్వం జీతాలు చెల్లించకుండా పంచాయతీల మీదకు నెట్టేసింది.

గతంలో తెలుగుదేశం అధికారంలో ఉండగా పంచాయతీ కార్మికులను 'మల్టీ పర్పస్ వర్కర్లు'గా కొత్త నామకరణం అయితే చేసింది. ప్రతి కార్మికుడికి నెలకు రూ.10,000 తక్కువ కాకుండా జీతం చెల్లించాలని 2019 ఫిబ్రవరి 13న జీవో నెం.57 జారీ చేసింది. గత వైసిపి ప్రభుత్వం పంచాయతీ కార్మికుల జీతభత్యాల గురించి పట్టించుకోలేదు. కార్మికుల జీతాలు పెంచాలని, జీవోలు అమలు చేయాలని కోరుతూ శాంతియుతంగా నిరసనలు నిర్వహిస్తే అక్రమ అరెస్టులు, కేసులు బనాయించి నిరంకుశంగా వ్యవహరించింది.

కోర్టు తీర్పులు బేఖాతరు

ఎవరు తక్కువ వేతనాలకు టెండర్ వేస్తే వారికి పని దొరకడం వల్ల వేతనాలు పెరగకపోగా నానాటికీ దిగజారి పోయి కార్మికుల కుటుంబాలు ఆర్థికంగా దివాళా తీయడం, కార్మికుల మధ్య పోటీ పెట్టి అధికార యంత్రాంగం, దళారీలు కార్మికులను దోచుకు తినడంతో, ఉమ్మడి చిత్తూరు జిల్లా యూనియన్ నాయకత్వం 2015లో హైకోర్టును ఆశ్రయించింది. "గతం నుండి విధులు నిర్వహిస్తున్న వారికి కొత్తగా టెండర్లు అవసరం లేదు. విధుల్లో కొనసాగించాలి. అంటూ హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. వీటి అమలుకు రాష్ట్ర పంచాయతీ రాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ, ముఖ్య కార్యదర్శి, కమిషనర్, అన్ని జిల్లాల కలెక్టర్లు, పంచాయతీ అధికారులను బాధ్యులుగా చేశారు.

అయినా హైకోర్టు తీర్పును అధికార యంత్రాంగం అమలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే 2023లో కంటెమ్ట్ ఆఫ్ కోర్ట్ ద్వారా మరలా కేసు వేస్తే హైకోర్టు పాత ఉత్తర్వులను అమలు చేయాలని చెప్పింది. అయినా నేటికీ అమలుకు నోచుకోలేదు.

కోతలే–చేతల్లేవు

దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్ళు గడుస్తోంది. దేశంలో, రాష్ట్రంలో పాలకులు మారుతున్నారు కానీ పంచాయతీ కార్మికుల జీవితాలు మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా వున్నాయి. తాము అధికారంలోకి వస్తే పంచాయతీ కార్మికులను అందలమెక్కిస్తామని వాగ్దానాలు కురిపించడం, తీరా గద్దెనెక్కాక మొండి చెయ్యి చూపడం రివాజుగా మారింది. పంచాయతీ కార్మికుల జీతాలు, పి.ఎఫ్, ఇఎస్ఐ గురించి అడిగినప్పుడు పాలకవర్గాలు, అధికారులు పంచాయతీ కార్మికులకు ఇవన్నీ ఎట్లా అమలవుతాయి? "పంచాయతీల దగ్గర నిధులెక్కడున్నాయి"? అంటూ ఎదురు దాడి చేయటం పరిపాటిగా మారింది. గ్రామ పంచాయతీ కార్మికుల్లో చదువు తక్కువుగా ఉండటం, రాజ్యాంగ హక్కులను అమలు చేయాల్సిన అధికార యంత్రాంగం పాలక వర్గాలకు అనుకూలంగా మారడం, పంచాయతీలపై ఆధిపత్య కులాలవారి పెత్తనం కొనసాగడంతోపాటు, కార్మికులలో అత్యధికులు ఎస్‌సి, ఎస్‌టి, బిసి కులాలకు చెందిన పేదవారు కావడం వల్ల వీరు తిండికి కూడా గతి లేక పస్తులతో కాలం గడపాల్సి వస్తున్నది.

ప్రతి ఐదేళ్ళకోసారి ఎన్నికలు జరిగి పాలకులు మారినప్పుడల్లా వందలాది మంది గ్రామ పంచాయతీ కార్మికులను అక్రమంగా ఉద్యోగాల నుండి తొలగించి కార్మికుల కుటుంబాలకు రోడ్డున పడేస్తున్నారు. అక్రమంగా తొలగించిన వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోర్టులు ఉత్తర్వులిచ్చినా వాటిని కూడా బుట్ట దాఖలు చేస్తున్నారు.

'స్వచ్ఛ' నినాదాలు ఎవరి కోసం?

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం స్వచ్ఛ భారత్ అంటే, రాష్ట్రంలో నిన్నటిదాకా ఉన్న వైసిపి, నేడు టిడిపి కూటమి ప్రభుత్వాలు "స్వచ్ఛాంధ్ర" నినాదాన్ని మోత మోగిస్తున్నాయి. ప్రస్తుతం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీ రాజ్ శాఖ మంత్రివర్యులు పవన్ కల్యాణ్ "పచ్చదనం పరిశుభ్రత" గురించి గొప్పలు చెప్తున్నారు కానీ, వీటన్నింటికీ మూలమైన పంచాయతీ కార్మికుల వెతల గురించి పట్టించుకోవడం లేదు. గత ఏడు నెలలుగా మంత్రిగారు అపాయింట్‌మెంట్ ఇవ్వడంలేదు. గత పదేళ్ళుగా జీతాలు పెరగలేదు. మరోవైపు పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలు, కరెంట్ చార్జీల భారాలతో పంచాయతీ కార్మికుల జీవితాలు కునారిల్లిపోతున్నాయి.

కూటమి ప్రభుత్వమైనా ఆలకిస్తుందా?

రాష్ట్రంలో 9 నెలల క్రితం అధికార పగ్గాలు చేపట్టిన తెలుగుదేశం కూటమి ప్రభుత్వం మా కష్టాలు తీర్చకపోతుందా? అని గంపెడాశతో ఎదురు చూస్తున్నారు. శాసన సభలో భారీ బడ్జెట్ ప్రవేశపెట్టిన చంద్రన్న ప్రభుత్వం గ్రామ పంచాయతీ కార్మికులకు ఒక్క పైసా కూడా విదల్చలేదు.

ఈ నేపథ్యంలో తమ శ్రమను గుర్తించాలని, పోరాడి సాధించుకున్న 551, 132, 142, 680 జీవోలను అమలు చేయాలని, జీతాలు పెంచాలని, ప్రతి నెలా జీతాలు చెల్లించాలని, అక్రమంగా తొలగించిన వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ ఎ.పి గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో 2025 మార్చి 17న విజయవాడలో మహా ధర్నాను నిర్వహిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు వీరి గురించి స్పందిస్తాయో లేదో వేచి చూడాలి.

/ వ్యాసకర్త ఎ.పి గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు (సిఐటియు) /

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ :
editpageps @gmail.com

రేషన్ బియ్యం నిల్వలపై దాడి

• ఐదు టన్నుల బియ్యం స్వాధీనం

ప్రజాశక్తి -చిత్తూరు (యాదమరి)

అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యం స్థావరాలపై చిత్తూరు అర్బన్ రెవెన్యూ అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించి ఐదు టన్నుల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. చిత్తూరు మురకంబట్టు, కొడిగుట్ట ఇందిరమ్మ కాలనీలో భారీ మొత్తంలో రేషన్ బియ్యం నిల్వ ఉంచారని చిత్తూరు అర్బన్ తహశీల్దారు చంద్రశేఖర్ రెడ్డికి సమాచారం అందడంతో తహశీల్దారు ఆదేశాల మేరకు మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ , 49 వ వార్డు విలేజ్ రెవెన్యూ అధికారి కొడిగుడ్డు ఇందిరమ్మ కాలనీలో దాడులు నిర్వహించారు. కాలనీలోని మోన ఇంటిలో ప్రభుత్వం చౌక దుకాణాలు సరఫరా చేసే రేషన్ బియ్యం నిల్వ చేసి ఉండడం గుర్తించారు. ఇంటి యజమాని ఫోన్లో సంప్రదించగా ఎంత సేపటికి అక్కడికి రాకపోవడంతో రెవెన్యూ అధికారులు ఇంటికి వేసిన తాళాన్ని పగలగొట్టారు. ఇంటిలో భారీ మొత్తంలో ప్రభుత్వ రేషన్ బియ్యం నిల్వ ఉండడం గుర్తించారు. అక్రమంగా నిలువ ఉంచిన 102 బస్తాల రేషన్ బియ్యం , మొత్తం 4,987 కేజీలు రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని ప్రభుత్వ గోదాం కు తరలించారు. గ్రామంలో రెవెన్యూ అధికారులు విచారణలో రేషన్ బియ్యాన్ని సేకరించి ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారని తేలడంతో వారిపై రెవెన్యూ యాక్ట్, పోలీస్ కేసు నమోదు చేశారు. రెవెన్యూ అధికారులు గ్రామాల్లో ఎవరైనా రేషన్ బియ్యాన్ని పెద్ద మొత్తంలో అక్రమంగా నిలువ వుంచి వ్యాపారాలు చేస్తే వారిపై కేసు నమోదు చేస్తామని రెవెన్యూ అధికారులు హెచ్చరించారు.

ప్రభుత్వ పాఠశాలలను రక్షించుకోవాలి

• యుటిఎఫ్ రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న కెఎస్ లక్ష్మణరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వ పాఠశాలలను రక్షించుకోవాల్సిన బాధ్యత ఉపాధ్యాయులతోపాటు సమాజం, ప్రభుత్వం తీసుకోవాలని వక్తలు అభిప్రాయపడ్డారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన జిఒ 117 వల్ల 12,512 పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మారాయని, 10 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల నుంచి ప్రైవేటు పాఠశాలలకు తరలిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యాన 'విద్యారంగ సమస్యలపై' రౌండ్‌టేబుల్ సమావేశం విజయవాడలోని యుటిఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను విద్యాశాఖ మంత్రి నుంచి గ్రామ సర్పంచ్ వరకూ అందరు ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లాలని, 'ఊరి బడిని కాపాడుకుందాం' పేరుతో ఉద్యమించాలని, సమాజానికి విద్యారంగం లోని పరిణామాల్ని కరపత్రం రూపంలో ముద్రించి పంచాలని నిర్ణయించారు. ఉపాధ్యాయులు ప్రభుత్వ బడిని బలోపేతం చేసుకోవడానికి కృషి చేయాలని, దీనికోసం ప్రభుత్వ బడి పట్ల తల్లిదండ్రులకు నమ్మకం కలిగించే విధంగా ఉపాధ్యాయులు పని చేయాలని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించే ప్రక్రియను ప్రారంభించాలని వక్తలు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పలు అంశాలపై తీర్మానాలు చేశారు. విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా ప్రతి గ్రామంలో మోడల్ ప్రైమరీ పాఠశాల ఏర్పాటు చేయాలని, మోడల్ ప్రైమరీ పాఠశాలలు ఏర్పాటు చేసే చోట ప్రాథమిక పాఠశాల నుంచి 3 నుంచి 5 తరగతుల విద్యార్థులను మ్యాప్ చేయకూడదని తీర్మానించారు. దూరంతో సంబంధం లేకుండా 60 మంది విద్యార్థులు ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలలను ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేయాలని, మిగిలిన ప్రాథమికోన్నత పాఠశాలలను యథాతథంగా కొనసాగించాలని తీర్మానం చేశారు. ఉన్నత పాఠశాలల్లో సమాంతర మీడియం కొనసాగించాలని, ప్లస్ టు పాఠశాలలు కొనసాగించాలని తీర్మానించారు.

ఈ సమావేశంలో ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ... పిడిఎఫ్, ఉపాధ్యాయ సంఘాల నిరసనలతో ప్రస్తుత ప్రభుత్వం ఈ జిఒను 117 రద్దు చేస్తామని చెప్పిందని తెలిపారు. జిఒ 117 రద్దు చేసినా, మరో రూపంలో ఉత్తర్వులు ఇచ్చి విద్యారంగంలో సంస్కరణలు అమలు చేయాలని చూస్తుందన్నారు. ఎమ్మెల్సీ బి.గోపీమూర్తి మాట్లాడుతూ... విద్యారంగంలో సంస్కరణల వల్ల 1, 2 తరగతులు మాత్రమే ఉన్న ఫౌండేషన్ పాఠశాలలు 20 వేలకుపైగా పెరుగుతాయని తెలిపారు. భవిష్యత్తులో ఈ పాఠశాలలు మూసివేతకు గురవుతాయని చెప్పారు. ప్రాథమికోన్నత పాఠశాలల వ్యవస్థ రద్దు దిశగా సంస్కరణలు ఉన్నాయని చెప్పారు. మాజీ ఎమ్మెల్సీ వి.బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ... విద్యారంగ సంస్కరణల ఫలితంగా బాలికలు విద్యకు దూరమయ్యే అవకాశం కనిపిస్తోందన్నారు. మోడల్ ప్రాథమిక పాఠశాలల పేరుతో 3 నుంచి 5 తరగతులను మ్యాప్ చేయడం సరికాదన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ... స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలతో బలవంతంగా తీర్మానాలు చేయించడం సరికాదని, మోడల్ పాఠశాలలు అంటే ఐదు గదులు, ఐదుగురు ఉపాధ్యాయులు మాత్రమే కాదని, అన్ని హంగులతో పాఠశాలలను నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. వెంకటేశ్వర్లు, అంగన్‌వాడీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరావమ్మ, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్, ఎస్‌ఎఫ్‌ఐ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రసన్న, అశోక్, ఎపిటిఎఫ్ 1938 రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు ఎస్.పి మనోహర్ కుమార్, బి.సుభాషిణి, కె.ఎ ఉమామహేశ్వరరావు, ఎస్.కిషోర్‌కుమార్, రాష్ట్ర ప్రచురణల విభాగం ఎం. హనుమంతరావు, రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు డి.రాము, ఎన్.కుమార్ రాజా, గుంటూరు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు యు.రాజశేఖర రావు, ఎం.కళాధర్, ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్షులు కె.శ్రీనివాసరావు, ఏలూరు జిల్లా అధ్యక్షులు ఎస్‌కె మస్తాన్‌వలీ, కృష్ణాజిల్లా ప్రధాన కార్యదర్శి వి.కనకా రావు, గౌరవాధ్యక్షులు జె లెనిన్‌బాబు పాల్గొన్నారు.

16న రాష్ట్ర స్థాయి సదస్సు

విద్యా రంగ సంస్కరణల్లో భాగంగా ప్రభుత్వ పాఠశాల విద్యలో తీసుకుంటున్న నిర్ణయాలు, వాటి పర్యవసానాలతోపాటు 12వ పిఆర్‌సి ఛైర్మన్ నియామకం, ఆర్థిక బకాయిల చెల్లింపులు తదితర అంశాలపై ఈ నెల 16న రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహిస్తున్నట్లు యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎన్.వెంకటేశ్వర్లు, కెఎస్ఎస్ ప్రసాద్ తెలిపారు. విజయవాడలోని ఎంబివికెలో ఈ సదస్సు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

అమరావతి నిధుల కోసం ప్రపంచ బ్యాంకు విచారణ

• రాజధాని పరిధిలో పర్యటన • కొందరు రైతుల అభ్యంతరాలు

ప్రజాశక్తి – అమరావతి బ్యూరో

రాజధాని అమరావతి నగర నిర్మాణానికి నిధులిస్తున్న ప్రపంచబ్యాంకు బృందం పలు గ్రామాల్లో పర్యటించింది. రైతులతో సమావేశమైంది. వారి అభిప్రాయాలను, అభ్యంతరాలను తెలుసుకుంది. గుట్టుచప్పుడు కాకుండా జరిగిన ఈ కార్యక్రమంలో ఆరుగురు సభ్యుల ప్రపంచబ్యాంకు బృందం పాల్గొన్న ట్లు సమాచారం. తుళ్లూరు, నేలపాడు, మందడం గ్రామాల్లోని పంచాయతీ కార్యాలయాల్లో విచారణ నిర్వహించారు. దీనిలో వెలగపూడి, లింగాయపాలెం, రాయపూడి గ్రామాలకు చెందిన కొందరు రైతులు బ్యాంకు బృందం వద్ద అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు తెలిపింది. ప్రపంచబ్యాంకు నిబంధనల ప్రకారం ఏదైనా రుణం మంజూరు చేస్తుంటే ఆ ప్రాజెక్టులో భాగస్వాములుగా ఉన్న వారిలో వ్యతిరేకత ఉండకూడదు. ఈ నిబంధన అమలులో భాగంగా బ్యాంకు బృందం ఈ కార్యక్రమం నిర్వహించినట్లు సమాచారం. తమ వద్ద తీసుకుంటున్న భూమికి ప్రభుత్వం ఇస్తున్న పరిహారం సరిగా లేదని కొందరు రైతులు చెప్పారు. భూమి కేటాయింపుల్లోనూ, ప్లాట్ల కేటాయింపుల్లోనూ అన్యాయం జరిగిందని, ప్రభుత్వానికి అనుకూలంగా ఉన్నవారికి ఒకచోట, లేనివారికి మరొకచోట ఇచ్చారని, ప్లాట్లు కూడా సరిగా లేవని చెప్పినట్లు తెలిసింది. అలాగే తమకు భూములు ఇవ్వడం ఇష్టం లేకపోయినా బలవంతంగా లాక్కున్నారని, సమీకరణ ఐకు ఇష్టం ఉన్నవాళ్లే ఇవ్వవచ్చు అన్న ప్రభుత్వం అనంతరం బలవంతంగా సేకరణ నోటీసులు ఇచ్చిందని తెలిపారు.

గతంలో ఇదే అంశాన్ని వివరించామని చెప్పినట్లు తెలిసింది. అక్కడున్న మరికొందరు అటువంటిదేమీ లేదని, తమకు 90 శాతం న్యాయం జరిగిందని తెలిపారు. దీనికి ప్రపంచబ్యాంకు బృంద సభ్యులు ప్రతి ఒక్కరినీ తమ అభిప్రాయాలను చెప్పనివ్వాలని అన్నట్లు తెలిసింది.

ప్రధాన అభ్యంతరాలు

ప్రపంచబ్యాంకు ప్రతినిధుల ముందు రాజధాని ప్రాంతంలోని పలువురు రైతులు కీలక అంశాలను ప్రస్తావించారు. వాటిల్లో ముఖ్యంగా గ్రామ కంఠాల్లో భూములను కూడా బలవంతంగా తీసుకున్నారని, ముంపు ప్రాంతం ఉన్నప్పటికీ లేదని చెబుతూ అభ్యంతరం వ్యక్తం చేసిన వారిపై దాడులకు దిగుతున్నారని చెప్పినట్లు తెలిసింది. ఈ అంశాన్ని రైతులు గురువారం వ్యక్తం చేయగా, ప్రపంచబ్యాంకు ప్రతినిధులు ఏడుగురు ముంపునకు గురయ్యే ప్రాంతాలను శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

ఆర్‌ఎస్‌ఎస్ భారత్ పాలిట రాచపుండే

• ఆ వ్యాఖ్యలు వెనక్కి తీసుకునే ప్రసక్తే లేదు
• తుషార్ గాంధీ



కోచి : భారత్ పాలిట రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) రాచపుండేనని మహాత్మాగాంధీ మనుమడు తుషార్ గాంధీ శుక్రవారం పునరుద్ఘాటించారు. ఈ వ్యాఖ్యలకు తానేమీ చింతించడం లేదని, క్షమాపణలు చెప్పాల్సిన అవసరమే లేదని ఆయన తేల్చిచెప్పారు. 'నేనన్నదానికి క్షమాపణలు చెప్పాలని వారు కోరుకుంటున్నారు. నా ప్రకటనను వెనక్కి తీసుకోవాలని కోరుతున్నారు. కానీ నేనది చేయను. ఒకసారి అన్న తర్వాత దాన్ని వెనక్కి తీసుకోవడంలో లేదా క్షమాపణ చెప్పడంలో నాకు నమ్మకం లేదు' అని తుషార్ గాంధీ చెప్పారు. ఎర్నాకులంలోని అలువాలో యూనియన్ క్రిస్టియన్ కాలేజీలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వైకోమ్ సత్యాగ్రహంలో పాల్గొన్న తర్వాత మహాత్ముడు మార్చి 18, 1925న ఈ సంస్థను సందర్శించారు. ఆయన పర్యటన వందేళ్ళ వేడుకల సందర్భంగా కేంపస్‌లో నిర్వహించిన కార్యక్రమంలో తుషార్ ప్రసంగించారు. శివగిరి మాధమ్ వద్ద మహాత్ముడితో శ్రీ నారాయణ గురు సమావేశం శత వార్షికోత్సవం సందర్భంగా ఇచ్చిన ప్రసంగంలో తుషార్, ఆర్‌ఎస్‌ఎస్‌పై పైవ్యాఖ్యలు చేశారు. తిరువనంతపురం శివార్లలో ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి కార్యకర్తలు బుధవారం సాయంత్రం తుషార్ గాంధీని నిర్బంధించారు. క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సంఘటనతో దేశద్రోహులను ఎండగట్టాలన్న తన కృతనిశ్చయం మరింత బలోపేతమైందని ఆయన వ్యాఖ్యానించారు. పైగా, ప్రతిపక్షాన్ని కూడా గౌరవించే సంస్కృతి మలయాళీలదని, ఇక్కడ ప్రజల హక్కులు పరిరక్షించబడతాయని అటు వంటి కేరళలో ఇలాంటి సంఘటన జరగడం తనకు దిగ్భ్రాంతి కలిగించిందన్నారు. ఈ తరహా విషపూరితమైన ప్రజలను రాష్ట్రం నుండి బయటకు పంపించాలన్నారు. స్వాతంత్ర్య పోరాటం కన్నా మరింత ముఖ్యమైనది ఈ పోరాటమని ఆయన వ్యాఖ్యానించారు. మనందరికీ ఉమ్మడి శత్రువు వున్నారన్నారు.

డ్రోన్లతో గిరిజన గ్రామాలకు మందులు

• సంక్షేమం, అభివృద్ధి మాతోనే సాధ్యం
• గిరిజన సంక్షేమశాఖా మంత్రి సంధ్యారాణి

ప్రజాశక్తి-సాలూరు రూరల్ (పార్వతీపురం మన్యం జిల్లా)

రాష్ట్ర ప్రభుత్వం ఆధునిక టెక్నాలజీతో వ్యవసాయదారులకు ఉపయోగపడుతూ డ్రోన్‌ల ద్వారా మందులు, ఆహార సరఫరా చేయడం ప్రారంభమైందని, త్వరలో గిరిజన గ్రామాలకు డ్రోన్‌ల ద్వారా మందులు పంపిణీ చేపడతామని రాష్ట్ర స్త్రీ, శిశుసంక్షేమ గిరిజన శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి తెలిపారు. రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలు చేయాలన్న, సంక్షేమ పథకాలు సక్రమంగా ప్రజలకు అందాలన్నా టిడిపి కూటమి ప్రభుత్వం వల్లే సాధ్యమని అన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా సాలూరులోని తన క్యాంప్ కార్యాలయంలో ఆమె శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ వచ్చే నాలుగేళ్లలో రాష్ట్రం రూపు రేఖలు మారుతాయన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో రాష్ట్రంలో పెట్టుబడిదారులు ఒక్క కంపెనీ కూడా పెట్టడానికి సహసించలేదని, ఉన్న కంపెనీలను కూడా వైసిపి నాయకులు భయభ్రాంతులకు గురిచేసి పక్క రాష్ట్రాలకు వెళ్ళగొట్టే విధంగా కార్యక్రమాలు నిర్వహించారని అన్నారు. నేడు కూటమి ప్రభుత్వంలో సుమారు లక్షల కోట్లతో వివిధ రకాలైన కంపెనీలను స్థాపించేందుకు ముందుకు వచ్చారని చెప్పారు. సూపర్ సిక్స్ లో కార్యక్రమంలో భాగంగా ప్రతి పథకాన్ని అందించే బాధ్యత కూటమి ప్రభుత్వం తీసుకుంటుందని అందులో భాగంగానే వచ్చే విద్యా సంవత్సరం నుంచి తల్లికి వందనం కార్యక్రమం కింద పదిహేను వేల రూపాయలను అందిస్తామని తెలిపారు. వైసిపి నాయకుడు జగన్ ప్రతిపక్ష హోదా ఇస్తేనే అసెంబ్లీకి వస్తానని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజా సమస్యలపై పోరాడడానికి ఒక్కరు ఉన్నా అసెంబ్లీలో వచ్చి తన గొంతు వినిపించాలని అన్నారు. సమావేశంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు నిమ్మాది తిరుపతిరావు, ముఖి సూర్యనారాయణ, గుల్ల వేణుగోపాలరావు పాల్గొన్నారు.

రోబోకు అనుసంధానంగా ప్రత్యేక యంత్రాలు

• ఎస్ఎల్‌బిసి టన్నెల్‌లో కొనసాగుతున్న సహాయక చర్యలు

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో



ఎస్ఎల్‌బిసి టన్నెల్ ప్రమాద స్థలంలో సహాయక చర్యల వేగవంతానికి హైడ్రాలిక్ పవర్ రోబోకు అనుసంధానంగా ప్రత్యేక యంత్రాలను ఉపయోగిస్తున్నారు. 30 శాతం సామర్థ్యం గల లిక్విడ్ రింగ్ వాక్యూమ్ పంపు, వాక్యూమ్ ట్యాంకుతో కూడిన మెషిన్‌ను సమర్థవంతమైన సహాయక చర్యల కోసం పంపినట్టు అధికారులు వెల్లడించారు. ఈ యంత్రాలు మట్టిని త్వరగా తొలగించేందుకు, టన్నెల్ లోపల పనులను వేగవంతం చేయడానికి ఉపయోగపడతాయని తెలిపారు. డిజాస్టర్ అండ్ మేనేజ్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్ కుమార్, నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, జిల్లా ఎస్‌పి వైభవ్ గైక్వాడ్ రఘునాథ్ సహాయక బృందాల ఉన్నతాధికారులతో శుక్రవారం సమీక్షించారు. మాన్యువల్ డిగ్గింగ్‌కు బదులుగా అటానమస్ హైడ్రాలిక్ పవర్ రోబోను వినియోగిస్తున్నామని, ఇది అధునాతన సాంకేతికతతో టన్నెల్ లోపల డిగ్గింగ్ ప్రక్రియను నిర్వహిస్తోందని తెలిపారు. డిగ్గింగ్‌లో వచ్చే మట్టిని వేగంగా బయటకు తీయడానికి ఈ ప్రక్రియను ఏర్పాటు చేసినట్టు అధికారులు వివరించారు. వాక్యూమ్ ట్యాంకు ద్వారా వచ్చిన మట్టిని, గంటకు 620 క్యూబిక్ మీటర్ల బురదతో కూడిన మట్టిని కన్వేయర్ బెల్ట్ ద్వారా బయటకు తరలించొచ్చని తెలిపారు. అధునాతనమైన సాంకేతిక పరిజ్ఞానం గల యంత్రాల వినియోగం ద్వారా సహాయక చర్యలను మరింత సమర్థంగా, వేగంగా పూర్తి చేయడానికి సహాయపడుతుందని తెలిపారు.

అమెరికాలో ఏర్పేడు వాసిపై కాల్పులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

అమెరికాలోని మెమ్ఫిస్‌లో తిరుపతి జిల్లా ఏర్పేడు మండలం గోవింద వరం గ్రామానికి చెందిన పోతుగుంట మోహన్ సాయి అనే యువకునిపై ఈ నెల 9వ తేదీ ఆదివారం రాత్రి 11.30గంటల ప్రాంతంలో గుర్తు తెలియని దుండుగులు కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో మోహన్ సాయి తీవ్రంగా గాయపడ్డాడు. ప్రస్తుతం అతడు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇందుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. ఏర్పేడు మండలం గోవిందవరం గ్రామానికి చెందిన పోతుగుంట మురళి నాయుడు, అరుణ దంపతులకు మోహన్ సాయి ఏకైక కుమారుడు. ఈ దంపతులు ప్రస్తుతం శ్రీకాళహస్తిలో నివాసం ఉంటున్నారు. మోహన్ సాయిని చదువుల కోసం అమెరికాకు పంపారు. ఇటీవలే అతడు చదువు పూర్తి చేసుకుని ఉద్యోగ అన్వేషణలో ఉన్నాడు. ఇదిలా ఉండగా పోతుగుంట మోహన్ సాయి తన మిత్రుని కారులో వెళుతుండగా, గుర్తు తెలియని దుండుగులు కారును ఆపి ముందు సీట్లో కూర్చుని ఉన్న మోహన్ సాయిపై కాల్పులు జరిపాడు. దీంతో మోహన్ సాయి భుజం, చేతికి బుల్లెట్లు తగిలాయి. అయినప్పటికీ గాయాలతో ఉన్న మోహన్ వెంటనే కారును నడిపి హైలాండ్‌లోని వాలెరో గ్యాస్ స్టేషన్‌కు చేరుకొని 911కు కాల్ చేశాడు. అత్యవసర సేవలు అందించే వారు అక్కడకు చేరుకుని మోహన్ సాయిని ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అతని పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. కాగా గోఫండ్‌మీ.కామ్ ద్వారా సుజనా పరమ్ నుంచి మోహన్‌కు ఆర్థిక సహాయం అందుతోంది. ఈ ఘటనపై సమాచారం అందుకున్న శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి వెంటనే మోహన్ సాయి కుటుంబాన్ని వ్యక్తిగతంగా సంప్రదించారు.

ఎస్‌వియులో జర్మనీ భాష అభ్యసనా కేంద్రం ఏర్పాటుకు కసరత్తు

ప్రజాశక్తి–క్యాంపస్: శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఎస్‌వియు ఇంజనీరింగ్ కళాశాల "స్టడీ వింగ్స్ ఓవర్సీస్ సంస్థ" సహకారంతో జర్మనీ భాష అభ్యసన కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు వర్సిటీ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఉపకులపతి కార్యాలయంలో స్టడీ వింగ్స్ సంస్థ ప్రతినిధులు వర్సిటీ ఇన్‌ఛార్జ్ విసి అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విసి, రిజిస్ట్రార్‌లు మాట్లాడుతూ.. జర్మనీలో విద్యా, ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



గిరిజనులకు తప్పని డోలీ కష్టాలు

ప్రజాశక్తి- అనంతగిరి (అల్లూరి జిల్లా)

డోలీ మోత రహిత ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా తీర్చిదిద్దుతామని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మండలంలోని పినకోట పంచాయతీలో 2024 డిసెంబర్ 22న పర్యటించి రాచకీలం, గుమ్మంతి, దాయార్తి గ్రామాల బిటిరింగ్ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ పనులు చేపట్టక పోవడంతో రోగులకు డోలీ కష్టాలు వెంటాడుతూనే ఉన్నాయి. మండలంలోని పిన్నకోట పంచాయతీ రాచకిలం గ్రామానికి చెందిన సూకురు దేముడమ్మకు పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు గుమ్మంతి మట్టి రోడ్డు వరకు డోలీ సహాయంతో ఆమెను తీసుకొచ్చారు. అక్కడి నుంచి 108 అంబులెన్స్‌లో కె కోటపాడు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. రాసకిలం గ్రామం నుండి రెడ్డిపాడు వరకు సుమారు రూ.5 కోట్లతో బిటి రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఫారెస్ట్ అధికారుల అభ్యంతరంతో అనుమతులు లేవని రోడ్డు పనులు నేటి వరకు మొదలు కాలేదని గిరిజనులు తెలిపారు.



ప్రయివేటు ఆస్పత్రి నిర్వాకం.. ప్రాణాపాయ స్థితిలో యువకుడు

- ప్రమాదం జరిగి వారమైనా పట్టించుకోని పోలీసులు

ప్రజాశక్తి - జామి (విజయవాడ జిల్లా)

కొందరి ఆకతాయుల నిర్లక్ష్యం... ఓ ప్రయివేటు అస్పత్రి నిర్వాకం...పోలీసుల విధి నిర్వహణ లోపం వెరసి ఓ అమాయక యువకుడి ప్రాణాల మీదకు తెచ్చాయి. నిరుపేద కుటుంబానికి కంటి మీద కునుకు లేకుండా చేశాయి. జామి మండల కేంద్రానికి చెందిన బత్తుల గౌతం (21) ఎల్లారమ్మ జాతర రోజున రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. జామి దుర్గామాత గుడి సమీపంలోబైకుపై వెళుతున్న గౌతంను ఎదురుగా వస్తున్న మరో బైకు బలంగా ఢీకొంది. దీంతో గాయపడిన గౌతంను కుటుంబ సభ్యులు జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. కాలు విరిగినట్లు నిర్ధారించిన ప్రభుత్వ వైద్యులు ఇక్కడ ఆపరేషన్ చేయాలంటే ఐదు, ఆరు రోజులు పడుతుంది మీ ఇష్టం అని సెలవిచ్చారు. గత్యంతరం లేక నగరంలోని ఓ ప్రయివేటు అస్పత్రికి అదే రోజు రాత్రి తరలించారు. ఆపరేషన్ చేస్తామని, అంతా ఆరోగ్య శ్రీ తోనే అయిపోతుందని చెప్పారు. 9 తేదీ మధ్యాహ్నం ఆపరేషన్ గదిలోకి వెళ్లిన గౌతంను అపస్మారక స్థితిలో బయటకు తీసుకురావడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. గౌతం పరిస్థితిపై వైద్యులను ఆరా తీయగా, మత్తు ఎక్కువైందని, తగ్గించేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పుకొచ్చారు. పరిస్థితి విషమించడంతో అక్కడ నుంచి విశాఖపట్నం తరలించారు. గౌతం ఆరోగ్య పరిస్థితి పూర్తిగా ప్రాణాల మీదకు వచ్చిందని అక్కడ వైద్యులు చెప్పడం కుటుంబ సభ్యులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు.

పోలీసుల నిర్లక్ష్యం

ఈనెల 7న రోడ్డు ప్రమాదం జరిగితే, ఇప్పటి వరకు ప్రమాదానికి కారణమైన బైక్‌ను పోలీసులు పట్టుకోపోవడం, కేసు నమోదు చేయకపోవడం గమనార్హం. విజయనగరం ప్రభుత్వ అస్పత్రికి వెళితే... ఇక్కడ సమయం పడుతుందని గౌతంను పంపేయడంతో ప్రయివేటు అస్పత్రుల దోపిడీకి ఉతం ఇచ్చినట్లు అయ్యింది. పోనీ అక్కడైనా సరైన వైద్యం అందించారంటే, వారి నిర్లక్ష్యమే ప్రాణాల మీదకు తెచ్చిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఎస్ఐ వీరజనార్ధన్‌ను ప్రజాశక్తి వివరణ కోరగా, ప్రమాదం జరిగిన వెంటనే బాధితులు సరైన సమాచారం ఇవ్వలేదని, అందుకే కేసు నమోదు చేయడంలో జాప్యం నెలకొందని చెప్పారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు గౌతం పరిస్థితిపై విచారించి, ప్రాణాలు కాపాడాలని తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు

ప్రజాశక్తి- చోడవరం (అనకాపల్లి జిల్లా)

భూతగాదాలో ఓ వ్యక్తిని హత్య చేసిన కేసులో నిందితుడు నేమాలహరి సన్యాసిరావును పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. సిఐ పి.అప్పలరాజు తెలిపిన వివరాలు ప్రకారం.. చోడవరం బానయ్య కోనేరుకు చెందిన నేమాలహరి సన్యాసిరావుకు చోడవరం బాలాజీ నగర్‌కు చెందిన ఇందల సన్యాసిరావుకి మధ్య ఈ నెల 3వ తేదీ రాత్రి 9.30 గంటలకు తగాదా జరిగింది. ఈ నేపథ్యంలో ఇందల సన్యాసిరావును నేమాలహరి సన్యాసిరావు కొట్టడంతో సిమెంట్ రోడ్డుపై ఇందల పడి తీవ్రంగా గాయపడ్డారు. బాధితుడిని కెజిహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఈ నెల 12వ తేదీన పరిస్థితి విషమించి మరణించారు. దీంతో, నేమాలహరి సన్యాసిరావుపై హత్య కేసు నమోదు చేసి అరెస్టు చేసి కోర్టుకు తరలించగా రిమాండ్ విధించినట్లు సిఐ తెలిపారు.

పాలకులకు పట్టని ఆదోని మెడికల్ కాలేజీ

- ఆగిన పనులు
- బడ్జెట్‌లోనూ లేని ప్రస్తావన

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి



ఆగిన మెడికల్ కళాశాల భవన నిర్మాణం

గత ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేయదలచిన వైద్య కళాశాలల్లో ఆదోని వైద్య కళాశాల ఒకటి. కళాశాల నిర్మాణ పనులు మధ్యలో ఆగిపోయాయి. దీంతో కర్నూలు జిల్లా వాసుల కల ఆగిపోయింది. కూటమి ప్రభుత్వం ఆ కళాశాల నిర్మాణ పనులపై శ్రద్ధ పెట్టడం లేదు. రాష్ట్ర బడ్జెట్‌లోనూ దాని ప్రస్తావన లేకపోవడంతో ఇప్పట్లో నిర్మాణాన్ని చేపట్టే ఆలోచన లేనట్లు కనిపిస్తోంది. దీనిపై పలు ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాల నుంచి ఆగ్రహం వ్యక్తం అవుతోంది...

కర్నూలు జిల్లా కేంద్రానికి ఆదోని పట్టణం వంద కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈ ప్రాంతంలో ఏవైనా ప్రమాదాలు జరిగినా అత్యవసర వైద్య సేవలు కావాలన్నా కర్నూలు వెళ్లాల్సి వస్తోంది. లేదంటే బళ్లారి, రాయచూర్ వెళ్లాల్సి ఉంటుంది. ఆదోని పట్టణంలోనే వైద్య కళాశాల ఏర్పాటు చేస్తే ఆలూరు, ఆదోని, కోసిగి, కౌతాళం, పత్తికొండ, ఎమ్మిగనూరు, మంత్రాలయం తదితర ప్రాంతాల ప్రజలకు ఎంతో దగ్గరగా ఉంటుంది. మెరుగైన సేవలు పొందటానికి వీలుగా ఉంటుంది. 2021 మే 31న రాష్ట్ర వ్యాప్తంగా 14 వైద్య కళాశాలలకు వర్చువల్ విధానంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఆదోని శివారులో ఎమ్మిగనూరు వెళ్లే మార్గంలో అరేకల్ వద్ద వైద్య కళాశాల పనులకు శ్రీకారం చుట్టారు. 58 ఎకరాల విస్తీర్ణంలో వంద మెడికల్ సీట్లు, 450 పడకల సామర్థ్యంతో రూ.475 కోట్ల వ్యయంతో నిర్మిస్తామని ప్రకటించారు. 2023 చివరి నాటికి మెడికల్ కాలేజీని అందుబాటులోకి తీసుకు వస్తామని ప్రభుత్వం అట్టహాసంగా ప్రకటించింది. మూడేళ్లు గడిచినా ఇప్పటి వరకూ వైద్య కళాశాల నిర్మాణ పనులు పూర్తి కాలేదు. వైద్య కళాశాలకు సంబంధించి ఒక బ్లాకు మూడు ఫ్లోర్లు శ్లాబ్ వరకు పూర్తయింది. మరో బ్లాకు రెండు ఫ్లోర్లు శ్లాబ్ వరకు పూర్తయింది. బాలికల హాస్టల్ ఆరు ఫ్లోర్లు, బాలుర హాస్టల్ రెండు ఫ్లోర్లు శ్లాబ్ పనులు పూర్తయ్యాయి. కిచెన్ పనులు ఇంకా బేస్‌మెంట్ స్థాయిలోనే ఉన్నాయి. అత్యవసర విభాగం, ఇఎస్ఎస్ 1, 2 పనులు కూడా ఇంకా బేస్‌మెంట్ స్థాయిలోనే ఉన్నాయి. కొత్తగా వచ్చిన కూటమి ప్రభుత్వం ఆదోని వైద్యశాల నిర్మాణ పనులు ఆపేసింది. ఆదోని వాసుల కలగా ఉన్న వైద్య కళాశాల నిర్మాణ పనులు ఆపేయడంపై పలు ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలు, స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ప్రవేశపెట్టన రాష్ట్ర బడ్జెట్‌లోనూ ఆదోని వైద్య కళాశాలకు నిధులు కేటాయించలేదు. అసలు ప్రస్తావన కూడా చేయలేదు. దీంతో ఇక ఆదోని వైద్య కళాశాల ఆగిపోయినట్లేనని చర్చ సాగుతోంది. పబ్లిక్ ప్రయివేటు పార్టనర్‌షిప్ (పిపిపి) విధానంలో ఆదోని వైద్య కళాశాల పనులు చేపట్టాలని టిడిపి ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలుస్తోంది. "ఆదోని వైద్య కళాశాల నిర్మాణ పనులను తాత్కాలికంగా మాత్రమే ఆపేయాలని ఉత్తర్వులు ఇచ్చారు. పిపిపి విధానంలో నిర్మాణ పనులు చేపట్టాలని ప్రభుత్వం ఆలోచిస్తోంది. దానిపై ఇంకా చర్చ జరుగుతోంది. ప్రభుత్వం నుంచి వచ్చే ఉత్తర్వుల ఆధారంగా నిర్మాణ పనులు కొనసాగుతాయి.' అని ఎపిఎంఎస్ఐడిసికి చెందిన ఒక అధికారి తెలిపారు.



అడవులు ఆహుతి

- పట్టించుకోని అటవీశాఖ అధికారులు

ప్రజాశక్తి-నంబులపూలకుంట

అనంతపురం జిల్లా నంబులపూలకుంట మండలంలోని అడవులు అగ్నికి ఆహుతి అవుతున్నాయి. వేసవి కాలంలో అడవులు అగ్నికి ఆహుతి అవుతున్నాయి. గుర్తుతెలియని వ్యక్తులు అకాతాయిలు అడవులకు నిప్పు పెట్టుటుండటంతో అటవీసంపద ఆహుతి అవుతోంది. అవగాహన కల్పించాల్సిన అటవీశాఖ అధికారుల నిర్లక్ష్యం వహిస్తూ గ్రామాల వైపు కన్నెత్తి చూడటం లేదని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. గుర్తుతెలియని వ్యక్తులు అడవులకు చిన్నచిన్న గుట్టలకు నిప్పు పెట్టడం వల్ల దగ్గర్లో ఉన్న పంటలు, గడ్డివాములు అగ్నికి ఆహుతి అవుతున్నాయి. మండల పరిధిలోని బందారుచెట్లపల్లి వద్ద బుధవారం గుర్తు తెలియని గుట్టలకు నిప్పు పెట్టారు. దీంతో సమీపంలో పంటలు సాగు చేసుకుంటున్న రైతులు తమ పంటకు మంటలు వ్యాపిస్తాయన్న ఆందోళనతో మంటలు ఆర్పడానికి నానాపాట్లు పడుతున్నారు. గురువారం ఉదయం తొమ్మిది గంటల సమయంలోనే మర్రికోమదిన్నె గ్రామ సమీపంలో గుట్టకు గుర్తుతెలియని అగంతకులు నిప్పు పెట్టడంతో పెద్ద ఎత్తున మంటలు ఎగసి పడ్డాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అడవులు అగ్నికి ఆహుతి కాకుండా చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వరంగ బ్యాంకుల్లో సిబ్బంది కొరత

- ఎస్‌బిఐ ఎస్‌యుఎపి ప్రధాన కార్యదర్శి ఎల్.చంద్రశేఖర్

ప్రజాశక్తి-గండేపల్లి (కాకినాడ జిల్లా)

ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో సిబ్బంది కొరత వల్ల ఖాతాదారులకు పూర్తిస్థాయి సేవలందించలేకపోతున్నామని, ఎస్‌బిఐ ఎస్‌యుఎపి ప్రధాన కార్యదర్శి ఎల్.చంద్రశేఖర్ అన్నారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్టాఫ్ యూనియన్ తుని రీజియన్ కమిటీ సమావేశం శుక్రవారం కాకినాడ జిల్లా గండేపల్లి మండలం నీలాద్రిరావుపేట గ్రామ శివారు పరిణయ ఫంక్షన్ హాల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎస్‌బిఐ ఎస్‌యుఎపి, యునైటెడ్ ఫార్మ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్ కన్వీనర్ ఎల్.చంద్రశేఖర్, యూనియన్ అమరావతి సర్కిల్ ప్రెసిడెంట్ ఆర్.నరేంద్ర కుమార్, వైస్ ప్రెసిడెంట్ పేరి శాస్త్రి, డిప్యూటీ జనరల్ సెక్రటరీ బి.పాపారావు, ఎజిఎస్ కె.శ్రీనివాసరావు, ఎజిఎస్ జెఎస్.చంద్రశేఖర్, తుని రీజియన్ అధ్యక్షులు ఎల్.విజయబాబు హాజరయ్యారు. ముందుగా ఆదిత్య ఆసుపత్రి నుంచి ర్యాలీగా ఫంక్షన్ హాలుకు తీసుకువచ్చారు. ఈ సమావేశంలో సభ్యుల సమస్యలు, ఇబ్బందులు బ్రాంచ్ లోకల్ సెక్రటరీల ద్వారా తెలుసుకున్నారు. ఈ నెల 24, 25 తేదీల్లో తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రెండు రోజులపాటు బ్యాంకులు బంద్ చేపడుతున్నట్లు తెలిపారు. ఈ బంద్‌కు ఖాతాదారులు సహకరించాలని కోరారు. తుని రీజియన్ ఇన్‌ఛార్జిగా విధులు నిర్వహిస్తున్న క్రొవ్విడి శ్రీనివాసరావును రిటైర్‌మెంట్ సందర్భంగా ఘనంగా సన్మానించారు.

టమోటా ధర పతనం!

- గిట్టుబాటు కాక రైతుల గగ్గోలు
- గత్యంతరం లేక, వచ్చిన రేటుకే అమ్మకాలు
- కూలి, రవాణా ఖర్చులైనా రావడం లేదని ఆవేదన

ప్రజాశక్తి -భీమునిపట్నం (విశాఖ)



టమోటా ధరలు భారీగా పతనం కావడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. నియోజకవర్గం పరిధిలోని భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల్లో టమోటాను సాగుచేస్తుండగా, సీజన్‌లో పండించిన టమోటాలకు కనీస ధర గిట్టుబాటు కాకపోవడంతో పెట్టుబడులు మాట పక్కన పెడితే, ఏరివేత కూలీలు, రవాణా ఛార్జీలైనా రావడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. భీమిలి మండలం మజ్జిపేట, దాకమర్రి, తాటితూరు, లక్ష్మీపురం, కృష్ణంరాజు పేట, ఆనందపురం మండలం ఆనందపురం, గొట్టి పల్లి, చందక, పద్మనాభం మండలం కొత్త కొవ్వాడ, పాత కొవ్వాడ, అనంతవరం తదితర 200 పైచిలుకు ఎకరాల్లో టమోటాను రైతులు సాగుచేస్తున్నారు.

ఏటా పెరుగుతున్న పెట్టుబడులు

టమోటా సాగుకు ఏటా పెట్టుబడులు పెరుగుతున్నా, సీజన్‌లో సరైన ధరమాత్రం రావడం లేదని రైతులు అంటున్నారు. ఎకరా పంట సాగుకు రూ.50 వేలు దాకా ఖర్చవుతోందని, దుక్కులు, గొప్పులు, ఇతర సాగు పనులతోపాటు, ఎరువులు, నీటియాజమాన్యం, ఇతర సాగు అవసరాలకు పెట్టుబడుల ఖర్చు ఏయేటికాయేడు పెరుగుతున్నాయన్నారు.

గిట్టుబాటు కాని ధరతో టమోటా రైతు సతమతం

టమోటా పంట ధర ఒక్కసారిగా తగ్గిపోవడంతో గిట్టుబాటు కావడం లేదని రైతులు అంటున్నారు. ఇంటిల్లిపాది శ్రమించడంతోపాటు కూలీల ఖర్చులను పెట్టి, పండిన టమోటాలను ఏరి, ప్లాస్టిక్ కెట్లలోనూ, గోనెసంచుల్లో వేసి, ఉదయం ఆరుగంటలలోపే ఆటోల్లో మార్కెట్‌కు చేరవేస్తున్నారు. ఇంతగా వ్యయప్రయాసల కోర్చి పండిన టమోటాలను మార్కెట్‌కు తీసుకెళుతుండగా, ఒక్కోరోజు కొనే దిక్కు లేకుండా పోతోందని,ప్రస్తుత సీజన్‌లో కొనుగోలు చేసినా కిలో రూ.ఆరేడుకు మించి ఇవ్వడం లేదని రైతులు వాపోతున్నారు. కిలో రూ.15 నుంచి రూ.20 వరకు పలికితేనే, లాభాల మాట పక్కనపెడితే, పెట్టుబడులు వచ్చే పరిస్థితి ఉన్నా, అదెక్కడా కానరావడం లేదు.

దోచేస్తున్న దళారులు

ఇక ప్రైవేట్ మార్కెట్‌లో దళారులతో కొద్దిమంది వ్యాపారులు కుమ్మక్కై ధర నిర్ణయం, కొనుగోళ్లలో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ, రైతులను ముంచేస్తున్నారనే ఆరోపణలున్నాయి. సిండికేట్టుగా మారి మార్కెట్‌లో రైతులను మభ్యపెట్టి కిలో రూ 6లు, రూ.7లకు కొనుగోలు చేసి, మార్కెట్‌లో నాలుగైదింతల ధరలకు అమ్ముకుంటూ దోచుకుంటున్నారని టమోటా రైతులు ఆవేదన చెందుతున్నారు. టమోటాలను నిల్వ ఉంచే వీలు, అవకాశం లేకపోవడంతో వచ్చిన ధరకు వదిలించు కోవడం తప్ప మరోమార్గం లేదని వాపోతు న్నారు. ఏటా సీజన్‌లో ఇదే పరిస్థితి నెలకొంటున్నా ప్రభుత్వపరంగా టమోటా రైతులను ఆదుకునే చర్యలు చేపట్టడం లేదని ఆందోళన వ్యక్తమౌతోంది.

టమోటా విక్రయాలకు చర్యలు

షేక్ యాసిన్, అసిస్టెంట్ డైరెక్టర్, వ్యవసాయ మార్కెటింగ్ శాఖ,

మార్కెట్ ఇంటర్వెన్షన్ అమలులో భాగంగా టమోటా అమ్మకాలకు చర్యలు తీసుకుంటున్నాం. జిల్లాలోని 13 రైతు బజార్లలో రైతుల అభీష్టం మేరకు గుర్తింపు కార్డులతో సంబంధం లేకుండా కిలో రూ.13 చొప్పున టమోటాలను అమ్ముకునే అవకాశం కల్పించాం. ధర గిట్టుబాటు కాకుంటే ప్రయివేటు మార్కెట్‌లోనూ అమ్ముకునే సౌలభ్యం రైతులకు ఉంది. ఏవైనా సమస్యలుంటే సమీప ఉద్యానశాఖ అధికారులను రైతులు సంప్రదించాలి.

బెల్ట్ షాపులను తొలగించండి

- మహిళల ఆందోళన
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేయాలని నిర్ణయం

ప్రజాశక్తి- ఆనందపురం (విశాఖ జిల్లా)

గుడి, బడి అనే తేడాలేకుండా గ్రామంలో ఇష్టారాజ్యంగా బెల్ట్ షాపులను ఏర్పాటు చేసి, మద్యం అమ్మకాలు చేస్తున్నారని ముచ్చర్ల మహిళలు ఆవేదన చెందుతున్నారు. వెంటనే గ్రామంలోని మద్యం బెల్ట్ షాపులను తొలగించే చర్యలు చేపట్టాలని వేడుకున్నారు. ఇష్టారాజ్యంగా మద్యం అమ్మకాలతో గ్రామస్తులు, ముఖ్యంగా మహిళలు ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. నీళ్లకుండీలు, శొంఠ్యాంలోని మద్యం దుకాణాల నుంచి మందుబాటిళ్లను తీసుకొచ్చి ముచ్చర్లలో మూడుచోట్ల బాహాటంగా అమ్మకాలు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఏడాదికి రూ.3.30 లక్షలను చెల్లించేలా ఒప్పందం జరగడంతో గ్రామంలోని రచ్చబండ, రామాలయం, పాఠశాల వద్ద మూడు చోట్ల బెల్ట్‌షాపులను ఏర్పాటు చేసి, ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే రూ.50 వరకు అధిక ధరకు అమ్ముతూ మందబాబుల జేబులు గుల్ల చేస్తున్నారని ఆంటున్నారు. గ్రామంలోనే విచ్చలవిడిగా మద్యం దొరుకుతుండడంతో మందుబాబుల ఆగడాలతో ఇబ్బందులు పడుతున్నామని అంటున్నారు. దీనికితోడు గ్రామంలోని కోళ్లు, మేకలను దొంగతనాలు కూడా జరుగుతున్నాయని వాపోతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి, ముచ్చర్లలోని మద్యం బెల్ట్‌దుకాణాలను తొలగించే చర్యలు చేపట్టాలని మహిళలు కోరుతున్నారు. దీనిపై జిల్లా కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేయాలని నిర్ణయించారు.

ప్రతి ఎకరాకూ సాగునీరు

- తుంగభద్ర ప్రాజెక్టు హైలెవెల్ కెనాల్ ఛైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె (వైఎస్ఆర్ జిల్లా)

వైఎస్ఆర్ జిల్లా పులివెందుల నియోజకవర్గంలోని ప్రతి ఎకరాకూ సకాలంలో సాగు నీటిని విడుదల చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తుంగభద్ర ప్రాజెక్టు హైలెవెల్ కెనాల్ ఛైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి పేర్కొన్నారు. వేంపల్లె మండలంలోని గిడ్డంగివారిపల్లె పంపు హౌస్ నుంచి టి.వెలమవారి పల్లె చెరువుకు శుక్రవారం నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి విడుదల ద్వారా భూగర్భ జలాలు పెరిగి రైతుల బోర్లకు నీరు సమృద్ధిగా లభిస్తుందని చెప్పారు. గత ప్రభుత్వంలో పంపు హౌస్‌లో ఉన్న 5 మోటర్లలో 3 మోటర్లు మరమ్మతులకు గురయ్యాయని చెప్పారు. ప్రస్తుతం రెండు మోటర్లు మాత్రమే పనిచేస్తున్నాయని త్వరలో వాటిని కూడ మరమ్మతు చేయిస్తామని చెప్పారు. ప్రభుత్వం దష్టికి తీసుకెళ్లి పంపు హౌస్‌లో మోటర్లు మెయింటినెన్స్‌కు అవసరమైన ప్రత్యేక నిధులు ఏర్పాటు చేస్తామని చెప్పారు. వేసవిలో నీటి విడుదల వల్ల సాగునీటికి, తాగునీటికి ఇబ్బందులు తొలిగి పోతాయని చెప్పారు. కూటమి ప్రభుత్వం పాలనలో పంటలు ఎండిపోకుండా ఉండేందుకు నీటిని విడుదల చేసినట్లు చెప్పారు.



కెనడా ప్రధానిగా కార్నీ ప్రమాణం

ఒట్టావో : కెనడా నూతన ప్రధానమంత్రిగా మార్క్ కార్నీ (59) పదవీ స్వీకార ప్రమాణం చేశారు. అమెరికాతో వాణిజ్య యుద్ధం, ట్రంప్ నుంచి విలీన ముప్పు, ఫెడరల్ ఎన్నికలు వంటి సవాళ్ల నేపథ్యంలో 24వ ప్రధానిగా ఆయన బాధ్యతలు స్వీకరించారు. కెనడా గవర్నర్ జనరల్ మేరీ సైమన్ సమక్షంలో కార్నీ ప్రమాణం చేశారు. ప్రధాని పదవికి రాజీనామా చేస్తున్నట్లు జస్టిన్ ట్రూడో ఈ ఏడాది జనవరిలో ప్రకటించిన నేపథ్యంలో అధికార లిబరల్ పార్టీకి కొత్త సారథి ఎన్నిక అనివార్యమైంది. ఈ క్రమంలోనే పార్టీలో జరిగిన ఎన్నికల్లో కార్నీ ఘన విజయం సాధించారు. గతంలో బ్యాంక్ ఆఫ్ కెనడా, బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్‌కు గవర్నర్‌గా పనిచేసిన ఆయన ఎన్నడూ ఏ ఎన్నికల్లోనూ పోటీ చేయలేదు. కేబినెట్‌లో పనిచేసిన అనుభవం కూడా లేదు. ఈ నేపథ్యంలో కెనడా నూతన ప్రధానిగా బాధ్యతలు చేపట్టడం గమనార్హం.

'ఇ-శ్రమ్'లో ఉపాధి వేతనదారులు అంతంతే

- 23 శాతమే నమోదు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అసంఘటితరంగ కార్మికుల ప్రయోజనం కోసం ఏర్పాటు చేసిన ఇ-శ్రమ్ పోర్టల్‌లో ఉపాధి వేతనదారుల వివరాల నమోదు అంతంత మాత్రంగానే ఉంది. ఉపాధి పథకంలో 97,25,359 మంది క్రియాశీల వేతనదారులు ఉండగా, వీరిలో ఇ-శ్రమ్ పోర్టల్‌లో నమోదైన వారి సంఖ్య కేవలం 22,60,754 మాత్రమే. క్రియాశీల వేతనదారుల్లో 23.24 శాతం మందే తమ పేర్లు నమోదు చేసుకున్నట్లు ఎన్ఆర్ఇజిఎ సాఫ్ట్ పోర్టల్ వివరాలు ఉన్నాయి. ఉపాధి పథకంలో పేర్లు నమోదు చేసుకున్న వేతనదారులు 1.21 కోట్ల మంది మన రాష్ట్రంలో ఉన్నారు. కొందరు క్రమంగా పనులకు హాజరు కాకపోవడంతో వారి సంఖ్యను పరిగణలోకి తీసుకోలేదని అధికారులు చెబుతున్నారు. కార్మికశాఖ ప్రకటించిన పథకాల వల్ల లబ్ధిపొందాలంటే వేతనదారులు ఇ-శ్రమ్‌లో వారి వివరాలను నమోదు చేసుకోవాల్సి ఉంది. ప్రమాద బీమా, పెన్షన్, తదితర ప్రయోజనాలను ఇ - శ్రమ్‌లో నమోదు చేసుకున్న వారికి కల్పిస్తామని ఆ శాఖ చెబుతోంది. రాష్ట్రంలో బాపట్ల జిల్లాలో ఉపాధి వేతనదారులు అధిక సంఖ్యలో 2,91,861 మంది నమోదు చేసుకున్నారు. తరువాతి స్థానంలో అనకాపల్లి జిల్లాలో 2,19,225 మంది నమోదయ్యారు. అత్యల్పంగా సత్యసాయి జిల్లాలో 4,779 మందే నమోదయ్యారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో 5,019 మంది, కోనసీమలో జిల్లాలో 8,073 మందిగా ఈ సంఖ్య ఉంది. ఉపాధి పథకంలో వేతనదారుల వివరాలు నమోదు చేయడంలో మండల స్థాయి అధికారులు సరైన శ్రద్ధ తీసుకోకపోవడమే సభ్యుల సంఖ్య తక్కువ కావడానికి కారణమనే విమర్శలున్నాయి.

రాష్ట్రంలో ఈ పథకం కింద కోటి మంది అసంఘటిత కార్మికుల వివరాలు నమోదు చేయాలని కార్మికశాఖ లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటి వరకూ వివిధ రంగాలకు చెందిన 83.18 లక్షల మంది కార్మికులు వారి పేర్లు నమోదు చేసుకున్నారు. వీరిలో వ్యవసాయ కూలీలే అత్యధిక సంఖ్యలో 55.84 లక్షల మంది ఉన్నారు. ఉపాధి పథకంలో పనిచేస్తున్న వేతనదారులు వీరిలో లేకపోవడంతో సంక్షేమ పథకాలు పొందే అవకాశం కోల్పోతున్నారు.

యంత్రాలతో ఉపాధి పనులు

- కూలీలతో చేయించినట్లు బిల్లులు
- బాధ్యులపై చర్యలు తీసుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి - పార్వతీపురం

పార్వతీపురం మన్యం జిల్లాలో ఉపాధి పనుల్లో అధికారులు కొత్తరకం అవినీతికి తెరతీస్తున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు తెలిపారు. శుక్రవారం స్థానిక సుందరయ్య భవన్‌లో విలేకర్లతో గంగు నాయుడు మాట్లాడారు. మక్కువ మండలం వెంకట బైరిపురంలో ఫారం ఫండ్‌ను, ఇంకుడు గుమ్మిలను ఉపాధి కార్మికులతో తవ్వించకుండా, యంత్రాల (జెసిబి)తో గోతులు తవ్వి ఉపాధి కార్మికులు తవ్వినట్లు బిల్లులు చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నారని అన్నారు. వెంకట బైరిపురంలో దళితులు, గిరిజనులు, పేదలకు ఉపాధి పనులు ఇవ్వకపోవడంతో వలసలు వెళ్లి పోవడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కార్మికులు చేయలేని పనులిచ్చి ఆ పనులను ఉపాధి అధికారులు, రాజకీయంగా పలుకుబడి ఉన్న వారికి యంత్రాలతో పనులు చేయించి కార్మికులు చేసినట్లు బిల్లులు చెయ్యడానికి చూస్తున్నారని అన్నారు. వెంటనే డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ సమగ్ర దర్యాప్తు చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే జియ్యమ్మవలస మండలంలో బిటి రోడ్డు పనుల్లో సరైన గ్రావెల్ వాడడం లేదని చెప్పారు. మండలంలో గల తుంబలి వద్ద మట్టి తీసుకొచ్చి పెదమేరంగి నుంచి బాసంగి-గడబవలస రోడ్డుకు, బిజె పురం నుంచి లోతువానివలస రోడ్డుకు వేశారని తెలిపారు. కాంట్రాక్టర్లు తమ ఇష్టానుసారం మట్టి వేసి రోడ్డు పనులు చేస్తుంటే ఉపాధి, జిల్లా మైనింగ్ అధికారులు కానీ కనీసం పట్టించుకోవడం లేదన్నారు. మక్కువ మండలం దబ్బగెడ్డ అటవీ భూమిలో అక్రమ మైనింగ్ చేసి రోడ్డుకు వేశారని, అలాగే జియ్యమ్మవలస మండలంలో ఆవుల్లేని వారికి గోశాలలు మంజూరు చేశారని చెప్పారు. ఇలా ప్రతి జిల్లాలో ఉపాధి అధికారులు అవినీతికి తెరలేపుతున్నారని చెప్పారు. అవసరమైన కూలీలకు ఉపాధి పనులు కల్పించడం లేదని, వీటన్నింటిపై సమగ్ర దర్యాప్తు చేసి బాధ్యులపై చర్యలు తీసు కోవాలని, పని అడిగిన ఉపాధి కూలీలందరికీ పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఉపాధి కూలీలను కదిలించి ఆందోళన చేస్తామని గంగు నాయుడు హెచ్చరించారు.

రాష్ట్రానికి మరిన్ని పరిశ్రమలు

- భారీ పరిశ్రమల శాఖ మంత్రి టిజి. భరత్

ప్రజాశక్తి తాడిపత్రి

చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రానికి మరిన్ని భారీ పరిశ్రమలు రాబోతున్నాయనిభారీ పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ పేర్కొన్నారు. తాడిపత్రి ఎమ్మెల్యే జెసి అస్మిత్ రెడ్డి నివాసంలో జరిగిన ఓప్రయివేటు కార్యక్రమానికి శుక్రవారం హాజరైన మంత్రి, ఎమ్మెల్యే ఆస్మిత్ రెడ్డితో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం వచ్చిన కేవలం తొమ్మిది నెలల్లో రాష్ట్రానికి రూ. ఎనిమిది లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయన్నారు. ఇదివరకే ఉమ్మడి అనంతపురం జిల్లాకు వచ్చిన కొన్ని ప్రాజెక్టుల సమస్యలు తొలగిపోయి వాటి పనులు ప్రారంభమయ్యాయనిఅన్నారు. కేవలం తొమ్మిది నెలల్లో రూ. ఎనిమిది లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయంటే దీనికి చంద్రబాబు విజనే కారణం అని అన్నారు. రాష్ట్రానికి వచ్చిన ప్రతి భారీ పరిశ్రమకు ఒక ప్రత్యేక అధికారి నియమించి సమస్యలు రాకుండా చూడాలని చంద్రబాబు చెప్పారని మంత్రి ఈసందర్భంగా తెలిపారు. తమ ప్రభుత్వంలో ఖచ్చితంగా 20 లక్షల ఉద్యోగాలు ఇచ్చి తీరుతామన్నారు. తాడిపత్రిలో గ్రానైట్ ఫ్యాక్టరీలు ఎందుకు మూతపడ్డాయో విచారించి, ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటామని అన్నారు.



కలుషిత నీరు తాగి మూగజీవాలు మృతి

రాయదుర్గం రూరల్ : రాయదుర్గం మండల పరిధిలోని కదరంపల్లి గ్రామంలో యూరియా కలిపిన నీరు తాగి శుక్రవారం ఎనిమిది గొర్రెలు, రెండు మేకలు మృతి చెందాయి. పశువైద్యాధికారి సూర్య నారాయణరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. కదరంపల్లికి చెందిన గోవిందు గొర్రెలు మేపుకుంటూ జీవనం సాగించేవాడు. ఇందులో భాగంగా శుక్రవారం ఉదయం కూడా మేపుకోసం గొర్రెలను పొలానికి తీసుకెళ్లాడు. ఈనేపథ్యంలో ఓ పొలంలో యూరియా కలిపిన నీరు తాగడంతో పలు గొర్రెలు అపస్మారక స్థితికి చేరుకున్నాయి. వెంటనే సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి చేరుకున్నట్లు పశువైద్యాధికారి తెలిపారు. అయితే అప్పటికే ఎనిమిది గొర్రెలు, రెండు మేకలు మృతిచెందినట్లు తెలిపారు. వెంటనే మిగిలిన వాటికి చికిత్స చేయడంతో ప్రాణాపాయం తప్పిందన్నారు. జీవాలు మృతితో రామన్నకు సుమారు రూ.లక్ష వరకూ నష్టం వాటిల్లిందన్నారు. జీవాలకు వైద్యం చేసిన వారిలో ఎహెచ్ఎలు మేఘన, రాఘవేంద్ర, దయానంద, తదితరులు ఉన్నారు.

టపాసుల గొడౌన్‌లో అగ్ని ప్రమాదం

ప్రజాశక్తి - నల్లచెరువు

సత్యసాయి జిల్లా స్థానిక దామోదర్ గ్రౌండ్ నెట్ ఫ్యాక్టరీలో అక్రమంగా నిల్వ ఉంచిన టపాసులు గోడౌన్ అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో దాదాపు ఐదు లక్షల రూపాయల ఆస్తి నష్టం జరిగిందని తెలుస్తోంది. ఈ గోడౌన్ పక్కనే నిల్వ ఉంచిన ఎనిమిది టన్నుల కర్బూజా కాయలు ఈ ప్రమాదంలో బాడిదపాలయ్యాయి. దీంతో తనకు రూ. 1.50 లక్షలు నష్టం వాటిల్లిందని చెరువు వాండ్లపల్లికి చెందిన చెందిన రామాంజనేయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాను ప్రతిరోజు బండి పైన కాయలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నానన్నారు. శుక్రవారం తమిళనాడు నుంచి ఎనిమిదిన్నర టన్నుల కర్బూజా రూ.1.50 లక్షలకు కొనుగోలు చేసి గోడౌన్‌లో నిల్వ ఉంచానన్నారు. టపాసుల గోడౌనపక్కనే కర్బూజా కాయలు ఉండడంతో ప్రమాదంలో మొత్తం కాయలు కాలిపోయాయన్నారు. సంబంధిత అధికారులు జరిగిన నష్టానికి పరిహారం ఇప్పించాలని కర్బూజా వ్యాపారి రామాంజనేయులు కోరుతున్నాడు.

పారదర్శకతకు పాతర

ప్రపంచంలోనే అత్యంత సంపన్నుడు ఎలన్ మస్క్‌కు చెందిన అమెరికన్ టెలికమ్యూనికేషన్స్ ప్రొవైడర్ స్టార్‌లింక్‌కు అడ్డంకులు తొలగిపోయాయి. భారత్‌లో దాని చొరబాటుకు లైన్ క్లియర్ అయింది. స్పెక్ట్రం వేలం స్థానంలో మోడీ సర్కారు 'నిర్వహణ కేటాయింపు'ను తీసుకురావటంతో స్టార్‌లింక్‌కు తలుపులు బార్లా తెరిచినట్లు అయ్యింది. దీనిపై మొన్నటి వరకు తీవ్ర వ్యతిరేకతను వ్యక్తం చేసిన భారతీయ దిగ్గజ టెలికాం కంపెనీలు ఎయిర్‌టెల్, జియోలు.. మోడీ దౌత్యంతో అదే కంపెనీతో భాగస్వాములుగా దోస్తీ కట్టాయి. భారత్‌లో స్టార్‌లింక్‌తో జతకట్టనున్నట్లు ప్రకటించాయి.

- 'స్పెక్ట్రం' వేలానికి ఫుల్‌స్టాప్
- 'నిర్వహణ కేటాయింపు'తో స్టార్‌లింక్‌కు లైన్ క్లియర్
- రెండు దేశీయ కంపెనీలతో కలిసి భారత్‌లోకి ప్రవేశం
- ప్రధాని మోడీ యుఎస్ పర్యటనతో మారిన పరిస్థితి

న్యూఢిల్లీ : భారత్‌లో ఎలన్ మస్క్ స్టార్ లింక్ ప్రవేశానికి అడ్డంకులు తొలగిపోయాయి. ఇందుకోసం మోడీ సర్కారు తీవ్రంగానే ప్రయత్నాలు చేసింది. మస్క్ కోసం భారత్‌లో ఎప్పటి నుంచో ఉన్న బహిరంగ, పారదర్శక స్పెక్ట్రం వేలంను దూరం పెట్టింది. దాని స్థానంలో 'నిర్వహణ కేటాయింపు'ను తీసుకొచ్చింది. దీంతో స్పెక్ట్రం పొందటం కోసం ఎలాంటి వేలమూ ఉండదు. తాను అనుకున్నవారికి కేటాయించే అవకాశం ప్రభుత్వానికి ఉంటుంది. దీంతో భారత్‌లో ప్రవేశానికి స్టార్‌లింక్‌కు దారులు తెరిచినట్టయ్యింది. ఈ విధానం పైన భారత్‌లోని అతిపెద్ద నెట్‌వర్క్ ప్రొవైడర్లు అయిన భారతీ ఎయిర్‌టెల్, రిలయన్స్ జియోలు తొలుత తీవ్ర వ్యతిరేకతను వ్యక్తం చేశాయి. ఫిబ్రవరిలో మోడీ యూఎస్ పర్యటన వరకూ ఇదే వాదనను వినిపించాయి. అయితే, మోడీ పర్యటన తర్వాత ఈ రెండూ కంపెనీలూ స్టార్‌లింక్‌తో జతకట్టటానికి ఓకే చెప్పటం గమనార్హం.

అనేక నెలలుగా సాగిన చర్చల తర్వాత ఇప్పుడు స్టార్‌లింక్ రాకకు ఈ రెండు నెట్‌వర్క్‌లు ఓకే చెప్పటం చర్చనీయాంశంగా మారింది. స్టార్‌లింక్ ఒక బలీయమైన పోటీదారు అని గతనెలలో భారతీ ఎయిర్‌టెల్ చైర్మెన్ సునీల్ మిట్టల్ ఒక ఇంటర్వ్యూలో తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. "ఉపగ్రహ ఆధారిత సేవలకు ప్రాధాన్యతనివ్వటాన్ని కచ్చితంగా తిరస్కరించాలి" అని కొన్ని నెలల క్రితం 'జియో' తన అభిప్రాయాన్ని తెలిపింది.

భారత టెలికాం నియంత్రణ సంస్థ(ట్రాయ్) ప్రకారం.. భారత్‌లో మొత్తం 94.5 కోట్ల మంది బ్రాడ్‌బాండ్ ఇంటర్నెట్ సబ్‌స్క్రైబర్లు, 118.9 కోట్ల మంది టెలిఫోన్ సబ్‌స్క్రైబర్లు ఉన్నారు. ప్రస్తుతానికి భారత్‌లో జియో, ఎయిర్‌టెల్‌లు సింహ భాగంతో మార్కెట్‌ను



శాసిస్తున్నాయి. భారత్‌లోని 81 శాతం మార్కెట్ ఈ రెండు టెలికాం సంస్థల చేతిలోనే ఉన్నదని తెలుస్తున్నది. భారత్‌లోకి స్టార్‌లింక్ సేవల రాకను వ్యతిరేకించే జియో, ఎయిర్‌టెల్ భయాలు సమర్థనీయమే. స్టార్‌లింక్ ద్వారా తమ మార్కెట్‌కు గండి పడుతుందన్నది వాటి భయం. ముకేశ్ అంబానీకి చెందిన జియో.. స్టార్‌లింక్‌ను ప్రధాన పోటీదారుగా చూసింది. గత రెండేండ్లుగా ప్రభుత్వం ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్లకు శాటిలైట్ స్పెక్ట్రమ్‌ను కేటాయించే విషయంపై ఆందోళన వ్యక్తం చేసింది.

భారత ఇంటర్నెట్ యూజర్లలో 40 శాతం మార్కెట్ షేర్‌తో దేశ మొబైల్ ఇంటర్నెట్ ప్రపంచంలో జియో తన ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తున్నది. ఇది భారత ప్రభుత్వం వేలం వేసిన భూసంబంధమైన స్పెక్ట్రమ్‌ను ఉపయోగిస్తున్నది. స్టార్‌లింక్ మాత్రం ఇంటర్నెట్ సేవలను అందించటానికి శాటిలైట్ స్పెక్ట్రమ్‌ను ఉపయోగిస్తున్నది. అయితే, భూసంబంధమైన ఇంటర్నెట్ ఆపరేటర్లు, శాటిలైట్ ఇంటర్నెట్ ఆపరేటర్ల మధ్య పోటీకి సంబంధించి 2023, జూన్‌లో జియో తన ఆందోళనను సైతం వ్యక్తం చేసింది. ఇందుకు స్టార్‌లింక్‌ను ఒక ఉదాహరణగా పేర్కొన్నది. వేలం ద్వారానే స్పెక్ట్రమ్‌ను పొందాలని వాదించింది. ఇది ప్రొవైడర్ల మధ్య సమతుల్య పోటీని నిర్ధారిస్తుందని వివరించింది. మోడీ ప్రభుత్వం మాత్రం వేలాలను రద్దు చేసి, టెలికమ్యూనికేషన్స్ చట్టం, 2023 ద్వారా ఉపగ్రహ స్పెక్ట్రం 'నిర్వహణ కేటాయింపు'ను అధికారికం చేసింది. అయినప్పటికీ, గతేడాది వరకూ జియో ఇదే వాదనను వినిపించింది.

స్టార్‌లింక్‌కు సానుకూలమయ్యే నిర్వహణ కేటాయింపును 2023, ఏప్రిల్ నుంచి ఎయిర్‌టెల్ సమర్థించింది. దీనర్థం.. భూసంబంధమైన ఇంటర్నెట్ సేవల ద్వారా 33 శాతం మార్కెట్‌ను కలిగి ఉన్న ఎయిర్‌టెల్.. స్టార్‌లింక్ వైపు ఉన్నట్టు కాదని నిపుణులు చెప్పారు. ఎందుకంటే.. స్టార్‌లింక్ నుంచి జియో ఎలాంటి ప్రమాదాన్ని ఎదుర్కొంటుందో ఎయిర్‌టెల్‌కు కూడా అదే ప్రమాదముంటుదన్నది ఆ సంస్థకు తెలుసని చెప్పారు. గతేడాది అక్టోబర్‌లో నిర్వహించిన ఒక కార్యక్రమంలో మిట్టల్ కీలక వ్యాఖ్యలు చేశారు. భారత మార్కెట్‌పై దృష్టిపెట్టిన శాటిలైట్ కంపెనీలు.. టెలికాం కంపెనీల వలెనే స్పెక్ట్రమ్‌ను కొనుగోలు చేయాలనీ, అంతే లైసెన్స్ ఫీజును చెల్లించాలని అన్నారు. అయితే, ఆ తర్వాతి రోజే ఆయన తన వ్యాఖ్యలకు క్లారిటీ ఇచ్చుకోవాల్సి వచ్చింది. తాము ఇప్పటికీ శాటిలైట్ స్పెక్ట్రమ్‌కు 'నిర్వహణ కేటాయింపు'ను కోరుకుంటున్నట్టు చెప్పారు. అయితే, గతేడాది నవంబర్ నుంచి మాత్రం జియో చెప్తున్న మాటలనే ఎయిర్‌టెల్ వినిపించటం గమనార్హం.

మోడీ పర్యటన తర్వాత మారిన సమీకరణాలు

భారత మార్కెట్‌లోకి స్టార్‌లింక్ రాకపై వ్యతిరేకతతో ఉన్న ఈ రెండు దేశీయ సంస్థలు... దానితో భాగస్వామ్యం ఎలా కుదిరిందన్నదానిపై మాత్రం వివరణ ఇవ్వలేదు. అయితే, ఫిబ్రవరిలో భారత ప్రధాని మోడీ యూఎస్ పర్యటన ఇందులో కీలక పాత్ర పోషించిందని ప్రపంచ మీడియా కథనాలు చెప్తున్నాయి. మోడీ తన పర్యటనలో వాషింగ్టన్‌లో ఎలన్ మస్క్‌తో, ఆ తర్వాత అతనితో కలిసి శ్వేతసౌధంలో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌తో సమావేశమైన విషయం విదితమే. దిగుమతులపై అధిక సుంకాలు విధిస్తున్నదని భారత్‌పై డోనాల్డ్ ట్రంప్ ఆరోపణల నేపథ్యంలో మస్క్ 'స్టార్‌లింక్'కు ఇది ఒక భారీ విజయమని మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

మస్క్ టెస్లా కోసం కోసం సుంకం తగ్గింపు

మస్క్ కోసం మోడీ ప్రభుత్వం గతంలోనూ సాయం చేసింది. అమెరికాలో డోనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం రావటానికి ముందు జనవరిలో ఈ-వాహనాలపై దిగుమతి సుంకాన్ని 70-100 శాతం నుంచి 15 శాతానికి తగ్గించింది. దీంతో భారత్ మార్కెట్‌లో ప్రవేశించటానికి ఎలన్ మస్క్‌కు చెందిన ఎలక్ట్రానిక్ వాహనాల కంపెనీ టెస్లాకు మోడీ సర్కారు మార్గం సుగమం చేసింది. దిగుమతి సుంకాన్ని తగ్గించటంతో భారత మార్కెట్‌లో ప్రవేశించటానికి మస్క్ కంపెనీ సమ్మతి తెలిపింది.

రాజకీయ ప్రత్యర్థుల అణచివేతకు కేంద్ర దర్యాప్తు సంస్థల దుర్వినియోగం

- సిపిఎం ఎంపి రాధాకృష్ణన్ విమర్శ



తిరువనంతపురం : కేరళ సహా దేశవ్యాప్తంగా రాజకీయ ప్రత్యర్థులను అణిచివేయడానికి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తోందని సిపిఎం ఎంపి కె రాధాకృష్ణన్ శుక్రవారం విమర్శించారు. కర్వువన్నూర్ కోపరేటివ్ బ్యాంక్‌లో అవకతవకలు జరిగాయంటూ నమోదైన కేసులో ఈ నెల 15న విచారణకు హాజరుకావాలంటూ రాధాకృష్ణన్‌కు ఇడి నోటీసులు జారీ చేసింది. దీనిపై ఆయన స్పందిస్తూ తనకు ఇచ్చిన నోటీసుల్లో ఆ కేసుకు సంబంధించిన వివరాలు లేవని, తన బ్యాంక్ ఖాతాలు, స్థిర, చరాస్తుల వివరాలు సమర్పించాల్సిందిగా కోరారని తెలిపారు. అయితే పార్లమెంట్ సమావేశాల కారణంగా విచారణకు హాజరుకాలేనని తాను లేఖ పంపినటుల తెలిపారు. సమావేశాల తరువాత విచారణకు హాజరవుతానని ఆయన చెప్పారు.

ఎన్ని కేసులు పెట్టినా..కేంద్రానికి తలవంచను : ఆప్ నేత సిసోడియా

న్యూఢిల్లీ : తనపై ఎన్నిక కేసులు పెట్టినా బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వానికి తల వంచనని ఆప్ సీనియర్ నాయకులు మనీష్ సిసోడియా స్పష్టం చేశారు. రూ.2 వేల కోట్ల క్లాస్ రూమ్ స్కామ్‌లో సిసోడియాకు వ్యతిరేకంగా ఎఫ్ఐఆర్ నమోదుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలిపిన నేపథ్యంలో ఆయన పై విధంగా స్పందించారు. సిసోడియాతో పాటు, సత్యేందర్ జైన్ ఎఫ్ఐర్ నమోదుకు రాష్ట్రపతి ఆమోదం తెలిపారు. ఆప్ ప్రభుత్వ పాలనలో వీరిద్దరూ మంత్రుగా ఉన్న సమయంలో ఢిల్లీ ప్రభుత్వ పాఠశాలల్లో తరగతి గదుల నిర్మాణంలో ఈ కుంభకోణం జరిగిందని ఆరోపణ. 'బిజెపికి, కేంద్ర ప్రభుత్వానికి నేను ఒకటి చెప్పాలనుకుంటున్నాను. మీకు ఇష్టమైనన్ని కేసులు నమోదు చేయండి. నాపై లేదా సత్యేందర్‌జైన్, అతిషి, కేజ్రీవాల్ లేదా ఏ ఇతర ఆప్ నాయకుడిపైనా అయినా సరే.. మేం మాత్రం బిజెపికి తలవంచం' అని సిసోడియా తెలిపారు. అలాగే ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఎప్పుడు నెరవేరుస్తారని బిజెపిని ఆయన ప్రశ్నించారు. 'హోలీ పండుగ కూడా వచ్చింది. మీరు ఇచ్చిన ఉచిత సిలిండర్లు ఎక్కడ ఉన్నాయి? మహిళలకు నెలకు రూ.2,500 హామీ ఏమైంది' అని సిసోడియా ప్రశ్నించారు.

ఈ ఏడాది 'మత్స్యకార భరోసా' ప్రశ్నార్థకం

(మొదటి పేజీ తరువాయి)

గుర్తించి, వారికి మాత్రమే అందించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఎన్నికల హామీ మేరకు పరిహారాన్ని రూ.10 వేలు నుంచి రూ.20 వేలకు పెంచి ఇవ్వనున్నట్లు ప్రకటించింది. ఒక్కో మత్స్య కారుడికి రూ.20 వేలు చొప్పున 1,22,968 మందికి రూ.245.94 కోట్లు కేటాయించినట్లు తెలిసింది.

అమల్లోకి డీజిల్ వాడకం నిబంధన

మత్స్యకార భరోసా చెల్లింపునకు గత వైసిపి ప్రభుత్వం 2023 నుంచి కొత్తగా డీజిల్ వాడకాన్ని మెలిక పెట్టింది. మత్స్యకారుల బోట్లకు ప్రభుత్వం ఏడాదికి లీటరుకు రూ.9 చొప్పున సబ్సిడీతో 300 లీటర్ల డీజిల్‌ను అందిస్తోంది. కనీసం వంద లీటర్లనూ వినియోగించని వారిని అనర్హులుగా గుర్తించాలని అధికారులకు సూచించింది. 2023 ఏడాదికి మినహాయింపు ఇచ్చినా 2024 నుంచి అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అధికారంలోకి వచ్చిన టిడిపి కూటమి ప్రభుత్వం దాన్ని అమలు చేయడంతో రాష్ట్ర వ్యాప్తంగా 18 వేల మంది మత్స్యకారులు అనర్హులుగా మారారు.

రూ.40 వేలు పరిహారం ఇవ్వాల్సిందే...

మత్స్యకారులకు రెండేళ్లు వేట నిషేధ పరిహారం ఇవ్వాల్సిందే. ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీ మేరకు ఒక్కో మత్స్యకారునికి రూ.40 వేలు అందించాలి. ప్రభుత్వం ఎగ్గొట్టడానికి ప్రయత్నిస్తే ఊరుకునేది లేదు.

- చింతల రాజులు, గెద్దలపాడు (శ్రీకాకుళం జిల్లా)

రానున్నది భారాల కాలం!

(మొదటి పేజీ తరువాయి)

నిర్దేశించడం విశేషం. విజయవాడ, విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్లు వసూలు చేస్తున్న వృత్తి పన్నును ఇకపై నేరుగా వాణిజ్య పన్నుల శాఖకు బదిలీ చేయాలని నిర్ణయించారు. ఇలా వృత్తి పన్ను ద్వారా రూ.400 కోట్లు వరకు వస్తాయని అంచనా వేస్తున్నారు. దీనిపై కూడా ప్రతిపాదనలు రాష్ట్ర ప్రభుత్వానికి చేరుకున్నాయని, త్వరలోనే అధికారిక ఉత్తర్వులు కూడా జారీ అవుతాయని అధికారులు చెబుతున్నారు.

స్థానిక సంస్థలు బలహీనం

ఇన్నాళ్లూ స్థానిక సంస్థలకు ఆదాయ వనరుగా ఉన్న వృత్తి పన్నును ఇకపై నేరుగా వాణిజ్య పన్నుల శాఖకు బదలాయిస్తే ఆ మేరకు ఆయా స్థానిక సంస్థలు బలహీనపడే ప్రమాదం కూడా ఉంటుందని భావిస్తున్నారు. ఇప్పటివరకు తమకు వచ్చే నిధులతో విశాఖ, విజయవాడల్లో కొన్ని అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇప్పుడు ఆ నిధులు ప్రభుత్వ ఖజానాకు నేరుగా వెళ్లిపోతే పరిస్థితి ఏమిటన్నది ప్రశ్నార్థకం. దీంతో ఈ లోటును భర్తీ చేసుకునేందుకు ఆయా కార్పొరేషన్లలో కొత్త పన్నులు వేసే ప్రమాదం కూడా ఉంటుందన్నది ఒక అంచనా.

నిలదొక్కుకున్నాం... టిడిపిని నిలబెట్టాం

(మొదటి పేజీ తరువాయి)

వేదిక కోసం కష్టపడిన పారిశుధ్య సిబ్బందికి ముందుగా ధన్యవాదాలు తెలిపారు .నాయకులు, కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు, ఆవిర్భావ దినోత్సవాన్ని ముందుండి నడిపిన మంత్రి నాదెండ్ల మనోహర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పవన్ కల్యాణ్ సోదరుడు నాగబాబు, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, 21 మంది ఎంఎల్ఎలు, ఇద్దరు జనసేన ఎంపిలు తదితరులు పాల్గొన్నారు.

అడక్కుండానే వరాలిచ్చే వాడు పవన్ : నాగబాబు

దేవుడు అడిగితేనే వరాలు ఇస్తాడని, పవన్ కల్యాణ్ అడగకుండానే వరాలిస్తాడని ఆయన సోదరుడు కె.నాగబాబు అన్నారు. తనకు ఎంఎల్‌సి ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. నోటి దురుసున్న నేతకు ప్రతిపక్ష హోదా కూడా దొరకలేదన్నారు. తర్వాత అధికారం మాదే అంటూ జగన్ కలలు కంటున్నారని విమర్శించారు. మరో 20 ఏళ్లు జగన్ కలలు కంటూనే ఉండాలని సలహా ఇచ్చారు.

రాష్ట్రానికే కాదు... దేశానికీ ఉపయోగపడేలా పవన్ ఎదగాలి : నాదెండ్ల మనోహర్

రాష్ట్రానికే కాదు... దేశానికీ ఉపయోగపడేలా పవన్ ఎదగాలని జనసేన పార్టీ పిఎసి చైర్మన్, మంత్రి నాదెండ్ల మనోహర్ ఆకాక్షించారు. ఎన్ని అవమానాలు ఎదురైన జనసేన ఎప్పుడూ ప్రజల పక్షాన నిలబడిందన్నారు. జనసేన ఎప్పుడూ సామాన్యుల పక్షానే ఉంటుందని తెలిపారు. ప్రశ్నించే స్థాయి నుంచి పరిష్కరించే స్థాయికి మనం ఎదిగామన్నారు. అధికారులతో కలిసి ప్రభుత్వ పథకాలు అమలయ్యేలా జనసైనికులు చూడాలని కోరారు.

సభాప్రాంగణం వద్ద తోపులాట

ఆవిర్భావోత్సవ సభలో తోపులాట చోటుచేసుకుంది. వీరమహిళలు ఉన్న ప్రాంగణంలోకి కార్యకర్తలు దూసుకురావడంతో ఒక మహిళా కానిస్టేబుల్, మరో ఆరుగురు అస్వస్థతకు గురయ్యారు. వారిని అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వారి పరిస్థితి బాగానే ఉందని వైద్యులు తెలిపారు.

బైక్‌లపై విన్యాసాలు

జనసేన ఆవిర్భావ జయకేతనం సభకు వచ్చిన యువకులు బైకులపై విన్యాసాలు చేస్తూ కేరింతలు కొట్టారు. జాతీయ రహదారిపై మితిమీరిన వేగంతో తిరుగుతూ హల్‌చల్ చేశారు. ఒకే బైకుపై ముగ్గురు, నలుగురు యువకులు ఎక్కి విన్యాసాలు చేశారు.

ప్రయాణికునిపై దాడి

216వ నెంబర్ జాతీయ రహదారికి ఒక పక్కనే వాహనాలను పార్కింగ్ చేశారు. దీంతో, ట్రాఫిక్ నిలిచిపోయింది. ట్రాఫిక్‌లో చిక్కుకున్న ఒక ద్విచక్ర వాహన చోదకునిపై జనసేన కార్యకర్త కర్రతో దాడి చేశాడు. అడ్డుగా ఉన్న వాహనాన్ని తీయాలని కోరినందుకు ఆగ్రహంతో దాడికి తెగబడ్డారు. తోటివారు కలుగజేసుకుని అడ్డుకున్నారు.

పోలీసులతో వాగ్వాదం

సభకు వివిధ ప్రాంతాల నుంచి భారీగా జనం తరలి వచ్చారు. పోలీసులు పాసులు తనిఖీ చేసి లోపలికి పంపే ఏర్పాట్లు చేశారు. ఈ నేపథ్యంలో అక్కడికి భారీగా చేరుకున్న జనసైనికులు ఒక్కసారిగా సభ ప్రాంగణంలోకి వెళ్లేందుకు ప్రయత్నించడంతో జనసైనికులకు, పోలీసులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది.

షెడ్యూలు ప్రకారమే 24, 25 తేదీల్లో బ్యాంకుల సమ్మె

కోల్‌కతా : ఈనెల 24, 25 తేదీల్లో జరగాల్సిన దేశవ్యాప్త సమ్మె అనుకున్న ప్రకారమే జరుగుతుందని యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యుఎఫ్‌బియు)గురువారం ప్రకటించింది. కీలకమైన డిమాండ్లపై ఇండియన్ బ్యాంక్ అసోసియేషన్ (ఐబిఎ) జరిగిన చర్చల్లో ఎలాంటి సానుకూల ఫలితాలు రానందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. వారానికి ఐదు రోజులు పని, అన్ని కేడర్ల రిక్రూట్‌మెంట్‌తో సహా పలు అంశాలను చర్చించారు. అయినా ఇంకా కీలకమైన సమస్యలు పరిష్కారం కాలేదని బ్యాంక్ ఉద్యోగుల జాతీయ సమాఖ్య (ఎన్‌సిబిఇ) ప్రధాన కార్యదర్శి ఎల్.చంద్రశేఖర్ తెలిపారు. వర్క్‌మెన్‌ల ఖాళీలను, ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ఆఫీసర్ డైరెక్టర్ పోస్టులను భర్తీ చేయాలని తొమ్మిది బ్యాంక్ ఉద్యోగుల సమాఖ్యలతో కూడిన యుఎఫ్‌బియు కోరుతోంది. ఉద్యోగుల పనితీరు సమీక్షలు, పనితీరుకు సంబంధించి ఇచ్చే రాయితీలు వంటి అంశాలపై ఫైనాన్షియల్ సర్వీసెస్ డిపార్ట్‌మెంట్ (డిఎఫ్ఎస్) ఇటీవల ఇచ్చిన ఆదేశాలను ఉపసంహరించుకోవాలని యూనియన్లు కోరుతున్నాయి. ఇటువంటి చర్యల వల్ల ఉద్యోగుల ఉపాధి భద్రత ప్రమాదంలో పడుతుందని విమర్శించింది. పైగా ఇటువంటి జోక్యందారీ చర్యలు బ్యాంక్‌ల స్వయంప్రతిపత్తిని దెబ్బ తీస్తాయని పేర్కొంది.

రాజ్‌కోట్‌లో అగ్ని ప్రమాదం

- ముగ్గురు సజీవదహనం

రాజ్‌కోట్ : గుజరాత్‌లోని రాజ్‌కోట్ పట్టణంలో ఒక భవనంలో సంభవించిన అగ్ని ప్రమాదంలో ముగ్గురు సజీవదహనమయ్యారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. శుక్రవారం ఉదయం అట్లాంటిస్ భవనంలో ఈ ప్రమాదం జరిగింది. ఈ సమాచారం తెలిసినవెంటనే అగ్నిమాపక బృందాలు అక్కడకు చేరుకున్నాయి. మంటలను అదుపులోకి తీసుకొచ్చాయి. షార్ట్ సర్క్యూట్ కారణంగానే ఈ ప్రమాదం జరిగినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడయిందని ఎస్‌పి బిజె చౌదరి తెలిపారు.

అమెరికా సుంకాలపై డబ్ల్యుటిఓలో కెనడా ఫిర్యాదు

జెనీవా : ఉక్కు, అల్యూమినియం ఉత్పత్తులన్నింటిపై 25 శాతం టారిఫ్‌లు విధిస్తూ అమెరికా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న చర్యపై ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యుటిఒ)లో కెనడా ఫిర్యాదు చేసింది. బుధవారం నుండి అమల్లోకి వచ్చిన ఈ సుంకాలకు ఎలాంటి మినహాయింపులు లేవు, వాటిని నివారించడానికి దేశాలు చేసిన ప్రయత్నాలతో నిమిత్తం లేకుండా అందరికీ వర్తిస్తాయి. దీంతో ఇప్పటివరకు కొన్ని ఉక్కు, అల్యూమినియం ఉత్పత్తులపై అదనపు సుంకాల నుండి తమకు వున్న మినహాయింపులను కోల్పోయామని, అల్యూమినియం ఉత్పత్తులపై సుంకాలు పెరిగాయని కెనడా తెలిపింది. అమెరికాకు ప్రధాన ఉక్కు సరఫరాదారుగా కెనడా వుంది. ముఖ్యంగా ఆసియా నుండి పోటీ పెరుగుతున్న నేపథ్యంలో క్షీణిస్తున్న అమెరికా ఉక్కు పరిశ్రమను కాపాడుకునే లక్ష్యంతో ట్రంప్ ఈ చర్యలు తీసుకున్నారు. ఈ వివాదంపై చర్చించాల్సిందిగా కెనడా డబ్ల్యుటిఒ వివాద పరిష్కార యంత్రాంగాన్ని కోరింది. దీంతో సంతృప్తికరమైన పరిష్కారాన్ని కనుగొనేందుకు సంబంధిత పక్షాలు చర్చలు జరిపేందుకు ఒక అవకాశం లభిస్తుంది. 60 రోజుల తర్వాత, ఒకవేళ వివాదాన్ని పరిష్కరించడంలో చర్చలు విఫలమైతే కమిటీ ద్వారా తీర్పును ఫిర్యాదీదారుడు కోరవచ్చు. ట్రంప్ గతంలో చేపట్టిన టారిఫ్‌లపై మార్చి 4న కెనడా విడిగా మరో ఫిర్యాదును డబ్ల్యుటిఒలో నమోదు చేసింది.

మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా 21న ఆందోళనలు

- ఎడబ్ల్యుఎఫ్ఎఫ్ఐ పిలుపు
- ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్రంలోని మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా మార్చి 21న దేశవ్యాప్త ఆందోళనలకు ఆశా వర్కర్స్ అండ్ ఫెసిలిటేటర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎడబ్ల్యుఎఫ్ఎఫ్ఐ) పిలుపు ఇచ్చింది. ఈ మేరకు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పిపి ప్రేమ, మధుమిత బందోపాధ్యాయ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆశా వర్కర్స్‌ను క్రమబద్ధీకరించాలని, వారికి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, పెన్షన్ మంజూరు చేయాలనే డిమాండ్‌తో ఈ ఆందోళనలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎన్‌హెచ్ఎంకు బడ్జెట్ కేటాయింపులు పెంచాలని, వివిధ రాష్ట్రాలకు పెండింగ్‌లో ఉన్న కేంద్ర వాటాను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అన్ని రాష్ట్రాల్లోనూ ఒక విధమైన పని పరిస్థితులు ఉండేలా చూడాలని కోరారు.

ఆశా వర్కర్ల వేతనాలు పెంపుపై పార్లమెంట్‌లో కేంద్ర ఆరోగ్య మంత్రి జెపి నడ్డా స్పష్టమైన హామీ ఇవ్వలేదని విమర్శించారు. ఆశా కార్యక్రమం అమలులోకి వచ్చి 20 ఏళు పూర్తి అవుతుందని, ఈ విషయాన్ని కూడా కేంద్ర మంత్రి ప్రస్తావించలేదని తెలిపారు. కార్మికుల పని పరిస్థితులు, కనీస వేతనాలు, పెన్షన్ గురించి కూడా మంత్రి ఏమీ వెల్లడించలేదని అన్నారు. 45, 46వ ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ సిఫార్సుల మేరకు ఆశా కార్మికులతో సహ వర్కర్లను వాలంటీర్ల స్థానంలో కార్మికులుగా క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.26 వేలు, పెన్షన్, ఈఎస్ఐ, పిఎఫ్, గ్రాట్యుటీ వంటి ఇతర సామాజిక భద్రతా ప్రయోజనాలను అందించాలని డిమాండ్ చేశారు. మార్చి 21న దేశవ్యాప్తంగా నిరసలు నిర్వహించి, కేంద్ర మంత్రికి వినతి పత్రం అందజేసేందుకు పిలుపు ఇచ్చారు. అలాగే భవిష్యత్తు పోరాటాలకు ఏప్రిల్ 12న న్యూఢిల్లీలో జాతీయ కన్వెన్షన్ నిర్వహిస్తామని ప్రకటనలో వెల్లడించారు.

నిధుల కొరతతో మయన్మార్‌కు ఆహార సాయంలో కోత : డబ్ల్యుఎఫ్‌పి

న్యూయార్క్ : మయన్మార్‌లోని పది లక్షల మందికి పైగా ప్రజలకు ప్రాణాధారమైన ఆహార సాయంలో కోత విధించనున్నట్లు ఐక్యరాజ్య సమితి ఆహార సంస్థ శుక్రవారం పేర్కొంది. నిధులు తీవ్రంగా తగ్గిపోయినందువల్ల వచ్చే నెల నుండి ఈ కోత అమలు కానున్నట్లు ప్రపంచ ఆహార కార్యక్రమం (డబ్ల్యుఎఫ్‌పి) పేర్కొంది. ఘర్షణలు పెరగడం, నిర్వాసితుల సంఖ్య ఉధృతంగా పెరిగిపోవడం, పైగా ఆంక్షలు ఇవన్నీ కలిసి ఆహార సాయం అవసరమవుతున్న వారి సంఖ్య ఇప్పటికే బాగా పెరిగిపోయిందని, అందువల్లే ఈ పరిస్థితి ఉత్పన్నమైందని డబ్ల్యుఎఫ్‌పి ఒక ప్రకటనలో పేర్కొంది. 2021 తొలినాళ్ళ నుండి మయన్మార్ సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాన్ని శక్తివంతమైన మిలటరీ కూలదోయడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. దీంతో నిరసనోద్యమం మొదలైంది, ఇది క్రమంగా దేశవ్యాప్తంగా పాలక జుంటాపై సాయుధ తిరుగుబాటుగా విస్తరించింది. 2026 జనవరి నాటికి ఎన్నికలు నిర్వహిస్తామని మయన్మార్ జుంటా చీఫ్ ఇప్పటికే ప్రకటించారు. ప్రస్తుతం మయన్మార్‌లో దాదాపు 2కోట్ల మంది ప్రజలకు మానవతా సాయం అవసరముంది. దేశ జనాభాలో మూడోవంతు మంది అంటే కోటీ 52లక్షల మంది తీవ్రమైన ఆహార అభద్రతను ఎదుర్కొంటున్నారని ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల నిపుణులు పేర్కొంటున్నారు. నిధుల కొరత గురించి డబ్ల్యుఎఫ్‌పి వివరించలేదు. అమెరికా విదేశీ సాయంలో కోత విధించడం వల్ల తలెత్తిన పరిస్థితులా ఇవి కాదా అనేది స్పష్టంగాలేదు. అయితే ఈ నిర్ణయం మయన్మార్‌లోని పలు కమ్యూనిటీలను బాగా దెబ్బతీయనుంది. కొంతమంది కేవలం డబ్ల్యుఎఫ్‌పి సాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. వీరిలో అంతర్గతంగా నిర్వాసితులైన ముస్లిం రోహింగ్యాలు, ఇతర కమ్యూనిటీల వారు దాదాపు లక్షమంది వున్నారు. రాబోయే కాలంలో జులై నుండి సెప్టెంబరు వరకు ఆహార కొరతలు చాలా తీవ్రంగా వుంటాయని, అప్పుడు తలెత్తబోయే పరిస్థితుల పట్ల డబ్ల్యుఎఫ్‌పి తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తోంది.



11.7 కోట్లు దాటనున్న నిర్వాసితుల సంఖ్య

- వచ్చే ఏడాది చివరకు మరో 67 లక్షల మంది
- ఐక్యరాజ్యసమితి శరణార్థుల సంస్థ వెల్లడి


న్యూయార్క్ : ప్రపంచవ్యాప్తంగా బలవంతంగా నిర్వాసితులైన వారి సంఖ్య 11.7కోట్లకు పైగా దాటుతుందని ఐక్యరాజ్యసమితి శరణార్థుల సంస్థ తెలిపింది. ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం కూడా వుందని హెచ్చరించింది. వచ్చే ఏడాది చివరి నాటికి కొత్తగా నిర్వాసితులు దాదాపు 67లక్షల మంది చేరతారని భావిస్తున్నట్లు శరణార్థ మండలి శుక్రవారం తెలిపింది. ఇవేమీ కేవలం గణాంకాలుగా చూడరాదని, తమ వెంట ఏమీ తీసుకెళ్ళలేని రీతిలో బలవంతంగా ఇళ్ళ నుండి పారిపోయిన కుటుంబాల సంఖ్య ఇదని, వీరు ఆహారం, నీరు, గూడు కోసం వెతుక్కుంటూ వుంటారని డానిష్ శరణార్థ మండలి సెక్రటరీ జనరల్ చార్లెట్ స్లానెట్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానంగా 27 దేశాల్లో ఈ పరిస్థితి నెలకొందని, అంతర్జాతీయ నిర్వాసితుల్లో మూడో వంతు మంది ఈ దేశాల్లోనే వున్నారని చెప్పారు. భద్రత, రాజకీయాలు, ఆర్థిక పరిస్థితులు వంటి దాదాపు వందకు పైగా అంశాలను ప్రామాణికాలుగా తీసుకుని నిర్వాసితుల ధోరణులను విశ్లేషించారు. ఇందుకు గానూ ఎఐతో రూపొందించిన నమూనాను ఉపయోగించారు.

కొత్తగా నిర్వాసితులైన వారిలో దాదాపు మూడోవంతు మంది సూడాన్ నుండే వుంటారు. రెండేళ్ళనుండి సాగుతున్న యుద్ధంతో సూడాన్‌లో ప్రపంచంలోనే అత్యంత అధ్వాన్నమైన శరణార్థుల సంక్షోభం నెలకొంది. మయన్మార్ నుండి మరో కోటీ 40లక్షల మంది నిర్వాసితులు కొత్తగా చేరనున్నారని ఆ నివేదిక పేర్కొంది. అమెరికా ఇటీవల విదేశీ సాయంలో కోత విధించిన నేపథ్యంలో ఇలాంటి ప్రపంచ కార్యక్రమాలన్నింటికీ నిధుల కొరత మొదలైంది. ఈ పరిస్థితుల్లో లక్షలాదిమంది కరువు వాతనబడుతున్నారని, నిర్వాసితులవుతున్నారని, స్లానెట్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

రోహింగ్యా శరణార్థుల శిబిరాన్ని సందర్శించిన యుఎన్ చీఫ్



ఢాకా : బంగ్లాదేశ్‌లోని రోహింగ్యా శరణార్థుల శిబిరాన్ని శుక్రవారం యుఎన్ చీఫ్ ఆంటానియో గుటెరస్ సందర్శించారు. వచ్చే నెల నుండి వారికి అందించే ఆహార సాయంలో తీవ్రమైన కొరతలు విధించనున్న నేపథ్యంలో గుటెరస్ పర్యటన చోటు చేసుకుంది. ప్రపంచంలోనే అతిపెద్ద శరణార్థ స్థావరంలో జీవనపరిస్థితులు ఇప్పటికే దుర్భరంగా మారిన నేపథ్యంలో తాజా పరిణామాలు మరింత కలవరపెడు తున్నాయి. సరిహద్దు జిల్లా అయిన కాక్స్ బజార్‌లో గుటెరస్ పర్యటన చాలా కీలకమైనదిగా భావిస్తున్నారు. యుఎస్ఎయిడ్ కార్యకలాపాలు మూతపడిన పరిస్థితుల్లో అత్యవసర ఆహార సరఫరాల్లో కోతలు వుంటాయని ప్రపంచ ఆహార కార్యక్రమం ఇప్పటికే ప్రకటించింది. ఏప్రిల్ నుండి రోహింగ్యాలకు ఇచ్చే ఆహార వోచర్లను రూ.12.50నుండి రూ.6కు తగ్గించాల్సి వస్తోంది. నిధుల కొరత కారణంగా తీసుకునే ఈ చర్యలతో శరణార్థులతో కిక్కిరిసిపోయిన శిబిరాల్లో ఆకలి కేకలు మరింత ఎక్కువవుతాయని ఆందోళనలు మొదలయ్యాయి. రోహింగ్యా శరణార్థులకు ప్రధానంగా ఆర్థిక సాయం అందించే దేశంగా ఇప్పటివరకు అమెరికా వుంది. ట్రంప్‌వచ్చిన తర్వాత పరిస్థితులు మారిపోయాయి. ఈ శిబిరాల్లోని పిల్లలు 2017 నుండి తీవ్ర పోషకాహార లోపాలతో బాధపడుతున్నారని యునిసెఫ్ పేర్కొంది. గతేడాది పోలిస్తే ఈ ఏడాది 27శాతం ఇటువంటి కేసులు పెరిగాయి. "ఇప్పటికే మాకు ఏదైతే ఇస్తున్నారో అది చాలడం లేదు. ఇంకా దాన్ని సగానికి తగ్గిస్తే ఇక మేం కరువు వాతన పడాల్సిందే" అరి మయన్మార్‌కు చెందిన 31ఏళ్ళ శరణార్థి మహ్మద్ సాబిర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడ తమను పనిచేయడానికి అనుమతించరని, అటువంటపుడు నా పిల్లలను ఎలా పోషించాలో తెలియడం లేదన్నారు. బంగ్లాదేశ్‌లో 10లక్షల మందికి పైగా రోహింగ్యా శరణార్థులు వున్నారు.



మీకోసం

బేకింగ్ సోడాలో ఒక చెంచా సర్ఫ్, కాసిన్ని నీళ్లు పోసి చేసుకున్న ద్రావణంతో షర్ట్ కాలర్లు ఉతికితే మరకలు త్వరగా పోతాయి.

జీవన సౌరభం

మార్చలేని గతాన్ని గురించి ఆలోచించకుండా, చేతిలో ఉన్న భవిష్యత్తుకై శ్రమించు.

మంచితనం




పార్వతీపురంలో రామయ్య, భూషయ్య ఇరుగు పొరుగు వారు. రామయ్యకు రెండు ఎకరాల పంట భూమి ఉంది. భూషయ్యకు పది ఎకరాల వ్యవసాయ భూమితో పాటు వడ్డీ వ్యాపారం కూడా ఉంది. ఆ ఊరులో అందరికంటే గొప్పవాడినని భూషయ్య గర్వంగా ఉండేవాడు. రామయ్య అలా కాదు అందరినీ గౌరవిస్తూ మంచి మనిషి అనిపించుకున్నాడు. భూషయ్య కనిపించినప్పుడల్లా రామయ్య పలకరించేవాడు. భూషయ్య పట్టించుకునేవాడు కాదు.

ఒకసారి చుట్టు పక్కల గ్రామాల వారికందరికీ వింత జబ్బు సోకింది, దాంతో పార్వతీపురం గ్రామాధికారి ముందు జాగ్రత్తగా అందరికీ ఆ జబ్బుకు సంబంధించిన మందును ఉచితంగా పంపిణీ చేశాడు. భూషయ్య ఆ మందును తీసుకోలేదు. కొన్నాళ్లకు భూషయ్య కుటుంబమంతా జబ్బుబారిన పడ్డారు. విషయం తెలిసిన రామయ్య. వారికి మందును ఇవ్వడమే కాకుండా వారికి పూర్తిగా నయమయ్యే వరకు మూడు పూటలా ఆహారం ఏర్పాట్లు కూడా చేశాడు.

భూషయ్య కోలుకున్న తరువాత 'నీ వద్ద ధనం లేకున్నా గ్రామంలోని ప్రతి ఒక్కరూ నిన్ను ఎంతో గౌరవిస్తారు' అని రామయ్యతో అన్నాడు. 'మనిషికి మంచితనమే ఆభరణం భూషయ్య. పదిమందితో బాగుంటే చాలు' అన్నాడు రామయ్య. 'నిజమే నేను ఎవ్వరినీ పట్టించుకోలేదు. అందుకే నేను జబ్బు పడ్డప్పుడు ఎవ్వరూ నా దగ్గరికి రాలేదు. నిన్ను ఎంతలా అవమానించినా అవేమీ పట్టించుకోకుండా మా కుటుంబాన్ని ఆదుకున్నావు. ఇక నుండి నేను కూడా అందరితో బాగుంటాను. అంతే కాదు అవసరమైన వారికి వడ్డీ లేకుండా ధన సహాయం కూడా చేస్తాను' అన్నాడు భూషయ్య. 'చాలా సంతోషం భూషయ్యా!' అన్నాడు రామయ్య. భూషయ్యలో వచ్చిన మార్పుకు గ్రామ ప్రజలంతా సంతోషించారు.

- యు.విజయశేఖర రెడ్డి,
హైదరాబాద్



దారి చూపండి

పిల్లలూ, ఇక్కడ ఉన్న కప్పకు బాగా ఆకలిగా ఉందట. ఈగలను తినేందుకు వెళ్లాలి. ఏ దారి గుండా వెళ్లాలో కాస్త దారి చూపరూ!

నేను గీసిన బొమ్మ



- తుజాల శరణ్య,
5వ తరగతి,
ప్రాథమిక పాఠశాల,
చల్మెడ మండలం,
నిజాంపేట,
మెదక్ జిల్లా.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

వినియోగదారులకు 'మేలుకొలుపు'

బస్సులో ప్రయాణం చేస్తే డబ్బులు ఇచ్చి టిక్కెట్ అడుగుతున్నాం. ఆసుపత్రికి వెళ్తే ఓపికి డబ్బులిస్తే కార్డు అడుగుతున్నాం.. కానీ డబ్బులిచ్చి కొనుగోలు చేసే వాటికి రశీదు తీసుకోవడం మరచిపోతున్నాం. ఆ పద్ధతి మారాలి. కొనుగోలు చేసే ప్రతి వస్తు సేవలకు రశీదు పొందండి. అది మీకు వజ్రాయుధం అవుతుంది. 'ఓ వినియోగదారుడా.. నువ్వు మోసపోవద్దు. నకిలీలు, కల్తీలు అంటగడితే ఫోరంకు వెళ్ల పరిహారాన్ని పొందొచ్చు' అంటూ నిరంతరం చైతన్యం చేస్తూ వారికి ఫోరం తరపున పరిహారం అందేలా కృషిచేస్తున్నారు దాసరి ఇమ్మానియేలు. ఈనెల 15న ప్రపంచ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ కథనం.

బాపట్ల జిల్లా చీరాలకు చెందిన దాసరి బాలాజీరావు, సూర్యావతి దంపతుల కుమారుడు ఇమ్మానియేలు. డిగ్రీ పూర్తిచేశారు. పాఠశాల, కళాశాల విద్య దశలోనే ఆయన విద్యార్థి నాయకుడిగా ఉండేవారు. సమాజంలో జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలు, మోసాలు వంటివి తెలుసుకున్న ఆయన ప్రజలకు తనవంతుగా ఏదో ఒక సాయం చేయాలనే తపనతో 'మేలుకొలుపు' కన్స్యూమర్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌ను 2019, జనవరి 29న ప్రారంభించారు. అదే పేరుతో ఫేస్‌బుక్ ఖాతాను నిర్వహిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ వినియోగదారుల సంఘాల సమాఖ్యకు చైర్మన్‌గానూ, బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ క్లబ్స్ (బిఐఎస్) బాపట్ల జిల్లాకు మానక్‌మిత్రగా కొనసాగుతున్నారు.

వినియోగదారుల క్లబ్బుల ఏర్పాటు

గత ఐదేళ్లగా వినియోగదారులకు హక్కుల గురించి తెలియజేస్తూ పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకూ రాష్ట్రవ్యాప్తంగా సుమారుగా 2000పైబడి అవగాహనా ప్రచార కార్యక్రమాలు, సదస్సులు, సమావేశాలు వంటివి ఏర్పాటుచేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో 8, 9 తరగతి విద్యార్థులతో ఏర్పాటు చేసిన కన్స్యూమర్స్ క్లబ్‌లను సందర్శించి అనుమానాలను నివృత్తి చేస్తున్నారు.

పోరాటంతో పరిహారం

తూనికలు, కొలతల శాఖ, ఆహార భద్రతా శాఖాధికారులతో కలిసి, రెస్టారెంట్లు, హోటళ్ళు, తినుబండారాలు, పండ్ల దుకాణాలు, గోడౌన్లను తనిఖీలు నిర్వహించేలా కృషి చేస్తున్నారు. వినియోగదారుల కమిషన్‌లో ఎలాంటి న్యాయవాది అవసరం లేకుండా స్వయంగా కేసు దాఖలుచేసి వాదించుకునే అవకాశం చట్టం ద్వారా కల్పించబడిందని గుర్తు చేస్తున్నారు. -చీరాలలోని సిఎఫ్‌సి రెస్టారెంట్‌లో ఒకసారి వాడిన నూనెను రోజుల కొద్దీ వినియోగించడాన్ని గుర్తించి, కేసు నమోదు చేయించగా రూ.60 వేలు జరిమానా విధించారు.



- ఇటీవల నూతనంగా ఏర్పాటు చేసిన ఓ రెస్టారెంట్‌లో పన్నీరుకు రంగు కలిపిన విషయమై ఫిర్యాదు చేశారు.
- కల్తీ పదార్థాలపై వివిధ దినపత్రికల్లో వచ్చే వార్తా కథనాలను ఫుడ్ సేఫ్టీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లటం, వారు చర్యలు తీసుకునేలా ప్రయత్నం చేస్తున్నారు.
- పండ్ల మార్కెట్‌లో నిషేధిత రసాయనాలను పండ్లపై వినియోగంపై ఫిర్యాదులు చేయటం. తనిఖీలు జరిగేలా ప్రోత్సహించటం
- శాంపిళ్ల సేకరించి పరీక్షలకు పంపేలా కృషిచేయటం
- రాష్ట్రప్రభుత్వం అందజేస్తున్న ఫోర్టిఫైడ్ బియ్యంపై ఉన్న అపోహ (ప్లాస్టిక్ రైస్)ను తొలగించి, వాటిని బయట మార్కెట్లో విక్రయించుకుండా వినియోగించుకోవాలని కూడా అవగాహన కల్పిస్తున్నారు.
- ర్యాంకులు వస్తాయని, మెడిసిన్; ఇంజనీరింగ్ సీట్లు సంపాదించొచ్చునని, ఐఎఎస్, ఐపిఎస్ వంటి పోస్టులు దక్కుతాయని కొన్ని కోచింగ్ సెంటర్లు చేసే ప్రచారాలు, ప్రకటనలపై నిషేధం విధించేలా కృషి చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన సంస్థలకు రూ.1.56 కోట్లు జరిమానా పడేలా ప్రయత్నం చేశారు.

హక్కుల పరిరక్షణే ధ్యేయంగా...



వినియోగదారుల రక్షణ చట్టం గురించి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో వినియోగదారుల రక్షణ చట్టం 1986, 2019పై శిక్షణ పొందా. వస్తువులు, సేవల్లో లోపాల కారణంగా వినియోగదారులు అవగాహన లేక నష్టపోతున్నారు. అందుకే చైతన్యం చేసేందుకు మా 'మేలుకొలుపు' సంస్థ ద్వారా నిరంతరం కృషిచేస్తున్నాం. నగదు చెల్లించి లేదా చెల్లిస్తామని హామీ ఇచ్చి లేదా వాయిదాల రూపంలో చెల్లిస్తామని కొనుగోలు చేసే వస్తుసేవల్లోనూ పరిహారం పొందొచ్చు.

-దాసరి ఇమ్మానియేలు
ఆంధ్రప్రదేశ్ వినియోగదారుల సంఘాల సమాఖ్య చైర్మన్, చీరాల, సెల్ : 9059990345

కొన్ని కేసుల్లో తీర్పులు ఇలా...

- బైద్యనాథ్ వారి చవన్ ప్రాశ తింటే రోగనిరోధక శక్తి పెరిగి, కరోనా దరిచేరనీయదని, డెట్టాల్ చల్లితే కరోనా రాదని చేసే ప్రకటనలపై భారీ జరిమానా విధించింది. గుట్కా వంటి మత్తు పదార్థాల విక్రయాలను ప్రోత్సహిస్తూ ప్రకటనల్లో నటించిన బాలీవుడ్ నటులు (షారూఖ్‌ఖాన్, అజయ్ దేవగన్, టైగర్ ష్రాఫ్)లకు నోటీసులు పంపించింది.
- ఆర్టీసీ బస్సులో రూ. 5 చిల్లర ఇవ్వకుండా, నిర్లక్ష్యంగా వ్యవహరించిన కండక్టరు, డ్రైవర్‌లపై జిల్లా వినియోగదారుల పరిష్కార కేంద్రంలో కేసును స్వయంగా కేసు వేయగా ఆర్టీసీ రూ.16,005 నష్టపరిహారంగా చెల్లించింది.
- రూ. 3 లక్షలు చెల్లించి టిక్కెట్ కొన్నా బుకింగ్‌లో లోపం పేరుతో బ్రిటీష్ ఎయిర్ వేస్‌లో ప్రయాణం నిలిచింది. ఆ రెండు సంస్థలకు కలిపి రూ.1.20 లక్షలు బెంగుళూరు వినియోదారుల కమిషన్ జరిమానా విధించింది. వారు చెల్లించిన రూ.3 లక్షలు చెల్లించాలని ఆదేశించింది.
- విజయవాడకు చెందిన సత్యనారాయణ మూర్తికి సంబంధించిన ఆస్తి పత్రాలు పోగొట్టి ఆర్థికంగా ఇబ్బందులు కల్గించినందుకు రూ.5 లక్షలు, మానసిక వేదనకు రూ.50 వేలు ఖర్చులని చెల్లించాలని మచిలీపట్నంలోని వినియోగదారుల కమిషన్ ఉత్తర్వులు వెలువరించింది.
- ఖమ్మం జిల్లా కంసలాపురం గ్రామానికి చెందిన వ్యాపారవేత్త తుమ్మా అప్పిరెడ్డి 2023లో అర్చన ట్రావెల్స్ ద్వారా థాయ్ లాండ్ విహార యాత్రకు రూ.71,000 చెల్లించి టూర్ ప్యాకేజీ బుక్ చేయగా నిలిచిపోయింది. ఖమ్మం వినియోగదారుల కమిషన్‌కు ఫిర్యాదుచేయగా రూ.71 వేలతోపాటుగా 7 శాతం వడ్డీతో సహా చెల్లించాలనీ, మానసికంగా వేధించినందుకు రూ.10వేలు ఖర్చులుగా చెల్లించాలని ఫోరం తీర్పునిచ్చింది.
- అనంతపురం జిల్లా గార్లదిన్నెకు చెందిన నరసింహారెడ్డి హీరో మోటార్ సైకిల్ గ్లామర్ వాహనాన్ని 2021లో కొనుగోలు చేయగా నిరంతరం లోపాలతో ఉండటంతో వినియోగదారుల పరిష్కార కమిషన్ విచారించి వాహన ధర రూ.76,700, మానసిక వేదనకు రూ.50 వేలు, ఖర్చులకు రూ.5000 చెల్లించాలని ఈనెల మూడోతేదీన ఉత్తర్వులు జారీచేసింది.
- సరూర్ నగర్ పిఅండ్ టి కాలనీకి చెందిన చంద్రశేఖర్‌ను కరోనా అనే అనుమానంతో ఆయన భార్య విజయలక్ష్మి నిఖిల్ హాస్పిటల్‌లో 2021లో చేర్పించారు. 10 రోజుల వైద్యం తర్వాత అతడు మరణించినట్లుగా ధృవీకరించిన యాజమాన్యం వైద్యం పేరుతో రూ.8,21,773, అంత్యక్రియల పేరుతో రూ.35 వేలు వసూలు చేశారు. వైద్యసేవల్లో లోపం కారణంగానే తన భర్త మృతి చెందారని రంగారెడ్డి జిల్లా వినియోగదారుల కమిషన్‌లో ఆమె కేసు దాఖలు చేశారు. పరిహారంగా రూ.5 లక్షలు, 6 శాతం వడ్డీతో చెల్లించాలనీ, ఖర్చులకు రూ.5000 చెల్లించాలని తీర్పు వచ్చింది.
- ఎయిర్‌టెల్ సంస్థ నిర్ణయించిన ప్యాకేజీని తీసుకున్నప్పుడు వారు చెప్పిన 30 రోజులు కాకుండా 28 రోజులకు మాత్రమే పని చేసిన అంశాన్ని ట్రాయ్‌కు బాధితుడు ఫిర్యాదుచేయగా ఆ ప్యాకేజీ తీసుకున్న అందరికీ మిగతా రెండు రోజులు సర్వీసులు అందేలా ఫోరం ఆదేశించింది.

-యడవల్లి శ్రీనివాసరావు

సినిమా నా జీవితాన్ని మార్చింది


కయాదు లోహర్

'అవకాశాలు కోసం ఎదురుచూస్తున్న సమయంలో 'డ్రాగన్' సినిమాలో కథానాయికగా ఛాన్స్ వచ్చింది. పల్లవి పాత్రలో జీవించా. ఇప్పుడు ఆ పాత్రకు ప్రేక్షకుల నుంచి మంచి అభినందనలు వస్తున్నాయి. సినిమా నా జీవితాన్ని మార్చేసింది. మొదట జూమ్ కాల్‌లో డైరెక్టర్ అశ్వత్ మరిముత్తు కీర్తి క్యారెక్టర్‌కు సంబంధించిన కథ చెప్పారు. తర్వాత అతని నుంచి నాకు సమాచారం రాలేదు. ఆ ప్రాజెక్టును కోల్పోయానేమోనని బాధపడ్డా. ఒక నెల తర్వాత అశ్వత్ మళ్లీ టచ్‌లోకి వచ్చి, పల్లవి పాత్ర కోసం నాకు నెరేషన్ ఇచ్చారు. నేను ఆ పాత్రలో అద్భుతంగా చేసి చూపిస్తానంటూ ప్రామిస్‌చేశా. అలాగే చేశా. ప్రదీప్‌రంగనాథన్ కోస్టార్ అయినా నిజమైన స్నేహితుడు అయ్యాడు' అని కథానాయిక కయాదు లోహర్ అన్నారు. ఆమె నటించిన 'డ్రాగన్' మూవీ ఇటీవల విడుదలై హిట్ టాక్‌ను అందుకున్న సందర్భంగా పై విధంగా స్పందించారు.

సొంత గొంతుతోనే 'రెట్రో'



పూజాహెగ్డే ప్రస్తుతం తమిళంలో సూర్య సరసన 'రెట్రో' చిత్రంలో నటిస్తున్నారు. కార్తిక్ సుబ్బరాజ్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమా మే నెలలో విడుదల కానుంది. ఈ సినిమా కోసం పూజాహెగ్డే తమిళంలో సొంతంగా డబ్బింగ్ చెప్పారు. కెరీర్ తొలిసారి తాను సొంతంగా డబ్బింగ్ చెప్పడం ఆనందంగా ఉందని, ఇక ముందు అన్ని భాషల్లో ఇదే పద్ధతి ఫాలో అవుతానని పూజాహెగ్డే పేర్కొన్నారు. ఆమె ప్రస్తుతం సూర్యతో 'రెట్రో', విజయ్‌తో 'జన నాయగన్', రాఘవ లారెన్స్‌తో 'కాంచన-4' చిత్రాల్లో కథానాయికగా నటిస్తున్నారు.

డబ్ల్యుపిఎల్ టైటిల్ కొట్టేదెవరో..?

- **నేడు ముంబయి, ఢిల్లీ మహిళల మధ్య ఫైనల్ పోరు**
- **రాత్రి 7.30గం॥లకు**



ముంబయి: 2023 తొలి సీజన్ విజేత ముంబయి ఇండియన్స్ రెండో టైటిల్‌పై కన్నేసింది. 2024 టైటిల్ విజేత రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఈసారి లీగ్ దశను దాటలేకపోయింది. మరోవైపు ఢిల్లీ క్యాపిటల్స్ మహిళలు తొలిసారి ఫైనల్‌కు చేరి తొలి టైటిల్‌ను చేజిక్కించుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. గురువారం జరిగిన ఎలిమినేటర్ మ్యాచ్‌లో ముంబయి ఆల్‌రౌండర్ స్కీవర్ బ్రంట్, హీలీ మాథ్యూస్ ఆల్‌రౌండ్ ప్రదర్శనను కనబర్చి గుజరాత్ జెయింట్‌పై గెలిచి ఫైనల్లోకి దూసుకొచ్చారు. మరోవైపు ఢిల్లీ జట్టు లీగ్ ఆశలో ఆడిన 8మ్యాచుల్లో 5మ్యాచుల్లో గెలిచి నేరుగా ఫైనల్‌కు చేరుకున్నారు. బ్రాబౌర్న్ స్టేడియంలో ఢిల్లీ-ముంబయి జట్ల మధ్య శనివారం డబ్ల్యుపిఎల్ ఫైనల్ మ్యాచ్ జరగనుంది.

ముంబయి ఆల్‌రౌండర్లు స్కీవర్ బ్రంట్ ఈ సీజన్‌లో 493పరుగులు చేయడంతోపాటు 9వికెట్లను పడగొట్టింది. మరోవైపు మాథ్యూస్ 11వికెట్లకి తోడు 304పరుగులతో రాణించింది. దీంతో వీరిద్దరూ ముంబయి ప్రధాన ఆటగాళ్లుగా కొనసాగుతున్నారు. స్కీవర్ ఈ సీజన్‌లో ఆడిన 9మ్యాచుల్లో ఐదు అర్ధసెంచరీలతో సత్తా చాటింది. ఆఫ్‌స్పిన్ బౌలర్లు మాథ్యూస్, అమేలియా కెర్ర్ 16వికెట్లు చేజిక్కించుకొని సత్తా చాటారు.

ఇక ఢిల్లీ కెప్టెన్ మెగ్ లానింగ్ అంతర్జాతీయ క్రికెట్‌కు గుడ్‌బై చెప్పినా.. డబ్ల్యుపిఎల్‌లో ఢిల్లీ తరఫున అదరగొడుతోంది. అలాగే జొన్నాసెన్, శిఖా పాండే 11 వికెట్లతో అద్భుత ప్రదర్శనతో అదరగొడుతున్నారు. బెంగళూరు వేదికగా ముంబయితో తలపడిన ఢిల్లీ జట్టు కేవలం 123పరుగులకే ముంబయిని పరిమితం చేసింది. బౌలింగ్‌లో శిఖా, జొన్నాసేన్ రాణించి 9వికెట్లు పడగొట్టి ముంబయిని కట్టడి చేశారు. ఓపెనర్ షెఫాలీ వర్మ పవర్ ప్లే ఓవర్లలో అద్భుతంగా రాణిస్తోంది. ఈ సీజన్‌లో షెఫాలీ 300 పరుగులు చేసింది. అలాగే జెమిమా రోడ్రిగ్స్, మారిజానే కాప్ పేస్ భారాన్ని మోయనున్నారు. ఇరుజట్లు సమతూకంగా ఉన్న నేపథ్యంలో డబ్ల్యుపిఎల్ సీజన్-3 టైటిల్ విజేత ఎవరో మరికొద్దిసేపట్లో తెలిపోనుంది.

జట్లు(అంచనా)...

ముంబయి ఇండియన్స్: హర్మన్‌ప్రీత్ కౌర్(కెప్టెన్), మాథ్యూస్, యాస్టికా భాటియా(వికెట్ కీపర్), అమన్‌జ్యోత్ కౌర్, అమేలియా కెర్ర్, హీలీ మాథ్యూస్, కలిత, స్కీవర్ బ్రంట్, సిసోడియా, సజన, ఇస్మాయిల్.

ఢిల్లీ క్యాపిటల్స్: మెగ్ లానింగ్(కెప్టెన్), రోడ్రిగ్స్, షెఫాలీ వర్మ, కాప్సే, సథర్లాండ్, నందిన కాప్సే(వికెట్ కీపర్), అరుంధతి రెడ్డి, జొన్నాసెన్, మారిజానే కాప్, మిన్ను మణి, శిఖా పాండే/టిటాస్ సద్ధు.

బాలీవుడ్ నటుడు దేవ్ ముఖర్జీ మృతి



బాలీవుడ్ నటుడు దేవ్ ముఖర్జీ (83) శుక్రవారం కన్నుమూశారు. కొంతకాలంగా ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన ముంబైలోని ఒక ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. దేవ్ అనేక చిత్రాలలో నటించి మెప్పించారు. 'ఏక్ బార్ మూస్కురా దో', 'జో జీతా వోహి సికందర్', 'లాల్ పత్తర్' వంటి చిత్రాలు ఆయనకు మంచి గుర్తింపును తెచ్చిపెట్టాయి. దేవ్ ముఖర్జీ అంత్యక్రియలు శుక్రవారం సాయంత్రం ముంబైలోని విలే పార్లేలోని పవన్ హన్స్ శ్మశానవాటికలో నిర్వహించారు. ఆయన మతి పట్ల బాలీవుడ్ చిత్ర పరిశ్రమలోని పలువురు ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. దేవ్ కొడుకు అయాన్ ముఖర్జీ ప్రస్తుతం హృతిక్ రోషన్, ఎన్టీఆర్‌తో 'వార్ 2' చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు.



సందేశాత్మక చిత్రం 'లగ్జరీ లైఫ్'

'కాలేజీ స్టూడెంట్లు లగ్జరీ లైఫ్‌కు అలవాటు పడి ఎలా చెడిపోతున్నారు, వీరివల్ల తల్లిదండ్రులు ఎలాంటి బాధపడుతున్నారు? అనేది ఈ సినిమా ఇతివృత్తం. కామెడీ, యాక్షన్, సెంటిమెంట్, హర్రర్, మర్డర్ మిస్టరీ, సస్పెన్స్ ఇలా అన్నీ వైవిధ్యంగా అన్ని ఎలిమెంట్లు మేళవింపుగా ఉంటాయి. సినిమా షూటింగ్ మొత్తం ఆంధ్రప్రదేశ్‌లోనే జరుగుతుంది. ఎక్కువగా రాజధాని అమరావతి, విజయవాడ పరిసర ప్రాంతాల్లో షూటింగ్ చేస్తాం. పాటలు విశాఖపట్టణం, అరకు, భీమిలి పరిసర ప్రాంతాల్లో చేయబోతున్నాం. అన్ని షెడ్యూళ్లను మే 25 నాటికి పూర్తి చేయాలనే లక్ష్యంతో చిత్ర యూనిట్ పనిచేస్తుంది. ప్రజలు కూడా ఆదరించాలని కోరుతున్నా' అని దర్శకుడు రెడ్రౌతు మల్లేష్ నాయుడు అన్నారు. అంతా కొత్త తారాగణంతో ఎన్ఎంఆర్ క్రియేషన్స్ బ్యానర్‌పై తెరకెక్కుతున్న ఈ సినిమా 'లగ్జరీ లైఫ్'. పెనమలూరు మండలం కానూరులోని శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో శుక్రవారం నాడు ముహూర్తపు షాట్‌ను తెరకెక్కిం చారు.కళ్యాణి డెవలప్స్ అధినేత మేడిబోయిన రవి మంత్రి పాత్రలో నటిస్తుండగా ఆయనపై తొలి షాట్‌ను తీశారు. మాస్టర్ లీలావతి నిర్మాత. రెడ్రౌతు సూర్యప్రకాష్ కో ప్రొడ్యూసర్. కోడూరి రఘునాథరెడ్డి, సర్వేయర్ సూరత్ బాలకృష్ణ, నర్రా ఉదయ్ చౌదరి తదితరులు నటిస్తున్నారు.

ఢిల్లీ కెప్టెన్‌గా అక్షర్ పటేల్



న్యూఢిల్లీ: ఐపీఎల్-2025 సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ కొత్త కెప్టెన్ ఎవరన్న ఉత్కంఠకు తెరపడింది. టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్‌ను ఢిల్లీ క్యాపిటల్స్ ఫ్రాంచైజీ తమ కెప్టెన్‌గా నియమించింది. కాగా ఢిల్లీ క్యాపిటల్స్ తొలుత కేఎల్ రాహల్‌ను కెప్టెన్‌గా ఎంపిక చేయాలని భావించింది. కానీ అందుకు రాహుల్ సుముఖత చూపకపోవడంతో అక్షర్‌కు తమ జట్టు పగ్గాలను ఢిల్లీ యాజమాన్యం అప్పగించింది. ఐపీఎల్‌లలో అక్షర్ పటేల్ ఓ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించనుండడం ఇదే తొలిసారి. కాగా అక్షర్ 2019 నుంచి ఢిల్లీ జట్టుతో కొనసాగుతున్నాడు. ఐపీఎల్-2025 మెగా వేలానికి ముందు రూ. 16.50 కోట్ల భారీ ధర వెచ్చించి అక్షర్‌ను ఢిల్లీ రిటైన్ చేసుకుంది. ఇక కెప్టెన్‌గా ఎంపికైన అక్షర్ పటేల్‌కు తన సహచర ఆటగాడు కేఎల్ రాహుల్‌కు అభినందనలు తెలిపాడు. "కంగ్రాట్స్ బాపు(అక్షర్ పటేల్). ఈ సరికొత్త ప్రయాణంలో మీకు అంతా మంచి జరగాలని కోరుకుంటున్నాను. నా వంతు సపోర్ట్ మీకు ఎల్లప్పుడూ ఉంటుంది" అని రాహుల్ తన ఇన్‌స్టా స్టోరీలో రాసుకొచ్చాడు.

ఐపిఎల్ తొలి సీజన్ మ్యాచ్‌లకు బుమ్రా దూరం

గాయపడ్డ జస్ప్రీత్ బుమ్రా ఈనెల 22 నుంచి ప్రారంభమయ్యే ఐపిఎల్ తొలి సీజన్ మ్యాచ్‌లకు దూరమయ్యాడు. పూర్తి ఫిట్‌నెస్ సాధించకపోవడమే ఇందుకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. ఏప్రిల్ తొలి లేదా రెండో వారంలో ముంబయి జట్టుతో కలిసే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఎన్ని మ్యాచ్‌లకు బుమ్రా దూరంగా ఉంటాడో ఇప్పుడే చెప్పలేమని ఆ ఫ్రాంచైజీ తాజాగా ప్రకటించింది. బుమ్రా తొలి వారం ముగిశాక వస్తే.. అప్పటికే ముంబయి ఐదు మ్యాచ్‌లు ఆడేస్తుంది. ప్లేఆఫ్స్ రేసులో వెనుకబడకుండా ఉండాలంటే వాటిలో మూడు మ్యాచుల్లోనైనా ముంబయి గెలుపొందాల్సి ఉంది. ముంబయి ఇండియన్స్ మార్చి 23న తొలి మ్యాచ్‌లో చెన్నై సూపర్ కింగ్స్‌తో తలపడనుంది.



లక్ష్యసేన్ ఓటమి

ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్

లండన్: ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత షట్లర్ల పోరాటం ముగిసింది. క్వార్టర్స్‌కు చేరిన ఏకైక షట్లర్ లక్ష్యసేన్ శుక్రవారం జరిగిన కీలక పోరులో ఓటమిపాలయ్యాడు. హోరాహోరీ పోరులో ఎస్.ఎఫ్. లీ చేతిలో 21-10, 21-16తో ఓటమిపాలయ్యాడు. మరో పోటీలో వై.క్యూ. షీ(చైనా) 21-18, 21-16తో సింగపూర్‌కు చెందిన లోహ్‌పై నెగ్గి సెమీస్‌కు చేరాడు. ఇక మహిళల క్వార్టర్‌ఫైనల్లోనూ ట్రీసా జోలీ-గాయత్రి గోపీచంద్ జంట ఓటమిపాలైంది. ఏకపక్షంగా సాగిన ఈ మ్యాచ్‌లో గాయత్రి-ట్రీసా 14-21, 10-21తో చైనా షట్లర్ల చేతిలోనే ఓటమిపాలయ్యారు.

తొలి మ్యాచ్‌కు హార్దిక్ దూరం
22నుంచి ఐపిఎల్ సీజన్-18



ముంబయి: ఇండియన్ ప్రిమియర్ లీగ్ సీజన్-18 ప్రారంభానికి ముందే ముంబయి ఇండియన్స్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆ జట్టు కెప్టెన్ హార్దిక్ పాండ్యా తొలి మ్యాచ్‌కు దూరం కానున్నాడు. ఈ నెల 22న కోల్‌కతా నైట్‌రైడర్స్-రాయల్ చాలెంజర్స్ బెంగళూరు మధ్య జరిగే తొలి మ్యాచ్‌తో ఈ ఐపిఎల్ ప్రారంభమవుతుంది. ఆ మరుసటి రోజు మార్చి 23న ముంబయి ఇండియన్ తొలి మ్యాచ్‌ను చెన్నైలోని చిదంబరం స్టేడియంలో చెన్నై సూపర్‌కింగ్స్‌తో మ్యాచ్ ఆడనుంది. ఆ మ్యాచ్‌కు కెప్టెన్‌కు హార్దిక్ పాండ్యా దూరం కానున్నాడు. హార్దిక్ పాండ్యా గత సీజన్‌లోనే ముంబయి కెప్టెన్‌గా చేశాడు. అతని కెప్టెన్సీలో ఆ జట్టు పాయింట్ల పట్టికలో చివరి స్థానంలో నిలిచింది. అంతే కాకుండా పాండ్యా కెప్టెన్సీలో లక్నో సూపర్ జెయింట్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ముంబయి మూడోసారి స్లో ఓవర్ రేట్ నమోదైంది. దీంతో పాలక మండలి నిబంధనల ప్రకారం.. మూడుసార్లు స్లో ఓవర్ గురవడంతో కెప్టెన్‌కు రూ.30లక్షల జరిమానాతో పాటు మ్యాచ్ నిషేధం విధించింది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68